21-03Pg1fBTVLK.qxd:21-03Pg1fBTVLK.qxd 1/1/02 6:50 AM Page 1




తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విశాఖపట్నం
: fb.com/vaartha Digital
Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
21-3-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 49 పేజీలు: 16 వెల: 6.50

గోదావరిలో ఐదుగురు బిటెక్ విద్యార్థులు గల్లంతు 2లో

వంట గ్యాస్ సమస్య లేదు: మంత్రి నాదెండ్ల 5లో






## కొత్త రైల్వేహాల్ట్‌లతో
# మరింత అభివృద్ధి

**కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు**

**హరిశ్చంద్రపురం, మందస, పాతపట్నం స్టేషన్లలో నూతన హాల్ట్‌లను ప్రారంభించిన కేంద్ర మంత్రి**

**శ్రీకాకుళం, మార్చి 20 ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లాలో రైల్వే వ్యవస్థను మరింత విస్తృత పరుస్తామని కేంద్ర పౌర విమానయన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శుక్రవారం నాడు జిల్లాలోని కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ లో విశాఖ గుణపూర్ పాసింజర్ రైలు హాల్ట్ ను రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తో కలసి ప్రారంభించారు. అదేవిధంగా మందస రోడ్ రైల్వే స్టేషన్ లో బెర్హాంపూర్ విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌ను కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. పాతపట్నంలో రోర్కెల గుణపూర్ రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌ల నూతన హాల్టు ను స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావులతో కలసి ప్రారంభించారు. అంతకు ముందు మూడు చోట్ల ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ అభివృద్ధికి హామీ ఇచ్చి కొద్ది రోజుల్లోనే హాల్ట్ మంజూరు అయ్యేలా కృషి చేసిన రామ్మోహన్ >>2

## అకాల వర్షాల నష్టంపై
# 48 గంటల్లో నివేదిక

**ఇప్పటిదాకా నష్టం రూ. 63 కోట్లు**

**ఎల్పీజీ సిలిండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వం**

**విద్యాసంస్థలు, ఆలయాలకు గ్యాస్ పంపిణీలో ప్రాధాన్యం**

**ఉన్నతాధికారులతో సమీక్ష జరిపిన సిఎం చంద్రబాబు**



అకాల వర్షాలు, గ్యాస్ సరఫరాపై ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా సమీక్ష దృశ్యం

**విజయవాడ, మార్చి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రకృతి వైపరీత్యాలు కారణంగా పంట నష్టం వాటిల్లిన రైతులకు తక్షణం నష్ట పరిహారం అందించే దిశలో అధికారులు చర్యలు చేపట్టాలని ఏపీ సీఎం చంద్రబాబు అంచనావేసారు. పంట నష్టాన్ని సత్వరం అంచనావేసి, అంతే వేగంగా రైతులకు నష్ట పరిహారం అందివ్వాలన్నారు. ఈ విషయంలో వ్యవసాయ,రెవెన్యూశాఖల అధికారులు అత్యంత సమన్వయంతో వ్యవహరించాలన్నారు. భారీ గాలులు, అకాల వర్షాలు, వడగళ్లతో రాష్ట్రంలో సంభవించిన పంట నష్టంపై రెండు రోజుల్లో పూర్తి స్థాయి అంచనాలు రూపొందించాలని >>2

## మరో 3 రోజులు వర్షసూచన

**విజయవాడ, మార్చి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఏపీ తీరం, దాని పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 3.1 కిలో మీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, దీని ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపింది. ముఖ్యంగా >>2

## అవినాశ్ రెడ్డికి బెయిలు మంజూరు
### ఎపి లిక్కర్ స్కాం కేసు

**విజయవాడ, మార్చి21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడైన ముప్పిడి అవినాశ్ రెడ్డికి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. అవినాశ్‌కు సుప్రీం కోర్టు రెగ్యులర్ బెయిల్‌ను మంజూరు చేసింది. మద్యం కుంభకోణం కేసులో ఏ7గా ఉన్న అవినాశ్ రెడ్డిని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మూడు రోజుల పాటు కస్టడీలోకి >>2



వార్త

పూర్వీకుల ఘనతమీద బతికే వారిని మృతవీరుల జాబితాలో చేర్చవచ్చు.

న-లాసన్

# చమురు గతి ఇంతే!

అనుకున్నంతా అయ్యింది. చమురు రవాణాలో ఎక్కడ విఘాతమేర్పడినా దాని ప్రభావం ప్రపంచమంతటా, దేశాల అంతర్గతంగానూ వాటి వినియోగదారులను కలవరపెడ్తోంది. గత అనుభవాలన్నీ ఇదే చెబుతున్నాయి. ఇప్పటికే దేశంలో ఎల్‌పిజి సరఫరాపై ఒత్తిడి కొనసాగుతోంది. ఏం కాదులే. మన దగ్గర ఎన్నో నిల్వలున్నాయి. అవి అయ్యేలోపు యుద్ధం ఆగినా ఆగిపోవచ్చుననే ధీమాతో ఉన్న కేంద్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. యుద్ధం తొలిరోజుల్లోనే దేశానికి 70శాతానికిపైగా ఎల్‌పిజి గ్యాస్‌ను అందించే ఖతార్ ఎల్‌పిజి రిఫైనరీ మూసివేసి తాము ఎల్‌పిజి సరఫరా చేయలేమని ముందే చెప్పింది. అప్పుడే కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌వాడకాన్ని పొదుపు చేయించాలని గ్యాస్‌బుకింగ్‌లపై కోత విధించింది. ముందు బుకింగ్ కీ బుకింగ్‌కీ మధ్య వ్యవధి21 రోజుల్నించి 25 రోజులకు పెంచింది. కమర్షియల్ గ్యాస్‌కు పూర్తిస్థాయి కోత పెట్టింది. అంతవరకు తమ ఆహార అవసరాలు వీధుల్లోనైనా తీర్చుకోవచ్చునన్న నమ్మకంతో తమ ఉపాధి ఉద్యోగాల కోసం ఉదయాన్నే ఇంటి నుంచి బయటికెళ్లేవారు. కేంద్రం నిర్ణయం పుణ్యమా! అని రోడ్డుపై చిన్న చిన్న అల్పాహార సంస్థలు, హోటళ్లు, హాస్టళ్లు సైతం గ్యాస్ సిలిండర్ దొరక్క మూత పెట్టేశాయి. తమవద్ద గ్యాస్ సిలిండర్ నిల్వ ఉంచుకున్న హోటళ్లు మాత్రం తాము గ్యాస్ బండలు బ్లాక్‌లో కొంటున్నామన్న మిషతో ఒక్కో ఆహార ఆధరువుకు పదిపైసల గ్యాస్ చార్జీలు వసూలు చేస్తున్నారు. గత కాలపు కోవిడ్ రోజుల్లో మానవాళి ఆరోగ్య సూత్రాలను నేర్చుకుంటే ఈ కాలపు యుద్ధ పర్యవసానంగా ఆహార పొదుపు నేర్చుకుంటున్నారు. కానీ అన్నీ మన మంచికేనని సరిపెట్టుకోగలిగిన పరిస్థితులు మృగ్యమౌతున్నాయి. ఇప్పుడు ఖతార్ మీద ఇరాన్ దాడులు చేయడంతో మరో మార్గాంతరాన్వేషణలో భారత్ అధికారులు యోచన చేయాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఎల్పీజీకి ప్రత్యామ్నాయం దొరికేలోపు గ్యాస్ వినియోగాన్ని అదుపు చేసే పనిలో కేంద్రం కసరత్తు చేస్తోంది. పైప్‌డ్ నేచురల్ గ్యాస్ నెట్‌వర్క్‌కోసం వ్యూహాలు సిద్ధం చేస్తోంది. హాస్టళ్లు, హోటళ్లు, తీర్థస్థలాల్లో ఆహార వినియోగదారులకు బాగా 'సెగ' తగిలింది. పైప్‌డ్ నేచురల్ గ్యాస్ సరఫరా ఉన్న అపార్ట్‌మెంట్ వాసులకు ఎల్‌పిజి సరఫరా 'కట్' చేస్తూఉత్వర్వులిచ్చింది. తొలి నాటి నిర్ణయం బెడిసికొట్టేసరికి వాణిజ్య సంస్థలకు 30 శాతం పెంచినట్లు చెబుతోంది. కానీ ఇప్పటివరకు మూసివేసిన చిన్న చిన్న రోడ్‌సైడ్ హోటళ్లు ఏమీ పునరుద్ధరణ జరుగలేదు. ఉపాధి కోసం పల్లెల నుంచి పట్నం వచ్చిన నిరుద్యోగులు సైతం ప్యాక్‌డ్ ఫుడ్‌తో కడుపు నింపుకోవాల్సిన పరిస్థితి ఉంది. చేతిలో డబ్బులు అయిపోయాక వారి గతేం కాను. ఇక కేంద్ర ప్రభుత్వం తాజాగా చేసిన ప్రకటన ఒకటి విచిత్రంగా ఉంది. పైప్‌డు నేచురల్ గ్యాస్ నెట్‌వర్క్‌ను వేగవంతం చేసే రాష్ట్రాలకు 10 శాతం అదనంగా ఎల్‌పిజిని కేటాయిస్తామని హామీ ఇచ్చింది.దేశానికి అవసరమయ్యే ఎల్‌పిజిలో 60 శాతానికి పైగా కోతపడింది. పిఎన్‌జి సరఫరాలో గృహావసరాలను, పారిశ్రామికావసరాలను నిరంతరాయంగా కొనసాగించగలమని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ వెల్లడించారు.ప్లాన్‌బాగానే ఉంది కాని దాని అమలు మాత్రం చాలాకష్టమని గ్యాస్ వినియోగదారులు అంచనా వేస్తున్నారు. మార్కెట్‌లో చమురు రేటు బాగా పెరిగింది. ఈ విషయాన్ని ఇరాన్ ముందే హెచ్చరించింది. అయినా ట్రంప్ దూకుడు ఆపలేదు. ప్రపంచదేశాలన్నీ చమురుసెగను తట్టుకోలేక తత్తరబిత్తర పడుతున్నాయి. హార్మూజ్ జలసంధి నుంచి వచ్చే చమురు నౌకలపై త్వరలో ఇరాన్ టోల్‌టాక్స్ వసూలుచేసే ఆలోచనలో ఉంది. ఏదిఏమైనా 'ఎంకిపెళ్లి సుబ్బిచావుకు వచ్చిందన్న' చందాన ఉంది. మళ్లీ చమురు, దాని ఉత్పత్తుల రేట్లుబాగా పెరుగుతాయి. వచ్చేఐదేళ్లూ ఎల్‌పిజి తయారీ సామర్థ్యాన్ని 17 శాతానికి తగ్గిస్తామని ఖతార్ రిఫైనరీ ప్రకటించడం ఆందోళనకరం. ఎల్‌పిజికి ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తున్న పరిస్థితుల్లో ఇలాంటి సమాచారం వినేందుకు భారతదేశానికి పెద్ద కుదుపే. చమురు గ్యాస్ వంటి పెట్రోలియం ఉత్పత్తులకు కొరత ఏర్పడితే అన్ని రంగాల్లోనూ వెనుకబాటుతనం ఆవహిస్తుంది.ఇది తథ్యం. పశ్చిమాసియా యుద్ధం కారణంగా లక్షల టన్నుల మేర ముడి చమురు పర్షియన్ గల్ఫ్ జలాల్లో నౌకల్లో చిక్కుకుపోయాయన్న సమాచారం భారతీయుల్ని ఆందోళనలో ముంచింది.16.7లక్షల టన్నుల ముడిచమురు 3.2 లక్షల టన్నుల ఎల్‌పిజి, దాదాపు రెండు లక్షల టన్నుల ద్రవరూప సహజవాయువు 22 సరకు రవాణా నౌకల్లో ఉండిపోయాయి.గల్ఫ్‌లోనే ఉండిపోయాయి. అక్కడి నుంచి బయలుదేరి బయట పడితే తప్ప భారత్‌లో వినియోగదారుల అవసరావు తీరవు. తీరా ప్రస్తుత తరుణంలో అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు 119డాలర్లకు చేరుకుంది. ఇరాన్ గ్యాస్ ఫీల్డ్ మీద ఇజ్రాయెల్ దాడి చేసింది. గల్ఫ్ దేశాల్లోని ఇంధన కేంద్రాలపై ఇరాన్ దాడులు ప్రారంభించింది. ఇలా ఇప్పుడు చమురు నిక్షేపాలపై యుద్ధ ఛాయలు కనిపిస్తున్నాయి. మరోపక్క రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోళ్లపై అమెరికా ఆంక్షలను సడలించడం, రష్యా చమురు భారత్‌కు చేరుకోవడం ఆశావహంతో ఉన్నా, ఇక్కడకు చేరుకుంటేనే కానీ భారత్ ఊపిరి పీల్చుకోలేదు. పెట్రోల్, డీసెల్, ధరలు పెంపు ముఖం పట్టాయి. ఇదే జరిగితే ఎక్కడో యుద్ధానికి ఇక్కడ భారతీయులు చేతులు ముడు చుకొని కూర్చోవాల్సిందే. చమురు, కొరత, రవాణా వ్యయం పెరిగితే ప్రపంచంలో ఆహార సంక్షోభం తలెత్తుతుందని ప్రపంచ వాణిజ్య సంస్థ ఆందోళన వెలిబుచ్చింది.



దేశభక్తులెప్పుడూ దేశం కోసం తాము మరణిస్తామంటారు. కాని ఎవరినైనా చంపుతామని మాత్రం అనరు.

బర్ట్రండ్ రస్సెల్



మాట్లాడిన మాట, వదిలిన బాణం, జరిగిన కాలం, వదులుకున్న అవకాశం, ఈ నాలుగు వెనక్కిరావు.

ప్లినీ

# ఎవరి 'పంచాంగం' వారిదే!

*ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని రోజుల్లో వందల వేల సంవత్సరాల క్రితం రూపొందించిన శాస్త్రాలలో గ్రహాల స్థితిగతులు, ప్రధానంగా సూర్యచంద్రుల గమనాలు, గ్రహణాలు, నిమిషాలు, సెకండ్లతోసహా స్పష్టంగా పేర్కొన్నారు. అవి తు.చ తప్పకుండా జరుగుతున్నాయి. అలాంటి శాస్త్రాల ఆధారంగా చెబుతున్న పంచాంగ శ్రవణాల పట్ల ప్రజల్లో విశ్వసనీయత తగ్గిపోతున్నది.*

దామెర్ల సాయిబాబ

ఏ శాస్త్రమైనా అధ్యయనాల మీద అధ్యయనాలు చేసి మదించే కొద్దీ కొత్త విషయాలు ఆవిష్కరిస్తుంటాయి. శాస్త్రాలను అధ్యయనం చేసిన పండితులు, స్వామిజీలు, పీఠాధిపతులు తదితర వైజ్ఞానిక సంపన్నులు వాటిలోని ఆంతర్యాన్ని, మారిన కాల, మాన పరిస్థితులకు అనుగుణంగా సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో సరళమైన భాషలో విషయాలు అందించాలి. అప్పుడే శాస్త్రాలపై, వాటిని బోధించే పెద్దలపైనా, వాటన్నింటికి మూలమైన దైవంపైన విశ్వాసం, నమ్మకం ఏర్పడుతుంది. ఆరాధనా భావం పెరుగుతుంది. ఇందులో దైవం కంటే ఈ పెద్దల పాత్రే కీలకం. అందుకే వారు ప్రవచించడం, ప్రబోధించడమే కాదు వీలైనంతవరకు ఆచరించి అనుకరణీయంగా వ్యవహరించి ఆదర్శప్రాయంగా వారి ప్రవర్తన, వ్యవహారశైలి ఉండాలి. అందుకు భిన్నంగా ప్రవర్తన ఉన్నట్లు ప్రజలు గ్రహిస్తే వారి బోధనలకు విశ్వసనీయత ఉండదు. అందుకే కొందరు మఠాధిపతులకు, స్వామిజీలకు, పీఠాధిపతులకు ఎక్కడలేని ప్రజాదరణ ఉండి, జనం వారి ప్రవచనాలు వినేందుకు తండోపతండాలుగా వస్తుంటే మరికొందరు స్వామిజీలు, పీఠాధిపతుల ప్రసంగాలకు రాజకీయ సమావేశాలకు తరలించినట్లు కూలి జనాన్ని తరలించాల్సి వస్తున్నది. వాస్తవంగా చూస్తే భారత్‌లో శాస్త్రాలకు కొరత లేదు. ఏది ఎప్పుడు ఎలాచేయాలో అనే వివరాలు మన శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. పండగ, పబ్బాలే కాదు, వివాహక కార్యక్రమాలు, చివరకు అంత్యక్రియలకు కూడా ఎలా చేయాలో స్పష్టంగా పేర్కొంటున్నాయి. కానీ దాన్ని అర్థం చేసుకొని అన్వయించడంలోనే అసలు విషయం దాగి ఉంది. తెలుగు ప్రజలకు ప్రధానమైన పండుగల్లో పవిత్రమైన, ప్రధానమైన తొలిపండుగ ఉగాది. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు ప్రపంచంలోని తెలుగువారందరూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతారు. సకల సౌకర్యాలతో అష్టలక్ష్ములతో తులతూగాలని శుభాకాంక్షలు అందచేసుకుంటూ పండుగలు జరుపుకోవడం ఆనవాయితీ. పండుగలు సమాజానికి జీవనాధారం. అవి నూతనోత్తేజాన్ని ఇస్తాయన్న విషయం కాదనలేం.గత స్మృతులు గుర్తు తెచ్చుకొని బంధుమిత్రులతో ఆనందంగా గడిపే తొలి పండుగ ఈ ఉగాది. అన్నింటికంటే మించి పల్లె సీమల్లో ముఖ్యంగా రైతుల జీవనంతో ఈపండుగ ముడిపడి ఉంది. వ్యవసాయానికి సంబంధించి రైతులు భవిష్యత్ ప్రణాళికను సిద్ధం చేసుకునేందుకు ఈ పండుగ సందర్భంగా స్వామిజీలు, పీఠాధిపతులు, పండితులు చేసే పంచాంగ శ్రవణంపై ఆధారపడుతుంటారు. ఇది ఇప్పటికిప్పుడే పుట్టింది కాదు. శతాబ్దాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతూ వస్తున్నది. ఉగాది రోజు తెలుగు రాష్ట్రాల్లో మారుమూల గ్రామాల్లో సైతం కొత్త సంవత్సరంలో వర్షాలు ఎలా వస్తా యి? ఏ పంటలకు అనుకూలం? ప్రభుత్వాల పరిస్థితి కూడా ఈ పంచాంగ శ్రవణంలో పంచాంగాలు చూసి పండితులు వివరిస్తుంటారు. అందుకోసం గ్రామంలో ఉన్న రైతులు ఉగాది రోజు దేవాలయం వద్దనో, లేక గ్రామపంచాయతీ కార్యాలయం వద్దనో సమావేశమై పంచాంగ శ్రవణాన్ని శ్రద్ధాభక్తులతో ఆలకిస్తారు. రాష్ట్రస్థాయిలో కూడా ప్రభుత్వమే అధికారికంగా ఈ పంచాంగ శ్రవణాన్ని ఏర్పాటు చేస్తున్నది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియా వచ్చిన తర్వాత దీనికి ప్రాముఖ్యత పెరిగిందనే చెప్పొచ్చు. అయితే ఒకనాడు ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న ఈ పంచాంగ శ్రవణం రానురాను ఆదరాభిమానాలు కోల్పోతున్నదేమోననిపిస్తున్నది. పర్యావరణంలో వచ్చిన మార్పులు కారణంగా రుతువులు గతి తప్పుతున్నాయి. వరుణదేవుని అడుగులు వాతావరణ శాస్త్రజ్ఞులకే అందడం లేదు. మానవుడు పర్యావరణానికి చేస్తున్న హానితో అందుకు ప్రకృతి కూడా రెట్టింపు స్థాయిలో 'తమలపాకుతో నువ్వొట్లంటే తలుపు చెక్కతో నేనట్లంటా' అన్నట్లు ప్రతీకారం తీర్చుకుంటున్నది. మరొకపక్క పంచాంగాలు లెక్కకు మించి వస్తున్నాయి. శాస్త్రం ఒక్కటే అయినా అన్వయించే సిద్ధాంతకర్తల ఆలోచనా

## ఒక్క మాట

సరళికి, అవసరాలకు అనుగుణంగా మారిపోతున్నది. ఇందులో రాజకీయాలు ప్రవేశించాక పరిస్థితి మరింతదిగజారింది. ప్రతియేడాది రాజకీయ పార్టీలకు సంబంధించి ఆయా పార్టీల ఆఫీసుల్లో ఈ పంచాంగ శ్రవణాలు జరుగుతున్నాయి. కానీ ప్రతి పార్టీకి కొత్త సంవత్సరంలో ఎదురు ఉండదని చెప్తుంటారు.నాయకుల జాతకాల ప్రకారం వారి మాటలకు తిరుగు ఉండదని అధికారంలో ఉన్నవారైతే తిరిగి అఖండ విజయం సాధిస్తారని, ప్రతిపక్షంలో ఉన్నవారైతే అధికారంలోకి రావడం ఖాయమని చెప్తుంటారు. పొరుగునున్న ఆంధ్రప్రదేశ్‌లో మొన్న ఉగాది పండుగ రోజు జరిగిన పంచాంగ శ్రవణంలో కూటమి ప్రభుత్వానికి ఎదురుండదని, మరింత ప్రజాభిమానం సంపాదించుకొని ముందుకు సాగిపోతుందని పంచాంగ శ్రవణకర్త వివరించారు. వైఎస్సార్ సిపికి సంబంధించి జరిగిన పంచాంగ శ్రవణంలో ప్రభుత్వం మీద అసంతృప్తి పెరుగుతున్నదని, అది వైఎస్సార్‌సిపి పార్టీకి అనుకూలంగా మారే అవకాశాలున్నట్లు చెప్పుకొచ్చారు.ఇక తెలంగాణలో అధికారికంగా జరిపిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో ముఖ్యమంత్రికి ఈ యేడాది రాజయోగం బలంగా ఉందని, రాజకీయ అడ్డంకులను, ప్రత్యర్థి వ్యూహాలను పటాపంచలు చేసి శత్రువులపై పైచేయి సాధిస్తారని,పంచాంగశ్రవణం చేసిన సిద్ధాంతి వివరించారు. ముఖ్యమంత్రి తీసుకొనే కొన్ని సంచల నిర్ణయాలు రాష్ట్ర భవిష్యత్‌నే మార్చేస్తాయని, అలాగే ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలు అంతర్గత కలహాలు సృష్టించే శక్తులు చురుగ్గా ఉంటాయని కూడా చెప్పారు. ఈ యేడాది ముఖ్యమంత్రి జాతీయ స్థాయిలో గుర్తింపు, గౌరవం పొందుతారని, ఇక ప్రధాన ప్రత్యర్థి పార్టీ బిఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో ప్రభుత్వంలో ఉన్న లోటుపాట్లతోపాటు పాలనా వైఫల్యాలు కొనసాగితే ప్రజల్లో అసంతృప్తి పెరిగి, ఈ యేడాది ప్రతిపక్షానికి గణనీయంగా బలం చేకూరే అవకాశం ఉందన్నారు.ఇకపోతే ప్రపంచవ్యాప్తంగా యుద్ధమేఘాలు కమ్ముకున్నా భారత్‌లో గ్యాస్ సిలిండర్ ధర ఇప్పటివరకు పెరగలేదు. ఇకముందు కూడా పెరగబోవు అంటూ భవిష్యత్‌లో ఏం జరగబోతుందో ముందే ఊహించే దృక్పథం ఉన్న దూర దృష్టి కలిగిన మోడీ నాయకత్వమే ఇందుకు కారణమని మరో పంచాంగకర్త బిజెపి కార్యాలయంలో జరిగిన పంచాంగ శ్రవణంలో వివరించారు. శాస్త్రం ఒక్కటే అయినా శాస్త్రుల అన్వయంలో మారిపోతున్నాయి.గతంలో ఒకసారి ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంచాంగ శ్రవణకర్తకు ముఖ్యమంత్రిని పొగడ్తలతో ముంచెత్తే కార్యక్రమం అప్పగించారు. అందుకు ఆయన ససేమిరా అన్నారు. ఆనేతకు గ్రహబలాలు బాగాలేవని, ముఖ్యమంత్రిగా ఆయనకు అదే చివరి అవకాశమని ఆ పంచాంగకర్త గట్టిఅభిప్రాయమే కాదు నమ్మకం కూడా.దీంతో అప్పటికప్పుడు ఏకంగా పంచాంగ కర్తనే మార్చి మరొకరితో చెప్పించారు. ఆయన అన్నట్టే ఆ ముఖ్యమంత్రికి అదే చివరి అవకాశమైంది. మన శాస్త్రాలకు ఎంతో విశిష్టతఉంది. ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని రోజుల్లో వందల వేల సంవత్సరాల క్రితం రూపొందించిన శాస్త్రాలలో గ్రహాల స్థితిగతులు, ప్రధానంగా సూర్యచంద్రుల గమనాలు,గ్రహణాలు,నిమిషాలు, సెకండ్లతో సహా స్పష్టంగా పేర్కొన్నారు. అవి తు.చ తప్పకుండా జరుగుతున్నాయి.అలాంటి శాస్త్రాల ఆధారంగా చెబుతున్న పంచాంగ శ్రవణాల పట్ల ప్రజల్లో విశ్వసనీయత తగ్గిపోతున్నది. ముఖ్యంగా సనాతనధర్మ సంప్రదాయాలను, దైవాలను విశ్వసించేవారిలో ఎలాంటి ప్రభావం చూపుతున్నదో పండితులు, స్వామిజీలు ఆలోచించాలి. సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరుగుతున్నా అంతకు రెట్టింపుస్థాయిలో మానసిక ఒత్తిడి నుంచి బయటపడి ప్రశాంతత కొరకు దైవం పట్ల మొగ్గుచూపే వారి సంఖ్య అంతకురెట్టింపు స్థాయిలో పెరుగుతున్నది. దేవుడికి సమర్పించుకునే కానుకలు ఏ మేరకు సద్వినియోగం అవుతున్నాయనే విషయాన్ని పట్టించుకోకుండా కోట్లాది రూపాయలు సమర్పించుకుంటున్నారు. మరొకపక్క పవిత్రమైన దేవాలయ పాలకమండళ్లలో నేర చరిత్రులు చోటు దక్కించుకుంటున్నారు. సాక్షాత్తు కలియుగ దైవం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు కలిగిన తిరుపతి వెంకన్న కూడా ఈదోపిడీ, దగానుంచి తప్పించుకోలేకపోతున్నారు. మఠాధిపతులు, స్వామిజీలు, సంతులు, పండితులు వైజ్ఞానిక జ్ఞానసంపన్నులు తదితరపెద్దలందరూ మనస్సుపెట్టి ఆలోచించాల్సిన తరుణమిది. ఏదో కొందరు రాజకీయ నేతల మెప్పుకోసం స్వలాభాల ఆరాటంలో కొందరు స్వామిజీలు పంచాంగ పండితులు శాస్త్రాలను కూడా వక్రీకరిస్తున్నారనే అభిప్రాయం జనంలోరానురాను బలపడుతున్నది. ఇది సమాజానికి ఏమాత్రం మంచిది కాదు. ●

# 'ఆస్కార్'కు మనం దగ్గరా.. దూరమా?

ఎల్లబోయిన వెంకటేశ్వర్లు

ప్రపంచ సినీ రంగంలో అత్యున్నత గౌరవంగా భావించే ఆస్కార్ అవార్డులు ప్రతి సినిమా దేశానికి ఒక లక్ష్యం, ఒక గౌరవ ప్రతీక. భారతీయ సినిమా శతాబ్ద కాలం చరిత్ర కలిగి ఉన్నా, ఈ అంతర్జాతీయ వేదికపై మన విజయాలు చాలా పరిమితంగానే ఉండటం ఒక ఆలోచనీయ విషయం. ఒకప్పుడు భారతీయ చిత్రాల గొప్పతనం దేశ సరిహద్దులకే పరిమితమైపోయిందనే విమర్శలు వినిపించేవి. ఈ నేపథ్యంలో గతం, వర్తమానం, భవిష్యత్తును ఒకే దృశ్యంలో చూసినప్పుడు భారతీయ సినిమాల ప్రయాణం ఎంతో ఆసక్తికరంగా కనిపిస్తుంది. భారతదేశం నుంచి ఆస్కార్‌కు వెళ్లిన చిత్రాల చరిత్రను చూస్తే, కొన్నే చిత్రాలు అంతర్జాతీయ ఫీచర్ విభాగంలో నామినేషన్ దశను చేరుకున్నాయి. అవి కూడా గెలుపు తలుపు దగ్గరే ఆగిపోయాయి. అంటే ప్రతిభలో కొరత లేదు కానీ, గెలుపు కోసం అవసరమైన మరికొన్ని అంశాల్లో వెనుకబాటుతనం ఉందని స్పష్టమవుతుంది. అయితే ఇటీవల జరిగిన కొన్ని విజయాలు మాత్రం ఈ దృశ్యాన్ని కొంతవరకు మార్చాయి. ఒక పాటకు, ఒక డాక్యుమెంటరీకి వచ్చిన అవార్డులు భారతీయ సినీ ప్రపంచానికి ఒక కొత్త ఆశను ఇచ్చాయి. సరైన కథ,సాంకేతిక నైపుణ్యం, అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం ఉంటే మన సినిమాలు కూడా గెలవగలవని అవి నిరూపించాయి. ఇంతవరకు మన సినిమాలు ఆస్కార్ స్థాయిలో ఎందుకు నిలబడలేకపోయాయనే ప్రశ్నకు సమాధానం వెతికితే, అనేక కారణాలు కనిపిస్తాయి. మన కథలు స్థానికంగా బలంగా ఉన్నా,అవి ప్రపంచ ప్రేక్షకులకు పూర్తిగా చేరే విధంగా రూపకల్పన కావడం కొన్ని సార్లు కష్టమవుతోంది. భాషా భేదం,భావ వ్యక్తీ





కరణలోని సాంస్కృతిక ప్రత్యేకతలు, అనువాదంలో కోల్పోయేభావం ఇవి ఒక గోడలా మారుతున్నాయి. అంతేకాదు, ఆస్కార్ వేదికపై ప్రభావం చూపే ఓటర్లలో ఎక్కువ మంది పాశ్చాత్య ప్రపంచానికి చెందినవారు కావడం వల్ల, వారిఅభిరుచులు,వారి కథన శైలులు ఎక్కువగా ప్రాధాన్యం పొందుతున్నాయి. మన సినిమాల సంగీతం, నాటకీయత, భావోద్వేగాల వ్యక్తీకరణను వారు ఎప్పుడూ అదే తీవ్రతతో స్వీకరించకపోవడం కూడా ఒక కారణం. మరో ముఖ్యమైన అంశం ప్రచారం. ఒక సినిమా ఎంత గొప్పదైనా, అది ప్రపంచవ్యాప్తంగా చర్చకు రాకపోతే, సరైన వేదికలలో ప్రదర్శించబడకపోతే, ఓటర్లకు చేరుకోకపోతే, అవార్డు అవకాశాలు తగ్గిపోతాయి. ఈవిషయంలో భారతీయ సినిమాలు చాలాకాలంగా వెనుకబడిఉన్నాయి. సరైన ప్రదర్శన, సమర్థమైన ప్రచారం, అంతర్జాతీయ స్థాయిలో వ్యూహం ఇవి అన్నీ కలిసి పనిచేయాలి. అదే సమయంలో విడుదల వ్యవస్థ కూడా కీలకం. ప్రపంచంలోని ప్రముఖ నగరాల్లో ప్రదర్శన లేకపోతే, విమర్శకుల దృష్టికి రాకపోతే, ఒకమంచి సినిమా కూడా గుర్తింపు పొందకుండా మిగిలిపోతుంది.అయితే ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయి.ప్రపంచం చిన్నదవుతోంది. భారతీయ సినిమాలు ప్రపంచవ్యాప్తంగా సులభంగా అందుబాటులోకి వస్తున్నాయి. కథలలో కూడా మార్పుకనిపిస్తోంది. స్థానికతను కాపాడుకుంటూనే, ప్రపంచంలోని ప్రతి మనిషికి అనుభూతి కలిగించే అంశాలను మనచిత్రాలు స్పృశిస్తున్నాయి.సాంకేతికంగా కూడా మన సినిమా స్థాయిపెరిగింది. అంతర్జాతీయ ప్రమాణాలతో పోటీ పడే స్థాయికి చేరుకుంటోంది. ఈ మార్పులు కొనసాగితే, ఆస్కార్ వేదికపై భారత దేశంస్థానం మరింత బలపడే అవకాశం ఉంది. కాబట్టి 'ఆస్కార్‌కు ఆస్కారం లేదు" అని తేల్చేయడం సరైన దృక్కోణం కాదు. ఇప్పటివరకు పూర్తి స్థాయిలో అందుకోలేకపో యామన్నది నిజం. కానీ మార్పు ప్రారంభమైంది. సరైన దిశలో అడుగులు వేస్తే,కథలో విశ్వవ్యాప్తతను పెంచితే,ప్రచారంలో నైపుణ్యం చూపితే, భవిష్యత్తులో ఆస్కార్ గెలుపు భారతీయ సినిమాలకు సాధారణ విషయంగా మారే రోజులు దూరంలో లేవు. ●

# ప్రజావాక్కు



## యుద్ధం వద్దు!

యుద్ధం పేరుతోకొన్ని దేశాలవారు ఐక్య రాజ్యసమితి ఆశయాలు, వాటి నిబంధనలు తుంగలో తొక్కి ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇది చాలావిచారకరం.ఈ కారణంగా అంతర్జాతీయస్థాయిలో మానవత్వం మంట కలిసిపోయింది. బాంబుల దాడులు, భీకారమోతలు, చమురు దేశాల్లోకలకలం ప్రపంచశాంతి నినాదం,కరువైంది. ప్రాణ నష్టం,ఆస్తులనష్టం గురించిఆలోచించి అడుగు ముందుకు వేయాలి. సామాజిక అభివృద్ధి, మానవ హక్కులు కాపాడేందుకు 1945 సంవత్సరంలో న్యూయార్క్ నగరంలో ఏర్పాటు అయింది. చట్టం, భద్రత, సామాజిక అభివృద్ధి మానవ హక్కుల పరిరక్షణ ఈ సంస్థ ప్రధాన కర్తవ్యం. ఐక్య రాజ్య సమితి ఆశయాలు నిజం చేయడానికి బదులు ప్రస్తుతం మంటకలిపారు. అణుబాంబులు వ్యాప్తి కారణంగాఅమాయక ప్రాణాలుబలి.పర్యావరణ పరిరక్షణ కరువు. ఆస్తినష్టం, ప్రాణనష్టం ఇక ఎవరికి లాభం ఆలోచించాలి.

- ఎల్. ప్రఫుల్ల చంద్ర, హైదరాబాద్

## సైబర్ నేరాలను అరికట్టాలి

ప్రభుత్వరంగబ్యాంకుల్లో ప్రజలు తమకష్టార్జితాన్ని పొదుపు రూపంలోదాచుకుంటారు.అయితే సైబర్‌నేరగాళ్ల ప్రజలకు తెలియకుండానే ఈ సొమ్మును దొంగిలిస్తున్నారు. ఇలాంటి మోసాలకు గురైన బాధితులు పోలీసులకు, బ్యాంకులకు, సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదులు చేసినా అవిదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండటం ఆందోళన కలిగించే విషయం. బ్యాంకులు స్తంభింపజేసిన సొమ్మును తిరిగి పొందడం కేవలం సైబర్‌సెక్యూరిటీ సిబ్బంది ద్వారానే సాధ్యమని చెబుతున్నాయి. అధికారులు సకాలంలో స్పందించి, సాంకేతికతనుఉపయోగించి బాధితులు పోగొట్టుకున్న సొమ్మును తిరిగి వచ్చేలా చేయాలి.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

## నఎస్సీ,ఎస్టీలకు న్యాయం చేయాలి

తెలంగాణ రాష్ట్రంలోని మండల కేంద్రాలలో భూముల విలువ ధరలుపెరగడంతో ఎస్సీ,ఎస్టీలఇండ్ల స్థలాలు అగ్రవర్ణాలు ఆక్రమించుకోవడం అక్రమ నిర్మాణాలు చేయడం జరిగింది.ఈవిషయమై భూమిని కోల్పోయిన వారు భూకబ్జాదారులపై పోలీసులకు ఫిర్యాదు చేసి 3 సంవత్సరాలు దాటుతున్నా న్యాయం జరగడం లేదు.

- రాపాక రవీందర్, జనగాం

## అప్పుల ఊబిలో భాగ్యనగరం!

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రం ఇప్పుడు ఒక అంతుచిక్కని ప్రశ్నగా మారింది.అసెంబ్లీ సాక్షిగాప్రభుత్వంప్రవేశపెట్టిన బడ్జెట్ గణాంకాలు చూస్తుంటే అంకెల గారడీతో ప్రజల కళ్లకు గంతలు కట్టే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. కాంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ తాజా నివేదిక ప్రకారం, రాష్ట్రం ఊహించని ఆర్థిక సంక్షోభంలోకూరుకుపోతోంది.2025-26ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2.29 లక్షల కోట్ల రెవెన్యూ రాబడిని అంచనా వేయగా,జనవరి 2026 నాటికి కేవలం 60.23 (రూ.1,38,371 కోట్లు) మాత్రమే వసూలైంది. రెవెన్యూ వ్యయం మాత్రం రూ. 1,48,937 కోట్లకు చేరింది. అంటే, సంక్షేమం పాలన కోసం వచ్చే ఆదాయం కంటే ఖర్చేఎక్కువగా ఉంది. ఫలితంగా రాష్ట్రం రూ. 10,566కోట్ల భారీ రెవెన్యూ లోటును నమోదు చేసింది. 2026 జనవరి నాటికే రాష్ట్రం అప్పుల పరిమితిని దాటేసింది.

- దిడ్డి శ్రీకాంత్, హైదరాబాద్

## యుద్ధాలతో గుణపాఠాలు

ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలు మానవాళికి ఎన్నో పాఠాలు నేర్పుతున్నాయి. అయినప్పటికీ దేశాల మధ్య విభేదాలు పెరిగినప్పుడల్లా యుద్ధం అనే మార్గానికే మొగ్గుచూపడం ఆందోళనకర విషయం. ప్రస్తుతం పరస్పరం పోరాడుతున్న దేశాల వైఖరి రోజురోజుకు కఠినంగా మారుతోంది. ఈ పరిస్థితి చూస్తే ఈఘర్షణ కూడా దీర్ఘకాలిక యుద్ధంగా మారేప్రమాదం ఉందనే భావన కలుగుతోంది. ఇటీవల ప్రపంచం రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వంటి సంఘర్షణల వల్ల ఎంతటి విధ్వంసం సంభవించిందో చూసింది.ప్రస్తుతం ప్రపంచంలో అణ్వాయుధాలు వంటి అత్యంత ప్రమాదకర ఆయుధాలు అందుబాటులో ఉన్న నేపథ్యంలోయుద్ధాలు భయంకర పరిణామాలకు దారితీయవచ్చు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## టూరిజాన్ని అభివృద్ధి చేయాలి

మన దేశంలో దాదాపు 30 రకాల పర్యాటక రంగాలున్నాయి. అందులో ఒకటి విమానరంగం.పూర్వం బేగంపేట విమానాశ్రయంలోవచ్చేపోయే విమానాలను చూడటానికిపల్లెటూర్ల నుండి పనిమీద బంధువుల ఇంటికి హైద్రాబాద్ వచ్చినవారు టికెట్టుకొని పర్యాటకుల కోసం ఏర్పాటు చేసినమిద్దె మీద ప్రదేశానికి వెళ్ళి చూసేవారు. ఇదే మాదిరిగా రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌లో కూడా పర్యాటకులకు ఇటువంటి సదుపాయాన్ని రూ.50లోపు ప్రవేశ రుసుమును నిర్ణయించాలి.

- పి. లక్ష్మి, సికింద్రాబాద్

# అటవీ సంరక్షణ సామాజిక బాధ్యత

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచ అటవీ దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 21 న నిర్వహించబడుతుంది. 2012లో ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం ప్రకటించినప్పటి నుండి, ప్రపంచ దేశాలు అన్ని రకాల చెట్లు అడవుల ప్రాముఖ్యతపై అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. 2012, నవంబరు 28న యునెస్కో వారిచే తీర్మానించబడిన ప్రపంచ అటవీ దినోత్సవం, 2013 మార్చి 21న తొలిసారిగా నిర్వహించబడింది. మానవుల ఆర్థిక, సామాజిక,సాంస్కృతిక, పర్యావరణ అభివృద్ధికి అడవులు ఎంతో అవసరమని తెల్పడం ప్రపంచ అటవీ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం. ప్రస్తుత, ముందు తరాల వారికి అడవుల ప్రాముఖ్యత, ప్రయోజనాలను తెలియజేయడం కోసం ఈ దినోత్సవం రోజున వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు. మానవాళి మనుగడకు అడవులు సోపానాలు. మన జీవావరణ సంపదలు. ఇవి అనేక జీవరాసులకు ఆవాసాలు. పర్యావరణ సమతుల్యానికి పట్టుకొమ్మలు.నదీనదాలకు వర్షాధారాలు. అడవులు మూలికా ఔషధాలకు నిలయాలు. జీవకోటికి ప్రాణ వాయువును అందించడంలోనూ, భూమి కోతను నివారించి భూసారాన్ని పరిరక్షించడంలోనూ ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అందుకే వృక్షో రక్షిత రక్షితః అన్నారు. వృక్షాలను మనం రక్షిస్తే, అవి మనల్ని రక్షిస్తాయి. ఇవి ప్రభుత్వం పరిరక్షణలో వుంటాయి. మానవుల, పశువుల సంచారానికి, కలప కొరకు చెట్లను నరకడం ఈ అడవులలో నిషేధం. భారత దేశంలో ఈ అడవులు 40.1 మిలియన్ హెక్టార్లు అనగా 53శాతం వరకు విస్తరించి వున్నాయి. ఇవి ప్రభుత్వ పరిరక్షణలో ఉన్నప్పటికీ మానవులు, పశువులు సంచారానికి అనుమతి వుంది. అయితే ఈ అడవులకు ఎటువంటి నష్టాన్ని కలుగచేయకూడదు. భారత దేశంలో ఈ అడవులు 21.5 మిలియన్ హెక్టార్లు అనగా 29శాతం వరకు విస్తరించివున్నాయి. **కేటాయించని అడవులు:** ఇవి చెట్లు నరకడానికి, మరియు పశువుల సంచారానికి ఎటువంటి నియమ నిర్బంధాలు లేవు. భారత దేశంలో ఈ అడవులు 13.1 మిలియన్ హెక్టార్లు అనగా 18మేరకు విస్తరించి వున్నాయి. అడవులు ప్రపంచంలో 4.057మిలియన్ హెక్టా ర్ల భూభాగంలో విస్తరించి వున్నాయి. ప్రపంచ అటవీ విస్తీ ర్ణతలో భారత దేశంలో అటవీ విస్తీర్ణత 1.85 శాతంవుంది. అంటే 2శాతం కూడా లేదు.తలసరి అటవీ విస్తీర్ణత 0.05 హెక్టార్లు మాత్రమే వుంది. 2003 ఇండియన్ సెట్ ఫారెస్టు రిపోర్టుప్రకారం 69.79మిలియన్ హెక్టార్ల అడవులు భారత దేశ భూభాగంలో విస్తరించి వున్నాయి. ఇది దేశ భౌగోళిక విస్తరణలో 21.23 శాతంగా వుంది. ఈ నివేదిక 2013 ప్రకారం అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 34.572 చదరపు



కిలోమీటర్ల విస్తీర్ణంలో అడవులు విస్తరించి ఉన్నాయి. రాష్ట్ర భూభాగంలో 22.64శాతం కలిగి వున్నాయి. దేశ అటవీ విస్తీర్ణత ప్రకారం ఆంధ్ర రాష్ట్రం 9వ స్థానాన్ని కలిగి వుంది. ఇక తెలంగాణ రాష్ట్రంలో 29.242 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అడవులు విస్తరించి ఉండేవి. రాష్ట్ర భూభాగంలో 25.46 శాతం మేరకు విస్తరించి ఉండేవి. కానీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఖమ్మం జిల్లాలోని 327 ముంపు గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌లో కలపడం వల్ల రాష్ట్ర అడవుల విస్తీర్ణం 26,903.70 చ.కి.మీ.కు తగ్గింది. ఇది రాష్ట్ర వైశాల్యంలో 23.99 శాతం.దేశ అటవీ విస్తీర్ణతలో 4.22 శాతం వరకు విస్తరించి, తెలంగాణ 12వ స్థానాన్ని కలిగి వుంది. ఈ సర్వేప్రకారం భారత దేశంలో అడవులు ఎక్కువగావున్న రాష్ట్రాలలో మధ్యప్రదేశ్ మెదటి స్థానాన్ని రెండవ స్థానాన్ని అరుణాచల్ ప్రదేశ్ మూడవ స్థానాన్ని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు వరుస స్థానాల్లో వున్నాయి. అత్యధిక అడవులు కలిగిన కేంద్రపాలిత ప్రాంతాల్లో మెదటి స్థానంలో నికోబార్ రెండవ స్థానంలో దాద్రా నగర్ హవేలి వున్నాయి. భారత దేశంలో అత్యధిక శాతం అడవులు కలిగిన రాష్ట్రాలు మిజోరం మెదటి స్థానంలో అరుణాచల్‌ప్రదేశ్ రెండవ స్థానంలో వున్నాయి. దేశంలో అత్యల్ప శాతం అడవులు కలిగిన రాష్ట్రాలు వరుసగా హర్యానా మెదటి స్థానంలో పంజాబ్ రెండో స్థానంలో బీహార్ మూడోస్థానంలో వున్నాయి. అత్యల్పశాతం అడవులు కలిగిన కేంద్రపాలిత ప్రాంతాలు వరుసగా పుదుచ్చేరి మెదటి స్థానంలో ఢిల్లీ రెండవ స్థానంలో వున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏటా లక్షాడెబ్బై వేల ఎకరాల అడవులు అంతరిస్తున్నట్లు శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. చెట్లను నరికివేసి వాటి నుంచి వచ్చే కలపను ఇంధనంగా వాడటం,పశువుల పచ్చిక బయళ్లుగా మార్చడం,వంటచెరకు, గృహ నిర్మాణాలు, గృహోపకరణాలకు ఉపయోగించడం, పెరుగుతున్న ప్రపంచ జనాభా అవసరాలను తీర్చడానికి జనావాసాలుగా మార్చడం వంటి చర్యలను అటవీ నిర్మూలనకు కారణాలు.అలాగే అడవుల్లో సంభవిస్తున్న అగ్ని ప్రమాదాలతో విలువైన జాతుల అటవీ సంపదకు నష్టం వాటిల్లుతోంది. భారీ వృక్షాలు, అడవి జంతువులతోపాటు ఆయుర్వేద గుణాలున్న విలువైన మూలికా వృక్షాలు, మొక్కలకు చేటుకలుగుతోంది. సమస్త జీవకోటికి ప్రత్యక్షంగా,పరోక్షంగా అడవులే ఆధారం. అయితే, ప్రస్తుతం అంతరించిపోతున్న అడవులు జీవ వైవిధ్యానికి గొడ్డలిపెట్టుగా మారాయి. ఒక వైపు అక్రమార్కుల చేతిలో పడి అడవులు చిక్కిపోతుంటే, మరోవైపు మానవ తప్పిదాలు అటవీ సంపదకు చేటు చేస్తున్నాయి. వేసవిలో ఏటా అగ్ని ప్రమాదాలకు వృక్ష సంపద ఆహుతవుతోంది. పెరుగుతున్న జనాభా తమ అవసరాలకు మించి అడవులను నరికివేస్తున్న వైనం. దీంతో ఉష్ణోగ్రతలు పెరిగి జల, వాయు కాలుష్యాలు అధికమై సమస్త జీవరాసుల మనుగడకు ముప్పువాటిల్లే ప్రమాదముంది. అటవీనిర్మూలన జరిగిన ప్రదేశాల్లో భూమికోతకు గురవుతుంది.బంజరు భూమిగా రూపాంతరం చెందుతుంది. వైల్డ్‌లైఫ్ యాక్ట్ ప్రకారం భూభాగంలో33శాతం అడవులుండాలి.ప్రస్తుతం24.12 శాతం మాత్రమే ఉన్నాయి. ఇది చాలా విచారించదగ్గ విషయం. అంతరించిపోతున్నవాటిని కాపాడుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉంది. అడవుల రక్షణ బాధ్యత అందరిది. ●

గమనిక : ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# నేడు రంజాన్ సెలవు

## టెన్త్ ఇంగ్లీష్ పరీక్ష ఏప్రిల్ 2కు వాయిదా

**విజయవాడ, మార్చి 20, ప్రభాతవార్తప్రతినిధి:** రంజాన్ సెలవును ఈ నెల 21వ తేదీకి మార్పు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొదట మార్చి 20 న ప్రభుత్వం రంజాన్ సెలవుగా ప్రకటించింది. మతపెద్దల నిర్ణయం మేరకు 21వ తేదీ శనివారం రంజాన్ పర్వ దినాన్ని నిర్వహిస్తుండటంతో ఆ రోజును సెలవుగా ప్రకటిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా పనిచేస్తాయి. కాగా శనివారం జరగాల్సిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్షను వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు. ఈ పరీక్షను ఏప్రిల్ 2న నిర్వహించనున్నట్లు తెలిపారు.

## జాబ్ క్యాలెండర్‌తో కొత్త తెలుగు సంవత్సరం ప్రారంభం

### - రాష్ట్ర బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్

**విజయవాడ, మార్చి 21,ప్రభాతవార్తప్రతినిధి:** నూతన తెలుగు సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం పై ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ హర్షం వ్యక్తంచేశారు గ్రూప్1, గ్రూప్ 2, ఇంజనీరింగ్, టీచింగ్, యూనిఫాం సర్వీసెస్ పోస్టులతో కలిపి మొత్తం 10,060 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి 2026 సంవత్సరపు జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం ఆనందదాయకమైన విషయం గా పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటీగా ఉపాధి అవకాశాలు అమలు చేస్తోంది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువతకు ఉత్తేజాన్ని అందించిన గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు ,ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్,రాష్ట్ర మంత్రి లోకేష్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు యువతకు అవకాశాలు కల్పిస్తూ, వారి ఆకాంక్షలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయం రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుంది.ఉద్యోగార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, పోటీ పరీక్షలకు సంసిద్ధం కావాలని మాధవ్ పిలుపు ఇచ్చారు.ఈమేరకు బిజెపి రాష్ట్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు.

### భార్యాభర్తల అనుమానాలకు పిల్లలను బాధ్యులను చేయొద్దున: హైకోర్టు

**విజయవాడ మార్చి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** భార్యభర్తల అనుమానాలకు పిల్లలను బాధ్యులను చేయవద్దు అంటూ ఏపీ హైకోర్టు కీలక వాఖ్యలు చేసింది.పిల్లల హక్కులకు భంగం కలిగించే విషయంలో బాధ్యతా రాహిత్యంతో వ్యవహరించవద్దని స్పష్టం చేసింది.తన భార్య వివాహేతర సంబంధాన్ని రుజువు చేయడానికి పిల్లలకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించాలని కోరుతూ విజయనగరానికి చెందిన ఓ వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తిరస్కరించింది. ఈ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భార్యపై ఆరోపణలను నిరూపించడానికి పిల్లలను పావులుగా ఉపయోగించడం సరైంది కాదని స్పష్టం చేసింది. వివాహేతర సంబంధాన్ని నిరూ పించేందుకు ఇతర ఆధారాలను సేకరిం చాల్సిందే గానీ, పిల్లలకు డీఎన్ఏ పరీక్షలు చేయాలని కోరకూడదని తేల్చి చెప్పింది. ఒక వ్యక్తి వ్యక్తిగత ప్రయోజనాల కోసం పిల్లల హక్కులు, వారి భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడంను అనుమతించబోదని హైకోర్టు పేర్కొంది. ఈ కేసులో పిటిషన్ దాఖలు చేసిన వ్యక్తికి హైకోర్టు రూ.3000 జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని విజయనగరం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థకు చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు ఇటీవల తీర్పు వెలువరించారు.

### క్రీడా పరికరాల ఉత్పత్తి రంగంలో ఎపికి సానుకూలతలున్నాయి - నీతి ఆయోగ్

**విజయవాడ మార్చి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** క్రీడా పరికరాలను తయారుచేసి, ఎగుమతి చేసేందుకు దేశంలో ఆంధ్రప్రదేశ్ , గుజరాత్, తమిళనాడులలో పూర్తి సానుకూల పరిస్థితులున్నాయని నీతి అయోగ్ వెల్లడించి. రియలైజింగ్ ద ఎక్స్‌పోర్ట్ పొటెన్షియల్ ఆఫ్ ఇండియాస్ స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ సెక్టార్ తాజా నివేదికలో ఆంధ్రప్రదేశ్ కు ఉన్న విభిన్నమైన సానుకూలతలనున్నటు నీతి ఆయోగ్‌పేర్కొంది. ప్రపంచ క్రీడా వస్తువుల మార్కెట్ విలువ 2036 నాటికి ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా ప్రస్తుతం క్రీడా పరికరాల ఎగుమతుల్లో చైనా ప్రాబల్యం అధికం. అన్ని విభాగాల్లో దాని వాటా 40%-50% వరకు ఉంది. తర్వాత అమెరికా, తైవాన్, జర్మనీ, వియత్నాం మార్కెట్‌ను పంచుకున్నాయి. 2013లో వియత్నాం, భారత్‌ల ఎగుమతుల వాటా సమానంగా ఉన్నా తర్వాత వియత్నాం తన ఎగుమతుల పరిమాణాన్ని 3 రెట్లు పెంచుకొంది. భారత్ మాత్రం అక్కడే ఉండి పోయింది. భారత్ వాటా 0.5%కే పరిమితమైంది. 2024 లో 275 మిలియన్ డాలర్ల విలువైన పరికరాలను ఎగుమతి చేసింది. వచ్చే పదేళ్లలో 8.1 బిలియన్ డాలర్ల ఎగుమతులు చేసే అవకాశం ఉంది. ఎగుమతుల మార్కెట్‌లో 11% వాటాను ఆక్రమించే వీలుంది. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రయత్నిస్తే 2036 కల్లా 54 అదనపు ఉద్యోగాలు సృష్టించొచ్చు. వీటిని అంది పుచ్చుకొనే అవకాశా లు గుజరాత్, ఆంధ్రప్రదేశ్ తమిళనాడులకు ఎక్కువగా ఉన్నా ఇందులో ఏపీ ముందు వరుసలో ఉంటుంది. ఏపీ క్రీడా విధానంలో క్రీడా పరికరాలు, దుస్తుల తయారీకి ప్రత్యేక ఆర్థిక మండళ్లు.

# తిరుమలలో సిఎం చంద్రబాబు

## నేటి ఉదయం కుటుంబంతో కలసి శ్రీవారి దర్శనం

## మనవడి పేరున అన్నప్రసాదం వితరణ



తిరుమలలో సిఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న టిటిడి అధికారులు

**తిరుమల,మార్చి 20ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తన మనవడు నారాదేవాన్ష్ పుట్టినరోజున శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకోవడానికి శుక్రవారంరాత్రి తిరుమలకు చేరుకున్నారు. ఆయన సతీమణి నారా భువనేశ్వరితో కలసి వచ్చిన సిఎంకు తిరుమల గాయత్రి నిలయంఅతిథి గృహం వద్ద సాదర స్వాగతం లభించింది. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, రాష్ట్రమంత్రి రామానారాయణరెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. రాత్రికి చంద్రబాబు కుటుంబంతో పద్మావతిలోనే బసచేస్తారు. నేటి ఉదయం 6.05గంటలకు విశ్రాంతి గృహం నుండి బయలుదేరి వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్‌కు చేరుకుంటారు.ఉదయం 6.20గంటల నుండి 7.10గంటల వరకు శ్రీవారి ఆలయంలోనే గడుపుతారు. వెంకన్న దర్శనానంతరం అక్కడ నుండి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనం చేరుకుని మనవడి పేరున 44లక్షలు రూపాయలు విరాళం అందిస్తారు. స్వయంగా భక్తులకు అల్పాహారం వితరణ చేస్తారు. అనంతరం గాయత్రి నిలయం అతిథి గృహంచేరుకోనున్నారు. ఉదయం 10గంటలకు అతిథి గృహం నుండి బయలుదేరి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును సందర్శిస్తారు. ఆ తరువాత అత్యాధునిక ఆహార పదార్థాల పరీక్షించే పరిశోధనశాలను ప్రారంభించనున్నారు. అక్కడ నుండి నేరుగా ఉదయం 11.30గంటలకు తిరుమల నుండి తిరుగు ప్రయాణమవుతారు. ప్రతి ఏటా చంద్రబాబు మనవడు పుట్టినరోజున అన్నప్రసాదానికి విరాళాలివ్వడం తెలిసిందే. ఈ ఏడాది కూడా అదే సాంప్రదాయాన్ని పాటిస్తున్నారు. మహద్వారం నుండి ప్రవేశం ఉన్నా ఆయన ఆలయ సాంప్రదాయాలను పాటిస్తూ వైకుంఠం క్యూకాంప్లెక్స్ నుండే ఆలయంలోనికి చేరుకోనున్నారు.

**- భారీ భద్రత నడుమ సిఎం పర్యటన:** రెండు రోజుల తిరుమలపర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయన కుటుంబం పూర్తిగా పటిష్ట భద్రత నడుమ సాగుతోంది. విశ్రాంతి గృహం వద్ద కూడా పరిమితంగానే జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలను అనుమతించారు.సిఎం పర్యటన ప్రాంతాల్లో పూర్తిగా మీడియాను నిషేధించారు. ఆలయం సమీపంలో గొల్లమండపంపైనే మీడియాప్రతినిధులు వేచివుండాలని, ఆ తరువాత ఎక్కడా కూడా అనుమతిలేదని సిఎం భద్రత సిబ్బంది ఆదేశాలమేరకు సహకరించాలని తిరుపతి జిల్లా పోలీసు యంత్రాంగం విజ్ఞప్తి చేసింది. పూర్తిగా సిఎం కుటుంబంతో కలసి దేవుని దర్శనానికి రావడంతో మీడియాతో కూడా ఎక్కడా మాట్లాడటానికి ఆసక్తిచూపడంలేదు. సిఎం వెంట తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఉన్నారు. రాత్రి 9గంటలకు తిరుమలకు చేరుకున్న మంత్రి నారాలోకేశ్ దంపతులకు టిటిడి అధికారులు స్వాగతం పలికారు.

**- తిరుపతి హెలిపాడ్‌లో సాదర స్వాగతం:** సాయంత్రం ఉండవల్లినుండి తిరుపతిలోని ఎస్వీవ్యవసాయకళాశాల హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. తిరుపతిలో ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న, రాష్ట్రమంత్రి అనగాని సత్యప్రసాద్, సిఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, డిఐ జీ షిమోజి బాయ్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, సంయుక్తకలెక్టర్ ఆర్ గోవిందరావు, మున్సిపల్ కమిషనర్ మౌర్య, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, చిత్తూరు ఎంపీ దగ్గు మల్ల ప్రసాద రావు, తిరుపతి, చంద్రగిరి, సత్యవేడు, పూతలపట్టు, జీడీ నెల్లూరు ఎమ్మెల్యేలు శ్రీనివాసులు, పులివర్తి నాని, కోనేటి ఆదిమూలం, మురళి మోహన్, థామస్, మాజీ మంత్రి పరసారత్నం, తుడా ఛైర్మన్ సి దివాకర్ రెడ్డి తదితరులు స్వాగతం పలికారు.

# ప్రధాన హామీ మాట నిలబెట్టుకున్నాం

### - నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్ విడుదల ఒక వరం



**తిరుపతి,మార్చి 20ప్రభాతవార్తప్రతినిధి:** టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ప్రధానమైన జాబ్‌క్యాలండర్ విడుదల చేసి మాట నెరవేర్చుకున్నామని టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, ప్రధాన కార్యదర్శి సి.దివాకర్‌రెడ్డి తెలిపారు. జాబ్‌క్యాలండర్ విడుదలలో యువనేత,మంత్రి నారాలోకేశ్ చొరవ ప్రత్యేక అభినందనీయమన్నారు. శుక్రవారం తిరుపతిలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.ఎన్నికల సమయంలో నారాలోకేష్ పాదయాత్ర చేసినప్పుడు చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు యువతీ యువకుల సమస్యలు అన్ని జిల్లాల్లోనూ విన్నారన్నారు. అందులో ఇచ్చిన హామీల్లో జాబ్ క్యాలెండర్ ప్రకటించారని తెలిపారు. రాష్ట్రంలో ఏఏ జిల్లాలో దేనికి ప్రాముఖ్యతనివ్వాలి ,అక్కడ ఏ పరిశ్రమ పెడితే ఉపయోగపడుతుంది అని ఆలోచనతో జరిగిందన్నారు. విద్యాశాఖ మంత్రిగా 3వేల పైచిలుకు ఉద్యోగాలకు సంతకం చేసిన ఘనత లోకేశ్‌దేనన్నారు. గడచిన 20 నెలల్లో 6,28,342 ఉద్యోగాలు ఇచ్చారన్నారు. దివ్యాంగులకు కూడా ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించి వారిలో ఆనందం చూశామన్నారు. గత 20 ఏళ్లుగా నియామకాలు లేక ఇబ్బంది పడుతున్న నిరుద్యోగులకు ఈ జాబ్ క్యాలండర్ వరంలాంటిదన్నారు. గతంలో జాబ్ క్యాలెండర్ అని చెప్పి నాలుక గీసుకోవడానికి కూడా ఉపయోగంలేని క్యాలెండర్ విడుదల చేశారని వైసిపిపై విమర్శలు గుప్పించారు. ఆగస్టు నెలలో ఏ నియామకాలు, అక్టోబర్లో ఏ నియామకాలు, గ్రూప్ 1, గ్రూప్ 2 సంబంధించి ఏ నియామకాలు నోటిఫికేషన్ కు సంబంధించి ఎప్పుడు విడుదల చేస్తారనే సమాచారం స్పష్టంగా తెలియజేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో జాబ్ క్యాలెండర్ పై నిరుద్యోగ యువతీ యువకులు అడిగితే 19 కేసులు బనాయించారన్నారు.టిడిపితిరుపతి ప్రధాన కార్యదర్శి సి.దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉగాది పండుగ కొత్త జీవితం లోకి అడుగిడుతుందో అదే విధంగా నారా లోకేష్ పది వేల పోస్టులు విడుదల చేసి జాబ్ క్యాలెండర్ ద్వారా యువతకు ఆనందం కలిగించారన్నారు. రాష్ట్రంలో యువతకు ఇదొక మేలుకొలుపు అన్నారు. వైసిపి ప్రభుత్వం కూల్చే ప్రభుత్వం అయితే నిలబెట్టి కట్టేటువంటి ప్రభుత్వం కూటమిప్రభుత్వం అన్నారు. గతంలో ఇచ్చిన హామీలు కన్నా ఎక్కువగా పనులు చేసి చూపిస్తున్నటువంటిది ఎన్డీఏ కూటమి యువత అన్ని విధాల ముందుగా ఉండాలని ప్రయత్నం చేస్తున్నటువంటి నాయకుడు మా యువనేత నారా లోకేష్ అన్నారు.ఈ మీడియా సమావేశంలో టిడిపి నాయకులు శ్రీధర్‌వర్మ,రవినాయుడు, నరసింహయాదవ్, సుగుణమ్మ, కంకణాల రజినీకాంత్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# వంటగ్యాస్ సమస్యలేదు..

### గృహావసరాల గ్యాస్ వాణిజ్య ప్రయోజనాలకు మళ్లిస్తే కఠిన చర్యలు: మంత్రి నాదెండ్ల



**విజయవాడ,మార్చి 20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో గ్యాస్ కొరత లేదని ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరాపై ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, జాయింట్ కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన.. ప్రజల్లో అపోహలు, ఆందోళనలు కలగకుండా చర్యలు తీసవాలని అధికారులను ఆదేశించారు. గృహ అవసరాల కోసం ఉద్దేశించిన వంట గ్యాస్ ఎక్కడా కొరత లేదని మంత్రి తెలిపారు. గ్యాస్ నిల్వలు సరిపడా ఉన్నాయని ఆయిల్ కంపెనీలు కూడా తెలియజేశాయని చెప్పారు. అయితే గ్యాస్‌ను పక్కదారి పట్టించడం, అక్రమంగా వాణిజ్య అవసరాలకు మళ్లించడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరించాల్సిందిగా సూచించారు. జిల్లాల్లో గ్యాస్ ఏజెన్సీలు, డిస్ట్రిబ్యూటర్ల వద్ద బుకింగ్స్, డెలివరీలు, పెండింగ్ అంశాలను నిరంతరం సమీక్షించాలని జాయింట్ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అనుమానాస్పద లావాదేవీలు లేదా సరఫరాలో అక్రమాలు గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.గ్యాస్ కొరతపై ప్రభుత్వం పూర్తిగా దృష్టి సారించిందన్నారు. కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యామ్నాయ మార్గాలను కూడా అన్వేషిస్తున్నామని చెప్పారు. ఈ నెల 21న రావాల్సిన గ్యాస్ నౌక 25న చేరుతుందని కేంద్రం సమాచారం ఇచ్చిందని వెల్లడించారు. ప్రజలు అపోహలకు లోనుకాకుండా అవసరమైనంత మేరకే గ్యాస్ బుక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అధికంగా బుకింగ్స్ చేస్తే ఇతరులకు ఇబ్బందులు తలెత్తుతాయని హెచ్చరించారు. గ్యాస్ బుకింగ్స్ ఆన్‌లైన్ ద్వారానే చేయాలని, ఓటీపీ వచ్చిన తర్వాతే బుకింగ్ ఖరారవుతుందని తెలిపారు.

## అగ్నిమాపక శాఖలో మంటలార్పే డ్రోన్లు, రోబోలు!

**విజయవాడ మార్చి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర అగ్నిమాపక శాఖ ఆధునీకత సాంకేతికతను అందిపుచ్చుకుంటుంది.ఈ శాఖ తన విధానంలో త్వరలో డ్రోన్లు, రోబోలు వినియోగించుకుంటుంది. ప్రధానంగా బహుళ అంతస్తులు, ఎత్తైన భవనాలు, రసాయన పరిశ్రమలు వంటి వాటిలో ప్రమాదాలు జరిగినప్పుడు వీటిని వినియోగించనున్నారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా పరీక్షలు చేపట్టి, పలు యూజ్ కేసులు సిద్ధం చేశారు. ఇకపై క్షేత్రస్థాయిలో పూర్తిగా వాడాలని నిర్ణయించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో తొలుత 6 డ్రోన్లు, ఒక రోబో కొనుగోలు చేయనున్నారు. మే నెలకల్లా ఇవి అందుబాటులోకి వస్తాయి. వాటి పనితీరు ఆధారంగా రెండో దశలో మరిన్ని కొంటారు. ముఖ్యంగా మంటల వ్యాప్తిని గుర్తించి, అదుపు చేసేందుకు వీటిని వినియోగిస్తారు. డ్రోన్ల సహాయంతో అగ్ని ప్రమాద ప్రాంతం మొత్తాన్ని చిత్రీకరిస్తారు. మంటలు ఎక్కడి నుంచి మొదలయ్యాయి? ఎటువైపు వ్యాప్తి చెందుతున్నాయనేది అంచనా వేస్తారు. డ్రోన్ పంపించే దృశ్యాల ఆధారంగా అగ్నిమాపక బృందాలు రియల్‌టైమ్ ప్రణాళికను రూపొందించుకుని సహాయ చర్యలు చేపడతాయి. ఎత్తైన భవనాల్లో, పొగతో నిండిపోయిన భవనాల్లో మనుషులు చిక్కుకుపోయిన డ్రోన్లకు అమర్చిన థర్మల్ సెన్సర్ల సాయంతో వారిని గుర్తిస్తారు. ఎత్తైన , బహుళ అంతస్తుల భవనాల్లో ప్రమాదాలు జరిగినప్పుడు డ్రోన్ల ద్వారా ఫైర్ సప్రెషన్ కెమికల్స్ చల్లి వాటిని అదుపు చేస్తారు. మంటల సమీపానికి సిబ్బంది వెళ్లేందుకు అవకాశం లేని, ప్రాణాపాయం అధికంగా ఉన్న సందర్భాల్లో రోబోలను వినియోగిస్తారు. వీటిని మంటల సమీపానికి రిమోట్ కంట్రోల్ ద్వారా పంపించి నీరు, ఫోమ్ వంటి వాటిని మంటలపై నేరుగా పిచికారీ చేయిస్తారు. ఈ రోబోలు అధిక ఉష్ణోగ్రతలు వేడిమిని తట్టుకుని పనిచేస్తాయి.ఫ్యాక్టరీలు, గ్యాస్ లీకేజీలు ఉన్న ప్రాంతాలు, భారీ పేలుళ్ల వంటివి చోటుచేసుకున్న సందర్భాల్లో వీటిని వాడతారు.

## టిడిపి అధిష్ఠానానికి ఎంపి పుట్టా సంజాయిషీ

### - డ్రగ్స్‌తీసుకున్నారనే అభియోగాలపై సీల్డ్‌కవర్‌లో వివరణ

**విజయవాడ,మార్చి20,ప్రభాతవార్తప్రతినిధి:** టీడీపీ అధిష్ఠానం ఇచ్చిన సంజాయిషీ లేఖకు ఎంపీ పుట్టా సతీష్ వివరణ ఇచ్చినట్లు కీలక సమాచారం.పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించినందుకు గాను టీడీపీ హైకమాండ్ ఎంపీ మహేశ్ కుమార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనిపై స్పందించిన ఎంపీ, తన వివరణను ఒక సీల్డ్ కవర్‌లో పార్టీ కార్యా లయానికి పంపారు. ఈ లేఖను అందుకున్న ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, వెంటనే చంద్రబాబుకి పంపించారు. ప్రస్తుతం ఈ లేఖలో ఎంపీ ఏం వివరణ ఇచ్చారనేది రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. హైదరాబాద్ శివార్లలోని మొయినాబాద్ ప్రాంతంలో జరిగిన ఒక ప్రైవేట్ పార్టీపై పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ పార్టీలో డ్రగ్స్ వినియోగం జరిగినట్లు సమాచారం రావడంతో ఈగల్ బృందం (న్యి గ్ని) రంగంలోకి దిగింది. పార్టీలో పాల్గొన్న పలువురికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌తో పాటు పలువురికి డ్రగ్స్ తీసుకున్నట్లు తేలింది.డ్రగ్స్ కేసులో ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ పట్టుబడిన వ్యవహారంపై చంద్రబాబు మొదటి నుంచి సీరియస్‌గా ఉన్నారు. ఇటీవల తిరుపతిలో జరిగిన ఎమ్మెల్యేల సమావేశంలో కూడా ఎంపీ పేరును ప్రస్తావిస్తూ చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ పేరు డ్రగ్స్ కేసులో వినిపించడమే కాకుండా, పరీక్షల్లో పాజిటివ్ అని తేలడంతో టీడీపీ తీవ్రంగా పరిగణించింది.

### ఎల్పీజీని అంతర్జాతీయ మార్కెట్లో అమ్మడానికి వీల్లేదు

### - హైకోర్టు కీలక ఆదేశాలు

**విజయవాడ మార్చి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా దేశవ్యాప్తంగా వంట గ్యాస్ కొరత ఏర్పడిన నేపథ్యంలోద హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. చమురు శుద్ధి సంస్థలు ఎల్పీజీని అంతర్జాతీయ మార్కెట్లో విక్రయించడానికి వీల్లేదని స్పష్టం చేసింది.ఈ మేరకు కాన్ఫిడెన్స్ పెట్రోలియం ఇండియా లిమిటెడ్‌కు ఆదేశాలు జారీ చేసింది. దేశంలో ఎల్పీజీ కొరత ఉన్న సమయంలో చమురు శుద్ధి సంస్థలు అంతర్జాతీయ మార్కెట్లో విక్రయాలకు పాల్పడితే అది సామాన్య ప్రజలకు తీరని నష్టంతో పాటు కష్టాలను కలిగిస్తుందని కోర్టు స్పష్టం చేసింది. వినియోగదారులకు వంట గ్యాస్ సరఫరా చేసేందుకు వీలుగా గ్యాస్ను పంపిణీదారులకు మాత్రమే సరఫరా చేయాలని ఆదేశించింది. దేశంలోని చమురు శుద్ధి కర్మాగారాలు ప్రొపేన్, బ్యూటేన్ నిల్వలను గరిష్టంగా ఎల్పీజీ ఉత్పత్తి కోసం ఉపయోగించడంతో పాటు ఉత్పత్తి చేసిన ఎల్పీజీని ప్రభుత్వ రంగ సంస్థలైన ఐఓసీఎల్, హెచ్పీసీఎల్, బీపీసీఎల్లకు అందుబాటులో ఉంచి దానిని కేవలం దేశీయ వినియోగదారులకు మాత్రమే సరఫరా చేయాలంటూ ఈ నెల 5న జారీ చేసిన స్వీయ ఉత్తర్వుల కఠిన అమలుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ వ్యవహారంలో కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ, కాన్ఫిడెన్స్ పెట్రోలియం ఇండియా లిమిటెడ్లను ఆదేశించింది.

### ఎపి ఎండోమెంట్స్ ట్రైబ్యునల్ ఛైర్మన్ రిటైర్డ్ జిల్లా న్యాయమూర్తి ఎన్.నాగరాజు నియామకం..

విజయవాడ మార్చి 20 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడకు చెందిన రిటైర్డ్ జిల్లా న్యాయమూర్తి ఎన్.నాగరాజును ఏపీ ఎండోమెంట్స్ ట్రైబ్యునల్ ఛైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. బాధ్యతలు స్వీకరించిన తేదీ నుండి 3 సంవత్సరాలు లేదా 65 సంవత్సరాల వయస్సు పూర్తి అయ్యే వరకు నియామకం ఉంటుంది.

# తిరుమల సమాచారం

## అన్నమయ్య తొలి శతకం భక్తి మార్గానికి దివ్య మార్గదర్శకం



**తిరుమల,మార్చి 20ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు భక్తి సాహిత్యంలో తొలి వాగ్గేయకారుడిగా అన్నమయ్యవిశిష్ట స్థానాన్ని పొందారని, ఆయన సంకీర్తనలలో భాగంగా రూపొందిన "తొలి శతకం" భక్తి, తత్వ, సాహిత్య పరంగా అపూర్వ ప్రాధాన్యాన్ని సంతరించుకుందని హనుమకొండకు చెందిన విశ్రాంతి తెలుగు ఆచార్యులు గిరిజా మనోహర్ బాబు పేర్కొన్నారు. తాళ్ళపాక అన్నమాచార్యుల 523వ వర్ధంతి ఉత్సవాల సందర్భంగా అన్నమాచార్య కళామందిరంలో సాహితీ సదస్సులో శుక్రవారం గిరిజా మనోహర్ బాబు ప్రసంగించారు. వేంకటేశ్వర స్వామి మహిమను, భక్తి మార్గాన్ని, జీవన సారాన్ని సులభమైన తెలుగు భాషలో ప్రజలకు చేరువ చేసిన కీర్తనల సమాహారమే ఈ తొలి శతకమని తెలిపారు. అన్నమయ్య సంకీర్తనలలోని ఆధ్యాత్మికత, సంగీత మాధుర్యం భక్తులను ఆహ్లాదపరుస్తూనే ఆత్మీయతను పెంపొందిస్తాయని చెప్పారు. అన్నమాచార్యుల సాహిత్య సంపదను పరిరక్షి ంచి, ప్రచారం చేయడంలో టిటిడి కీలక పాత్ర పోషిస్తున్నదని, భక్తులు ఈ కీర్తనలను ఆచరిస్తూ ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందాలని ఆకాంక్షి ంచారు. తిరుపతికి చెందిన సాహితీవేత్త డాక్టర్ వెంకట శంకర భవన్ ,పరిశోధకులు డాక్టర్ రాజశేఖర్, టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకురాలు లత తదితరులు పాల్గొన్నారు.

## గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం



**తిరుమల,మార్చి 20ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న గోసంరక్షణ ట్రస్ట్‌కు అరణి మదన్ మోహన్ 10 లక్షలు విరాళంగా అందించారు. జే ఎంసీ కన్స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తరఫున వేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్టుకు శుక్రవారం విరాళాల డిడిని ఆరణి మదన్ టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్రకు అందజేశారు.

## శ్రీవారి దర్శనం చాలా సంతోషంగా ఉంది - ప్రముఖులు



**తిరుమల,మార్చి 20ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగునూతన సంవత్సరంలో కలియుగవైకుంఠవాసుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడంతో మనసు ఆనందంగా ఉందని ప్రముఖులు తెలిపారు. శుక్రవారం ఉదయం శ్రీవారి అభిషేకసేవలో సిఎం కార్యదర్శి ప్రద్యుమ్న, ఎస్పీఎఫ్ డిజి త్రివిక్రమ్‌వర్మ కుటుంబం, సినీసంగీత దర్శకుడు పద్మశ్రీడ్రమ్స్ శివమణి, పద్మశ్రీ శంకర్‌మహదేవన్ కుటుంబంతో కలసి తిరుమలకు వచ్చారు. ఉదయం అభిషేకసేవలోవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## మోడీ నాయకత్వంలో దేశం శాంతి బాటలో నడుస్తోంది :కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**తిరుమల,మార్చి 20ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఆధ్యాత్మిక, అభివృద్ధితో పాటు శాంతిబాటలో నడుస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ప్రపంచం మొత్తం యుద్ధభూమిలో ఉంటే భారతదేశం మాత్రం మోదీ నాయకత్వంలో సేవ్ జోన్ లో ఉందని తెలిపారు. భారత్ శాంతి బాటలో నడుస్తోందని, దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని ఆయన పేర్కొన్నారు. ఉగాది పర్వదినం మరుసటిరోజు తిరుమలకు చేరుకుని ఏడుకొండల వేంకటేశ్వరుని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. భక్తులకు తిరుమల ఆలయంలో కల్పించిన సౌకర్యాలు, ఏర్పాట్లు బావున్నాయన్నారు. ఆలయం సుందరీకరణ అద్భుతంగా ఉందని కేంద్రమంత్రి కితాబిచ్చారు. శుక్రవారం వేకువజామున శ్రీవారి అభిషేకసేవలో కిషన్‌రెడ్డి దంపతులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయనతో బాటు టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఉన్నారు.

# ఉసూరు అన్పించిన రాష్ట్ర ప్రభుత్వ జాబ్ క్యాలెండరు : వైఎస్ షర్మిల



**విజయవాడ,మార్చి20, ప్రభాతవార్తప్రతినిధి:** కొండంత రాగం తీసి కూసంత పాట పాడినట్లుంది కూటమి ప్రభుత్వ జాబ్ క్యాలెండర్ అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. సామాజిక మాధ్యం వేదిక ఆమె ఏపీ ప్రభుత్వంపై పలు విమర్శలు గుప్పించారు.జాబ్ క్యాలెండరంటూ రెండేళ్లుగా ఊరించి ఉసూరుమనిపించారు. నిరుద్యోగ బిడ్డలను నమ్మించి నయవంచన చేశారు. జాబ్ క్యాలెండర్ పేరుతో చంద్రబాబు గారు చేసింది పచ్చి మోసం. ముష్టి 10 వేల పోస్టులకు షెడ్యూల్ ఇచ్చి, మాట నిలబెట్టుకున్నామని, జాబ్ ఫస్ట్ విధానమని గొప్పలు చెప్పడం కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటు. ఉద్యోగాల భర్తీ భారీస్థాయి పేరుతో రెండేళ్లుగా ఊదరగొట్టారు. ఆయా శాఖల మంత్రులు వేల సంఖ్యలో నోటిఫికేషన్లని పూటకో మాట చెప్పారు. విద్యాశాఖలో బోధన, బోధనేతర ఖాళీలు 30 వేల ఉద్యోగాల సంగతేంటి ? పోలీస్ శాఖ లో వెంటనే భర్తీ అని చెప్పిన 19,999 ఉద్యోగాలు ఏమైనట్లు ? ఇంజనీరింగ్ విభాగంలో ఖాళీగా ఉన్న 20 వేల పోస్టులు ఎటుపోయినట్లు? పంచాయితీ రాజ్ డిపార్ట్మెంట్లో భర్తీ చేయాల్సిన 26 వేల నియామకాల ప్రస్తావన ఎక్కడ ? మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలో లెక్కకు తీసిన 27 వేల ఖాళీల భర్తీ లేనట్లేనా? రెవిన్యూలో 13 వేలు, వైద్యశాఖలో 26 వేలు, వ్యవసాయ శాఖలో 3 వేల ఖాళీలను వెంటనే నింపుతామని ఇచ్చిన హామీలు బూడిద పాలేనా ? రాష్ట్రంలో 153 విభాగాల పరిధిలో ఖాళీల సంఖ్య అక్షరాల 1.80 లక్షలు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల తర్వాత ఇచ్చిన జాబ్ క్యాలెండర్ పోస్టుల సంఖ్య కేవలం 10 వేలు. ఖాళీల్లో ఏటికేటా 20 శాతం చొప్పున భర్తీ చేసినా, రెండేళ్లకు కలిపి కనీసం 50 వేల ఉద్యోగాలనైనా భర్తీ చేయాలి కదా ? నిరుద్యోగుల సంఖ్యలో దేశంలోనే రాష్ట్రం ప్రథమస్థానం. 50 లక్షల మంది నిరుద్యోగులుంటే ఇందులో ప్రభుత్వ ఉద్యోగాలకోసం.పుస్తకాలతో పోటీ పడుతున్న వారి సంఖ్య దాదాపు 30 లక్షలు. కూటమి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. పదో పరకో పేరుతో జాబ్ క్యాలెండర్ కాదు.

## ముస్లిం సోదరులకు మాజీ సిఎం జగన్ రంజాన్ శుభాకాంక్షలు

**విజయవాడ మార్చి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగామాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ ఈద్ ముబారక్ తెలిపారు. దీక్షలు, ఉపవాసాలు, దైవారాధన, ధానధర్మాలు, చెడును త్యజించడం, సాటి మానవులకు సేవ, వంటి సత్కార్యాల ద్వారా అల్లాహ్ స్మరణలో తరించే ఈ రంజాన్ పండుగ, సామరస్యానికి సుహృద్భావానికి , సర్వమాన సమానత్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక అని ఆయన అన్నారు. అల్లాహ్ దీవెనలతో రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ మానవాళికి సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో కఠిన ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక.

# నాడు పాదయాత్రలో మాట.. నేడు జాబ్ క్యాలెండర్‌తో బాట

● హిందూ ధర్మం గురించి జగన్ మాట్లాడటం విడ్డూరం ● వైసిపి దుష్ప్రచారంపై మంత్రి పార్థసారథి మండిపాటు



విజయవాడ, మార్చి 21 ప్రభాతవార్త ప్రతినిధి: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు మతం అన్నా, పండుగ అన్నా కేవలం ఒక రాజకీయ ప్రకటన మాత్రమేనని గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తీవ్రంగా విమర్శించారు. సాక్షి పత్రికలో వారు ఇచ్చే ప్రకటనలు చూస్తుంటే, వారికి ప్రజల క్షేమం కంటే జగన్మోహన్ రెడ్డి క్షేమమే ముఖ్యమని స్పష్టమవుతోందని ఆయన మండిపడ్డారు. శుక్రవారం టిడిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోకమంతా బాగుండాలని కోరుకోవడం హిందూ ధర్మం. కానీ, వైసిపి నాయకులకు మాత్రం జగన్మోహన్ రెడ్డి బాగుంటే చాలు, ప్రజలు ఏమైపోయినా పర్వాలేదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. గత ఐదేళ్లలో హిందూ మనోభావాలు దెబ్బతిన్నట్లుగా ఎప్పుడూ జరగలేదని ఆయన గుర్తు చేశారు. వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోకి చెప్పులతో వెళ్లడం నుంచి మొదలుకొని, తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడకం వరకు వైసిపి చేసిన పాపాలు ప్రపంచవ్యాప్త హిందువుల మనోభావాలను గాయపరిచాయి. ఇంటి పక్కనే ఆలయాలు ఉన్నా వెళ్లని జగన్, పండుగ వస్తే మాత్రం ఇంట్లోనే 'డ్రామా సెట్టింగ్‌లు' వేసి ఫొటోలకు పోజులిస్తారు. సంక్రాంతి, ఉగాది పండుగలను కేవలం ప్రచారం కోసం వాడుకుంటున్నారు తప్ప, సంప్రదాయం పట్ల గౌరవం లేదు. అబ్దుల్ కలాం వంటి మహనీయులే హిందూ ధర్మ నియమాలను గౌరవించి డిక్లరేషన్ ఇచ్చి దర్శనం చేసుకుంటే, జగన్‌మోహన్ రెడ్డికి ఆ నిబంధనలు పాటించే సంస్కారం ఎందుకు లేదని మంత్రి ప్రశ్నించారు. అమ్మ ఒడి, విద్యా దీవెన అని పేర్లు చెప్పుకున్న వైసిపి, చదువు పూర్తి చేసుకున్న లక్షలాది మంది ఇంజనీర్లకు, గ్రాడ్యుయేట్లకు ఒక్కటంటే ఒక్క ఉద్యోగ అవకాశం కల్పించలేదు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేసి యువత భవిష్యత్తును అంధకారం చేశారు. వైసిపి పాలనలో నిరుద్యోగంతో అల్లాడిన యువతకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే కొండంత అండగా నిలిచిందని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని మంత్రి విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, యువనేత లోకేష్ నేతృత్వంలో నిరుద్యోగ నిర్మూలన దిశగా అడుగులు పడుతున్నాయని తెలిపారు. "కేవలం ఈ 20 నెలల కాలంలోనే రికార్డు స్థాయిలో 6,28,347 ఉద్యోగాలు కల్పించాం. దేశంలో మరే రాష్ట్రం ఇన్ని ఉద్యోగాలు ఇవ్వలేదు. ఇప్పటికే 30,607 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. తాజాగా మరో 10,060 ఉద్యోగాలతో కొత్త జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం. చిన్న పరిశ్రమల ద్వారా 2.5 లక్షల మందికి, జాబ్ మేళాలు, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా 1,46,620 మందికి, ఐటీ, పర్యాటక రంగాల్లో లక్షలాది మందికి ఉపాధి కల్పించాం. రాష్ట్ర యువతకు ఎలాంటి బెంగ అవసరం లేదు. లోకేష్ ఇచ్చిన భరోసా ప్రకారం, ప్రతి ఏటా ఉగాది నాటికి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం. కేవలం ప్రభుత్వ రంగమే కాకుండా, ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది" అని మంత్రి పార్థసారధి పునరుద్ఘాటించారు.

## తిరుపతిలో బాల్యవివాహం

తిరుపతి, మార్చి 20 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి జిల్లాలో శుక్రవారం ఉదయం ఓ బాల్య వివాహం సంచలనంగా మారింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని ఈ వివాహాన్ని అడ్డుకోవడంతో కార్యక్రమాలు ఆగిపోయాయి. తిరుపతి రూరల్ తిమ్మినాయుడు పాలెంలో నివాసముంటున్న ఓ బాలిక(15)కు చిన్నప్పుడే తల్లిదండ్రులు మృతి చెందారు. అప్పటి నుండి బాలిక అత్త సంరక్షణలో ఉంటుంది. బాలిక బాగోగులు వారే చూసేవారు. శుక్రవారం ఉదయం ఒక్కసారిగా బాలికను పెళ్ళి కుమార్తెను చేసి వివాహం చేసేందుకు సిద్ధమయ్యారు. వివాహ తంతు కూడా ముగిసింది. ఆ సమయంలో స్థానికులు కొందరు తిరుపతి సమీపంలో బాల్య వివాహం జరుగుతున్నట్లు 112 నంబర్‌కు ఫోన్ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. వివాహం జరుగుతున్న ప్రాంతానికి చేరుకునే లోపు తంతు ముగిసింది. అత్త కనకను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. బాలికకు సంబంధించి వయస్సు ధ్రువీకరణ, ఆధార్ కార్డు చూపించకపోవడంతో బాలికను వారి చెర నుండి విడిపించారు. తదుపరి బాలికను చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించారు. బాలిక వయసును నిర్ధారించేందుకు వైద్యులచే బోన్ ఏజ్ సర్టిఫికెట్ ద్వారా నిర్ధారించే ప్రయత్నం చేశారు. మైనర్ బాలికనే ఆధారాలు వస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవని అలిపిరి సిఐ రామకిషోర్ హెచ్చరించారు.

# చిన్న వివాదం... ప్రాణం తీసింది!

● శ్రీకాకుళం జిల్లా టిడిపి కార్యాలయ ఉద్యోగి మృతి



శ్రీకాకుళం, మార్చి 20 ప్రభాతవార్త: చిన్న వివాదం నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. పరిచయమే లేని ఇద్దరు యువకుల మధ్య అనవసరంగా మొదలైన గొడవ తోపులాటకు దారితీసి ఒకరి మరణానికి కారణమైంది. ఉగాది రోజు అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో శ్రీకాకుళం నగరంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పనిచేస్తోన్న మండల వీధికి చెందిన గొర్లె మోహనరావు (26) అనే యువకుడు మృతి చెందాడు. మోహనరావు గురువారం నరసన్నపేటలో జరిగిన పార్టీ సమావేశానికి వెళ్లి రాత్రి పొద్దుపోయాక తిరిగి వచ్చాడు. ఇంటికి వెళ్లే క్రమంలో ఉమెన్స్ కళాశాల ఎదురుగా మండల వీధికి వెళ్లే రోడ్డులో తన మేనల్లుడు హరీష్ మహాలక్ష్మీనగర్ కాలనీకి చెందిన కొందరు యువకులతో కలిసి ఉండటాన్ని గమనించి వారి వద్దకు వెళ్లాడు. మేనల్లుడిని పిలిచి అంత రాత్రి వరకు మహాలక్ష్మీనగర్ యువకులతో ఎందుకు ఉన్నావంటూ మందలించినట్లు పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం తెలుస్తోంది. మోహనరావు మందలింపులను విన్న గుంపులోని గద్దె మనోహర్ అలియాస్ మనోజ్ అనే యువకుడు కల్పించుకుని మహాలక్ష్మీనగర్ యువకులను ఎందుకు నిందిస్తున్నావంటూ నిలదీశాడు. దాంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి తోపులాటకు దారి తీసింది. ఆ క్రమంలో బైక్ మీద ఉన్న మోహనరావును మనోజ్ బలంగా నెట్టడంతో కింద పడిపోయిన బాధితుడు తలకు బలమైన గాయమైంది. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న మోహనరావు కుటుంబ సభ్యులు అతన్ని వెంటనే రిమ్స్‌కు తరలించి చికిత్స అందించినా ప్రయోజనం లేకపోయింది. అతన్ని పరీక్షించిన వైద్యులు అప్పటికే మోహనరావు మరణించినట్లు ప్రకటించారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం సంఘటన స్థలంలో యువకుల సమూహం ఉండగా పోలీసులు మాత్రం తోపులాట జరిగినప్పుడు మోహనరావు, మనోజ్ ఇద్దరే ఉన్నారని చెబుతున్నారు. మోహన్ మృతిని వైద్యులు ధ్రువీకరించడంతో ఒకటో పట్టణ పోలీసులు నిందితుడు మనోజ్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. తలకు బలమైన గాయం కావడం వల్లే మోహనరావు మృతి చెందినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు తెలిపారు. రాత్రి 10.30 నుంచి 12.30 మధ్యలో జరిగిన ఈ ఘటన ఊహించని విధంగా జరిగిందని పోలీసులు చెబుతున్నారు. వివాదం ఎందుకు తలెత్తిందన్న విషయాన్ని మాత్రం స్పష్టంగా చెప్పలేకపోతున్నారు.



## కల్పవృక్ష వాహనంపై శ్రీరామచంద్రమూర్తి అభయం

తిరుపతి, మార్చి 20 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి కోదండరామస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం కల్పవృక్ష వాహనంపై స్వామివారు భక్తులను అభయమిచ్చారు. ఆలయ నాలుగు మాడ వీధుల్లో వాహనసేవ వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రకృతికి శోభను సమకూర్చేది చెట్టు. అందులో మేటి కల్పవృక్షం. కల్పవృక్షం వాంఛిత ఫలాలన్నింటినీ ప్రసాదిస్తుంది. అటువంటి కల్పవృక్ష వాహనాన్ని స్వామివారు అధిరోహించారు. సీత లక్ష్మణ సమేత రామచంద్రమూర్తి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఈ వాహనసేవలో చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, సూపరింటెండెంట్ మునిశంకర్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు సురేష్, హరీష్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



పుష్పార్చనలందుకుని అనుగ్రహిస్తున్న దుర్గమ్మవారు

## కనక దుర్గమ్మవారికి బంగారుహారం కానుక

● వైభవంగా కొనసాగుతున్న పుష్పార్చనలు

ఇంద్రకీలాద్రి, మార్చి 20 ప్రభాతవార్త: అమ్మలగన్నమ్మ బెజవాడ దుర్గమ్మవారికి వైభవోపేతంగా పుష్పార్చనలు జరుగుతున్నాయి. ఉగాది పర్వదిన వేళ ప్రారంభమైన ఈ పుష్పార్చనలలో రెండవరోజైన శుక్రవారం కనకాంబరాలు, గులాబీలు తదితర పుష్పాలతో పూజాదికాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ లక్ష్మీశా దంపతులు ఈ పుష్పార్చనలో పాల్గొన్నారు. బెజవాడ కనకదుర్గమ్మ వారికి రూ.4లక్షల విలువైన 30 గ్రాముల బంగారు మంగళ సూత్రాలను కర్నూలు జిల్లా మునగాలపాడుకు చెందిన బోయే వెంకటేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి కానుకగా అందించారు. వారికి దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలను అందించి, ఆశీర్వచనాలు అందజేశారు. దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రు.1 లక్ష విరాళాన్ని హైదరాబాద్‌కు చెందిన సూర్యకుమార్, అలాగే మదురైకి చెందిన విశ్వనాథన్ రూ.1 లక్ష విరాళం, విజయవాడకు చెందిన వై.శ్రీరాం, మేఘన చౌదరి దంపతులు రు.1 లక్ష విరాళం నిత్యాన్నదాన పథకానికి అందించారు. ఆయా దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలను అందించి, ఆశీర్వచనాలు అందజేశారు.



దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

# మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగటానికి ప్రభుత్వ ప్రోత్సాహం

- ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న మెర్సీ ఎపావో, కలెక్టర్ లక్ష్మీశా తదితరులు

విజయవాడ, మార్చి 20 ప్రభాతవార్త: రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న సహకారంతో మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా పిలుపునిచ్చారు. విజయవాడలోని సిద్దార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ ఆవరణలో ఎలీప్ వి కార్ట్ ఎగ్జిబిషన్, భాగస్వాముల సదస్సును శుక్రవారం ఉదయం కేంద్ర ఎంఎస్‌యంఈ శాఖ జాయింట్ సెక్రటరీ మెర్సీ ఎపావో, జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ గద్దె అనురాధతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా డిఆర్‌డిఏ, మహిళా పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసిన స్టాళ్ళను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో మహిళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. మహిళలకు శిక్షణ నివ్వటంతోపాటు, ఆర్థికసాయం అందించి, ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. మహిళలను పారిశ్రామికరంగంలో నడిపించటంలో ఎలీప్ కీలకపాత్ర పోషిస్తుందని కొనియాడారు. జిల్లాలోని గుంటుపల్లిలో ఏర్పాటు చేసిన రైజ్‌సంస్థ ద్వారా ఔత్సాహిక మహిళలకు వివిధరంగాల్లో శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు పారిశ్రామిక రంగంలో రాణించాలని సూచించారు. ఎలీప్ అధ్యక్షులు రమాదేవి మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందన్నారు. ఈ సదస్సులో టెక్నాలజీ, వ్యాపార అవకాశాలు, మహిళా సాధికారత, హ్యాకథాన్, ఆర్థిక అవగాహన, వంటి అంశాలపై చర్చలు జరుగుతాయన్నారు. ఎంఎస్‌ఎంఈల బలోపేతానికి, మహిళల ఆర్థిక పురోగతికి ఈకార్యక్రమం దోహదపడుతుందన్నారు. డిఆర్‌డిఏ పిడి నాంచారరావు, ఎలీప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యుత్ పంపిణీ సంస్థల్లో అక్రమాలు, అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

విజయవాడ, మార్చి 20 ప్రభాతవార్త ప్రతినిధి: విద్యుత్ పంపిణీ సంస్థలైన ఎపిఎస్‌పిడిసిఎల్, ఎపిసిపిడిసిఎల్‌లలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈశ్వరయ్య నేడొక ప్రకటన విడుదల చేశారు. "విద్యుత్ పంపిణీ సంస్థలైన ఎపిఎస్‌పిడిసిఎల్, ఎపిసిపిడిసిఎల్‌లలో పలురకాల అక్రమాలు, అవినీతి, నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత వైసిపి ప్రభుత్వ హయాంలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ వైర్లు, విసిబిలు వంటి తదితర పరికరాలను మార్కెట్ ధరలకన్నా అధిక ధరలు వెచ్చించి, పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలోకన్నా రెట్టింపు రేట్లతో పలు కంపెనీల నుండి కొనుగోలు చేశారు. ఎపికి విద్యుత్ పరికరాలు సప్లయ్ చేస్తున్న కంపెనీలే ఇతర రాష్ట్రాలకు 50శాతం తక్కువ ధరకు ఇవ్వడం గమనార్హం. చంద్రబాబు ప్రభుత్వం గత రెండేళ్ల కాలంలో దాదాపు రూ.3 వేల కోట్లను ఆయా కాంట్రాక్టర్లకు, సప్లయర్లకు చెల్లించగా, మార్చి నెలాఖరు నాటికి మరో రూ.1000 కోట్లను ఇచ్చేందుకు పావులు కదుపుతోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై నాడు ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ గగ్గోలు పెట్టింది. కాని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ విద్యుత్ పంపిణీ సంస్థలలో జరిగిన అవినీతి, అక్రమాలపై ఎటువంటి విచారణలు చేపట్టకపోగా, గత ప్రభుత్వం చేసుకున్న అగ్రిమెంట్‌లకు అనుగుణంగా అవే కంపెనీలకు మళ్లీ కాంట్రాక్టులను అప్పగిస్తూ, వేల కోట్ల రూపాయలను అప్పనంగా చెల్లించడం విచారకరం. ఆయా అక్రమాల వెనుక విద్యుత్ పంపిణీ సంస్థలోని పెద్ద గద్దల అవినీతి వెలుగు చూస్తోంది. గత ప్రభుత్వ కాలంలో అక్రమాలు జరిగాయంటూ ఊదరగొట్టిన చంద్రబాబు ప్రభుత్వానికి ఆయా అక్రమాలన్నీ సక్రమాలైపోయాయా? అందుకోసం ఎంత మొత్తం చేతులు మారింది?" అని గుజ్జుల ఈశ్వరయ్య నిలదీశారు.

# డాబుసరి కోసమే జాబ్ క్యాలెండర్

● ఆర్‌వైఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు

విజయవాడ, మార్చి 20 ప్రభాతవార్త ప్రతినిధి: డాబుసరి కోసమే ఎపి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించిందని ఆర్‌వైఎస్‌ఎఫ్ (రైట్స్ ఫర్ యూత్ అండ్ స్టూడెంట్ ఫోరమ్) రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు ఆరోపించారు. 99 వేల పోస్టులు భర్తీ చేస్తూ జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. మంత్రి లోకేష్ ప్రకటన రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులను తీవ్ర ఆవేదనకు నిరాశకు గురిచేసిందన్నారు. ఉగాది రోజున మంత్రి లోకేష్ ట్విట్టర్ ఖాతా ద్వారా 10,060 పోస్టులకు జాబ్ క్యాలెండర్ ప్రకటించారు. కానీ సంబంధిత శాఖల నుండి గాని ఉద్యోగాల భర్తీ చేయవలసిన ఎపిపిఎస్‌సి ద్వారా గాని ఎటువంటి నోటిఫికేషన్ వెలువడలేదన్నారు. నోటిఫికేషన్లు లేక అభ్యర్థులు వయసు పెరిగిపోయి ఉద్యోగాలకి అనార్హులుగా మిగులుతున్నారని 47 సంవత్సరాల వయోపరిమితి పెంచాలని కోరారు. ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌లో మార్పులు చేసి ఎన్నికల హామీ ప్రకారం నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేలా జాబ్ క్యాలెండర్ ప్రకటించాలన్నారు. అంతకు ముందు రైట్స్ ఫర్ యూత్ అండ్ స్టూడెంట్ ఫోరమ్ ఆధ్వర్యంలో విద్యార్థి యువజన సంఘాలు, నిరుద్యోగ ఐక్య సమితి, పిడిఎస్‌యు, పివైఎల్, ఎన్ఎస్‌యుఐ, ఎఐఎస్ఎ, టిఆర్‌ఎస్‌ఎఫ్, ఆర్‌ఎస్‌యు, ఎస్సీ, ఎస్టీ, బిసి నిరుద్యోగ సంఘాలు, నిరుద్యోగులతో జూమ్ సమావేశం నిర్వహించారు. నిరుద్యోగ ఐక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎంబేటి రామచంద్ర, ఆర్‌వైఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చామల లక్ష్మారెడ్డి, పిడిఎస్ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, పివైఎల్ రాష్ట్ర కన్వీనర్ భూషణం, ఐసా రాష్ట్ర కార్యదర్శి నాగార్జున, టిఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నాగేంద్ర, ఆర్‌ఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి రవి, ఎంఎస్‌యుఐ రాష్ట్ర కోఆర్డినేటర్ వేముల శ్రీనివాస్, సిపిడిఓ నిరుద్యోగులు వసుంధర, నవ్య, సావిత్రి, రాము, సంజయ్, నాగార్జున, గాయత్రి, మధురిమ, మహంతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మధ్య ఐక్యతను రంజాన్ పెంపొందిస్తుంది



హనుమాన్ జంక్షన్ (కృష్ణా), మార్చి 20 ప్రభాతవార్త: సమాజంలోని ప్రజల మధ్య ఐక్యతను రంజాన్ మాసం పెంపొందిస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర అభిప్రాయం వ్యక్తం చేసారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియచేసారు. రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందులకు ఇతర మతాల వ్యక్తులను ఆహ్వానించటం, ఇతర మతస్తులు కూడా ముస్లింలకు ఇఫ్తార్ విందులు ఇస్తూ సమాజంలో ప్రజలు సోదరభావంతో కలిసిమెలిసి ఉంటారని చెప్పారు. చంద్ర దర్శనంతో ముగిసే ఈ పవిత్ర మాసంలో ముస్లింలు రోజంతా ఉపవాసం ఉంటూ, ప్రార్థనలు, దానధర్మాలతో అత్యంతనిష్టగా ఉంటారని తెలిపారు. రంజాన్ నెలలో ఆచరించే ఉపవాసాలు కేవలం ఆహార నియమాలకు మాత్రమే పరిమితం కాకుండా ఆలోచనలు, ప్రవర్తనలను కూడా శుద్ధి చేసుకునేవిగా నిలుస్తాయన్నారు. ఆపన్నులకు సాయం చేయటం, పేదలపట్ల దాతృత్వభావనను పెంపొందించటం రంజాన్ సందేశంగా మంత్రి రవీంద్ర పేర్కొన్నారు. ఈద్ పర్వదినం ప్రతి ఇంటికీ ఆనందం, ఐశ్వర్యం కలిగించాలని ఆకాంక్షించారు.



## జనగణన ఫార్మట్‌లో ఓబిసి కాలమ్ పెట్టాలి

విజయవాడ, మార్చి 20 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జనగణన ఫార్మట్‌లోని సుదీర్ఘ 33 అంశాల ప్రశ్నావళిలో 12వ కాలమ్‌గా ఎస్సీ/ ఎస్టీ/ ఇతర వర్గం అని మాత్రమే ఉన్నాయని, వాటితో పాటు తప్పనిసరిగా ఓబిసి వర్గ కాలమ్ జేర్చి, ఓబిసిలకు సామాజిక న్యాయాన్ని చేకూర్చాలంటూ ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విజయవాడలో 'హలో బిసి చలో ఢిల్లీ' గోడ పత్రికను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ జనగణనతో పాటే సమగ్ర కులగణన జరిపేందుకు కేంద్ర మంత్రిమండలి ఆమోదించడాన్ని ఓబిసి సమాజం హర్షిస్తుందన్నారు. కానీ ఆ జనగణన ఫార్మట్లో ఓబిసి కాలమ్ లేకపోతే, వివిధ ఓబిసి కులాల విడివిడి జనాభా గాని, వివిధ స్థాయిల నియోజకవర్గాలలో ఓబిసిల జనాభా గాని, వివిధ రాష్ట్రాల దేశంలోని ఓబిసిల మొత్తం జనాభా తెలియదన్నారు. ఈ నెల 23వ తేదీన ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జాతీయస్థాయి "మహా ధర్నా"ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందుకు "హలో బిసిచలో ఢిల్లీ" కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతూ ఈరోజు గోడపత్రికను ఆవిష్కరించామన్నారు. అన్ని ఓబిసి సంఘాల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరుగు మహాధర్నాలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా శంకరరావు మొత్తం బిసి సమాజానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మూర్తి, ఈడే అశోక్ కుమార్ గౌడ్, అందే జగదీష్, శివ సత్యనారాయణ, పలువురు బిసి నాయకులు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజన పథకంపై గరికపాటి వాఖ్యలు సిగ్గుచేటు...

# పిల్లలకు క్షమాపణలు చెప్పాలి: ఎస్ఎఫ్ఐ

విజయవాడ, మార్చి 20 ప్రభాతవార్త ప్రతినిధి: గరికపాటి నరసింహారావు పేద పిల్లలకు అందించే మధ్యాహ్న భోజన పథకంపై అహంకారపు అక్కసు వెళ్ళగక్కడాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆంధ్రప్రదేశ్ కమిటీ తీవ్రంగా ఖండించి. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు ఒక ప్రకటన విడుదల చేసారు. గరికపాటి నరసింహారావు వాఖ్యలను వెనక్కి తీసుకుని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రవచనాల పేరుతో పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం అమానవీయం. పిల్లలు కేవలం కోడిగుడ్డు కోసమే బడికి వస్తున్నారని, చదువు "మిధ్య" అయిపోయిందని అనడం పేద విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే. మధ్యాహ్న భోజనం పిల్లలు బడికి వచ్చేందుకు, డ్రాపౌట్ తగ్గేందుకు దోహదపడిందని అనేక అంతర్జాతీయ అధ్యయనాలు చెబుతున్నాయి. విద్యార్థులను "శోభనం పెళ్లికొడుకు"తో పోల్చడం విద్యార్థి లోకాన్ని కించపరచడం. భారతదేశంలో 84శాతం మంది తల్లులు, పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. కోడిగుడ్డును దానిని "గాడిద గుడ్డు" అని సంబోధించడం ఆకలిని కించపరచడం. విద్యార్థులకు భోజనం, పుస్తకాలు, యూనిఫాం అందించడం ప్రభుత్వ బాధ్యత. దానిని "బిచ్చం" అని పిలవడం సిగ్గుచేటు. గరికపాటి వ్యాఖ్యలు కనీస "విజ్ఞత లేనివి". గరికపాటి వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలి. పిల్లలను అవమానించిన గరికపాటి నరసింహారావు క్షమాపణలు చెప్పాలి" అని డిమాండ్ చేశారు.

# వివాహేతర మాయలో పడి... భర్తను హతమార్చి కాల్చేసింది!

● కనిపించలేదని పోలీసులకు తల్లి ఫిర్యాదు ● పోలీసుల విచారణలో తప్పు ఒప్పుకున్న భార్య ● తండ్రి కాలిబూడిద... తల్లి జైలుకు... అనాధలైన పిల్లలు



నంద్యాల, మార్చి 20 ప్రభాతవార్త ప్రతినిధి: పరాయి మగాడిపై మోజులో పడి ఏకంగా తాళి కట్టిన భర్తలను కడతేర్చుతున్నారు. నిన్న నూనెపల్లెలో నేడు గడిగరేవులలో.. నూనెపల్లెలో బండరాళ్లతో కొట్టి హత్య చేస్తే.. గడిగరేవులలో శవన్నే కనిపించకుండా ఏకంగా కాల్చి బూడిద చేసిన సంఘటన హృదయాలను కలచివేసింది. వివరాలోకి వెల్లితే నంద్యాల జిల్లా గడివేముల మండలం గడిగరేవులలో ఆవుల శ్రీనివాసులు, భార్య వరలక్ష్మి నివాసముంటున్నారు. అయితే ఈ నెల 10వ తేదిన తన కుమారుడు కనిపించలేదని మృతుని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనితో గడివేముల పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. అనంతరం విచారణ చేపట్టారు. అయితే విచారణ చేపట్టిన పోలీసులకు అనుహ్యమైన నిజాలు బయట పడ్డాయి. గ్రామంలో వరుసకు మేన మామ అయిన వెంకటేశ్వర్లుతో వరలక్ష్మికి వివాహేతర సంబందం కొనసాగుతుందని, ఆ కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. దీనితో తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని తన భర్తను తానే హత్య చేసి ఇంటి వెనుక బాగానే కాల్చి వేశానని భార్య ఒప్పుకున్నట్లు పోలీసులు అంటున్నారు. పాణ్యం సిఐ కిరణ్‌కుమారెడ్డి తెలిపిన వివరాల మేరకు గడిగరేవుల గ్రామంలో వరలక్ష్మి, శ్రీనివాసులు భార్యాభర్తలు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారని చెప్పారు. అయితే శ్రీనివాసులకు మద్యం తాగే అలవాటు ఉందని చెప్పారు. దీనితో నిత్యం అనుమానంతో వేధిస్తున్నాడని ఎలాగైన అడ్డుతొలగించుకోవాలని ప్రియుడితో చర్చించి ఈనెల 10వ తేదిన తాగి ఇంటికి వచ్చిన భర్త శ్రీనివాసులను హత్య చేసింది. అనంతరం తన ప్రియుడు వెంకటేశ్వర్లుకు సమాచారం ఇచ్చి, అతని సహాయంతో ఇంటి వెనుక ఉన్న స్థలంలో యాసిడ్, పెట్రోలు పోసి మృతుడి ధరించిన బట్టలతో కల్చి బూడిద చేసిందని చెప్పారు. అయితే ఏమి తెలియనట్లు ఉండగా మృతుడి సెల్ ఫోన్, అలాగే భార్య వరలక్ష్మి సెల్ ఫోన్ సహాయంతో విచారణ చేపట్టామన్నారు. దీనితో నిజము ఒప్పుకోవడంతో భార్య, ఆమె ప్రియుడిని అరెస్టు చేశామని చెప్పారు. తండ్రి బూడిద కాగా, తల్లి జైలు పాలు కావడముతో పిల్లలు అనాధలుగా మిగిలారు.



విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
26
వార్త
శనివారం 21, మార్చి 2026




# దేవుళ్లతో రాజకీయం చేస్తే భస్మం కాక తప్పదు

నర్సీపట్నం-ప్రభాతవార్త

నర్సీపట్నం అభివృద్ధిలో భాగంగా తలపెట్టిన సృష్టి క్షేత్రం నిర్మాణాన్ని అడ్డుకోవాలని చూస్తే భస్మం కాక తప్ప దని, ఇది రాజకీయాల కోసం కాదని నర్సీపట్నం ప్రజల కోసం చేస్తున్నామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింత కాయల విజయ్ స్పష్టం చేశారు. పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలతో నిర్మిస్తున్న ఈ సృష్టి క్షేత్రం నర్సీపట్నం ప్రాంతా నికి తలమానికంగా మారనుందని, దీని 8వ పేజీలో

**సృష్టి క్షేత్రం నర్సీపట్నం ప్రజల కోసం, రాజకీయాల కోసం కాదు: మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు చింతకాయల విజయ్ హెచ్చరిక**

# సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి అనిత

**అధికారులకు దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ -స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనకు పటిష్ట ఏర్పాట్లు**



అనకాపల్లి, మార్చి 19 ప్రభాతవార్త

ఈ నెల 23వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాలో నక్కపల్లి మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లను రాష్ట్ర హోం శాఖ మాత్యులు వంగలపూడి అనిత పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ క్రిష్ణన్, జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, ఎస్ పి., తుహిన్ సిన్హా లతో కలసి నక్కపల్లి మండలంలో ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాలను సందర్శించి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను గమనించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు.

**అధికారులకు దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్**

నక్కపల్లి మండలం ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ఈ నెల 23న జరగనున్న భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహా పలువురు మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారని అందుకు తగ్గ ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో బహిరంగసభ ఏర్పాట్లు, వేదిక నిర్మాణం. హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ పనులను శుక్రవారం సాయంత్రం ఎస్పి., తుహిన్ సిన్హా, జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్‌లతో కలిసి కలెక్టర్ విజయ్ క్రిష్ణన్ పరిశీలించి అధికారులతో 8వ పేజీలో

# మత సామరస్యానికి ప్రతీక రంజాన్




**ఏపీ టీడీపి అధ్యక్షులు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు -గాజువాకలో ఘనంగా ఇఫ్తార్ విందు**

# గాజువాకలో ఉరుములు.. మెరుపులతో కూడిన భారీ వర్షం



గాజువాక, మార్చి 20, పభాతవార్త

గాజువాకలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. శుక్రవారం ఉదయం నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపించగా, సాయంత్రం అయ్యేసరికి ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. గాలులు, ఉరుములు,మెరుపులతో కూడిన ఈ అకాల వర్షం స్థానికులను ఉలిక్కిపడేలా చేసింది.ముఖ్యంగా గాజువాక, శ్రీనగర్, కూర్మన్నపాలెం, శీలానగర్, ఆటోనగర్ పరిసర ప్రాంతాల్లో వర్షం తీవ్రత ఎక్కువగా ఉంది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఎండ వేడి నుంచి ఉపశమనం లభించినప్పటికీ, భారీ ఉరుముల శబ్దాలకు జనం కాస్త ఆందోళనకు గురయ్యారు. రహదారులపైకి నీరు చేరడంతో వాహనదారులు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# 23న చంద్రబాబు విశాఖ రాక

**-నక్కపల్లి మండలంలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనకు హాజరుకానున్న సీఎం**

విశాఖపట్నం: మార్చి,20, ప్రభాతవార్త



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 23వ తేదీ మధ్యాహ్నం వాయు మార్గం ద్వారా విశాఖపట్నం చేరుకుం టారు, ఎయిర్పోర్ట్ నుండి అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలం, చందనాడ గ్రామం చేరుకుని ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ శంకు స్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అనం తరం అక్కడినుండి వాయు మార్గం ద్వారా విజయవాడ వెళ్తారు.

# ఉద్యోగ భవన్, గురజాడకు వచ్చే సందర్శకులకు రక్షిత తాగునీరు




**ఆనందపురం కూడలిలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా**

# ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేయాలి

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు**




**జాబ్ క్యాలెండర్ ప్రకటన..**

# కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం




**కొత్తశకానికి నాంది పలికేందుకు యువత సన్నద్ధం కావాలి -సోషల్ మీడియా ఖాతా నుంచి నిరుద్యోగ యువతను అభినందిస్తూ విశాఖ ఎంపీ శ్రీ భరత్ సందేశం**

# జాబ్ క్యాలెండర్ విడుదలపై హర్షం వ్యక్తం చేసిన పోలాకి

విశాఖపట్నం -ప్రభాతవార్త



రాష్ట్ర నిరుద్యోగ యువతకు ఉగాది కానుకగా 10,060 పోస్టుల భర్తీకి ఉద్యోగాల పండుగను ప్రకటించిన విద్యా-ఐటీ- ఎలక్ట్రానిక్స్-కమ్యూని కేషన్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌కి ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు పోలాకి శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలియ జేశారు. ప్రకటించిన మొత్తం ఉద్యోగాలను 4 విడతల్లో భర్తీ చేసేలా కూటమి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం పై వారు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. యువ గళం పాదయాత్రలో నిరుద్యోగ యువతకిచ్చిన హామీ మేరకు ప్రతి ఏడాది ఉగాదినాడు జాబ్ క్యాలెండర్‌ను మంత్రి లోకేష్ విడుదల చేస్తామనడం సంతోషదాయకమన్నారు. ఒకపక్క ప్రైవేట్ పెట్టుబడు లను ఆకర్షిస్తూ, ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పని చేస్తూనే-మరో పక్క ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తున్న లోకేష్ కు హ్యాట్సాఫ్ అన్నారు. భర్తీ చేస్తామన్న 10,060 ఉద్యోగాలకు నోటిఫికేషన్ల తేదీలు పోస్టులు భర్తీ తో పాటు జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో,ప్రభుత్వ ఉద్యోగ ఆశావహుల ఆనందానికి 8వ పేజీలో

# చెట్లను నరికేస్తున్నా.. పట్టించుకోని అధికారులు

**సాగునీటి కాలువ వెంబడి భారీ వృక్షాలు నరికివేత**



ఎలమంచిలి ,మార్చి 20, ప్రభాతవార్త

అడిగే వారు లేరని.. అధికారులు చూసి చూడనట్లు వదిలేస్తున్నారని భావంతో కొందరు అక్రమార్కులు వాల్టా చట్టానికి తూట్లు పెడుతున్నారు. ఓ పక్క సాక్షాత్తు ఎమ్మెల్యే విజయ్ కుమార్ పునర్వణం పేరుతో చేపడుతున్న కార్యక్రమానికి రాష్ట్రస్థాయిలో పేరు ప్రఖ్యాతలు వస్తున్నాయి. ఆయన లక్ష్యానికి ప్రోత్సాహం అందించాల్సిన అధికారులే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం పలు విమర్శలకు తావిస్తోంది. ఎమ్మెల్యే విజయ్ కుమార్ చేపట్టిన పునర్వణం మహోన్నత కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా చట్టం చేసే ఆలోచనను ప్రభుత్వం పరిశీలనలో ఉన్నప్పటికీ ఎమ్మెల్యే నియోజకవర్గంలోనే అధికారులు తమకేమీ పట్టనట్లు వదిలేస్తుండడంతో పదుల సంఖ్యలో వృక్షాలు గొడ్డలి వేటుకు గురవుతున్నాయి. నియోజకవర్గ ఎమ్మెల్యే లక్ష్యానికి అధికారులు తమ వంతు ప్రోత్సాహాన్ని అందించాలని లేకుంటే వాల్టా చట్టాన్ని అయినా అమలు చేయాలని అప్పుడే పచ్చని చెట్లు గొడ్డలి వేటుకు గురికాకుండా ఉంటాయని పర్యావరణ ప్రేమికులు సైతం అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే చేపడుతున్న మహోన్నత కార్యక్రమానికి అధికారులే గాలికొదిలేస్తుంటే ఇంక పర్యావరణానికి రక్షకులు ఎవరని పలువురు ప్రశ్నిస్తున్నారు ఎలమంచిలి మున్సిపాలిటీలో గత కొన్ని రోజులుగా ఇష్టానుసారంగా కొందరు కాసులకు 8వ పేజీలో

# జాబ్ క్యాలెండర్ పై హర్షం వ్యక్తం చేసిన యువత

విశాఖపట్నం, మార్చి 20 ప్రభాతవార్త

ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ పై నిరుద్యోగులు , పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఎంవిపి కాలనీ లో హర్షం వ్యక్తం చేశారు. ప్లే కార్డ్స్ చేతను పట్టుకొని ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో యువతకు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు . రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబు కి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, టీడీపీ అధ్యక్షులు చోడే వెంకట పట్టాభి రామ్, ప్రధాన కార్యదర్శి లొడగల కృష్ణ తదితరులు పాల్గొన్నారు




# నర్సీపట్నం సృష్టి క్షేత్రం వద్ద అశుద్ధ పనులు

**భారీ జరిమానా విధించిన పోలీసులు**

నర్సీపట్నం-ప్రభాతవార్త

నర్సీపట్నం పెద్ద చెరువు ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న వారిపై పోలీసులు కొరడా ఝుళిపించారు. గౌరవ స్పీకర్ ఆధ్వర్యంలో ఈ ప్రాంతాన్ని 'సృష్టి క్షేత్రం'గా తీర్చిదిద్దుతున్న క్రమంలో, అక్కడ అశుద్ధ పనులు చేయవద్దని ముందే హెచ్చరించినప్పటికీ కొందరు పెడచెవిన పెట్టారు. నిర్మాణ పనులు జరుగుతున్న పవిత్ర స్థలంలో బహిర్భూమికి వెళ్తున్న వారిని పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన వారికి పదివేల రూపాయల భారీ జరిమానా విధించారు. ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతున్న ఈ ప్రాంతంలో అపరిశుభ్రతకు కారణమైతే కఠిన చర్యలతో పాటు భారీ జరిమానాలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు.

## దేవుళ్లతో రాజకీయం చేస్తే భస్మం కాక తప్పదు

7వ పేజీ తరువాయి ..

చుట్టూ వాటర్ స్టోరేజ్, వాకింగ్ ట్రాక్, పార్క్ వంటి సదుపాయాలతో అద్భుతంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగి ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని ఆయన వివరించారు. అయితే, కొందరు రాజకీయ దురుద్దేశంతో, అక్రమ ఆక్రమణదారులను అడ్డుపెట్టుకుని కోర్టుల ద్వారా ఈ దివ్యమైన ప్రాజెక్టును ఆపాలని కుట్రలు చేస్తున్నారని తీవ్రంగా హెచ్చరించారు. ఈ క్షేత్రం నిర్మాణం ఆపితే తాను రాజకీయాల నుంచి తప్పుకోవడానికైనా సిద్ధమేనని ఆయన సవాల్ విసిరారు. గత ఐదేళ్లు అధికారంలో ఉండి నియోజకవర్గాన్ని గాలికొదిలేసిన మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్.. దేవుడి ద్రవ్యంపైనా, అభివృద్ధి పనులపైనా బురదజల్లడం మానుకోవాలని చింతకాయల విజయ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. స్థానిక దేవతలైన నూకాలమ్మ, మరిడమ్మ అమ్మవార్ల పట్ల నర్సీపట్నం ప్రజలకు అపారమైన భక్తి ఉందని పేర్కొన్నారు. 2018లో ఆలయ నిర్మాణం కోసం దాతలు ఇచ్చిన పది లక్షల రూపాయలను దండీలు వసూలు చేశారంటూ ప్రతిపక్ష నేతలు అవమానకరంగా మాట్లాడారని, ఆ నిధులను అత్యంత పారదర్శకంగా దేవాదాయ శాఖకు జమ చేశామని గుర్తు చేశారు. అలాగే, గతంలో మరిడమ్మ అమ్మవారికి సంబంధించి దొంగ బంగారం బాగోతం బయటపడిందని, అమ్మవారి నగలను దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పరీక్షిస్తే అందులో సుమారు 362 గ్రాముల బరువున్న ఒక హారం అసలైన బంగారం కాదని, అది నకిలీ (వన్ గ్రామ్ గోల్డ్) అని తేలిందని స్పష్టం చేశారు. దేవుడి విషయంలో ఇలాంటి మోసాలకు పాల్పడితే దేవుడు, ప్రజలు క్షమించరని ఆయన హితవు పలికారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు నాయకత్వంలో నర్సీపట్నం మున్సిపాలిటీకి 33 కోట్లు, నియోజకవర్గానికి 425 కోట్ల రూపాయలతో అనేక మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని విజయ్ వివరించారు. తాండవ, రవణాపల్లి రిజర్వాయర్ల ద్వారా రైతాంగానికి సాగునీరు అందించేందుకు కాలువల ఆధునికీకరణ పనులు వేగవంతం చేసినట్లు తెలిపారు. రాబోయే మరిడమ్మ జాతరలు అత్యంత వైభవంగా జరగనున్నాయని, భక్తుల మనోభా వాలు దెబ్బతినకుండా ప్రతి ఒక్కరూ ఆలయ అభివృద్ధికి, అలాగే సృష్టి క్షేత్ర నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ సూర్యచంద్ర, నూకాంబిక ఆలయ చైర్మన్ కొరుప్రోలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక రంజాన్

గాజువాక,మార్చి 20,ప్రభాతవార్త

రంజాన్ పవిత్ర మాసం క్రమశిక్షణకు, దానధర్మాలకు ఆత్మపరిశీలనకు నిదర్శనమని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. రంజాన్ మాసం ముగింపు సందర్భంగా శుక్రవారం గాజువాక క్లబ్‌లో నియోజకవర్గ ముస్లిం సోదరులకు ఆయన ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఘనంగా ఏర్పాటు చేశారు. పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ముస్లిం సోదర సోదరీమణు లందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కులమతాలకు అతీతంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. "క్షమా గుణానికి ప్రాధాన్యతనిచ్చే ఈ మాసం సమాజంలో సోదరభావాన్ని పెంపొందిస్తుంది. సమాజాన్ని సన్మార్గంలో నడిపించే దిశగా ఖురాన్ బోధనలు ఉంటాయని, ప్రతి ఒక్కరూ అన్ని మతాల ఔన్నత్యాన్ని గౌరవించాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, జనసేన పార్టీ ఇంచార్జ్ కోన తాతారావు, భాజపా ఇంచార్జ్ కర్ణం రెడ్డి నరసింగరావు పాల్గొన్నారు. వీరితో పాటు మాజీ కార్పొరేటర్లు లేళ్ళ కోటేశ్వరరావు, దల్లి గోవిందరెడ్డి, రాజాన రామారావు, తిప్పల వంశీ రెడ్డి, నరసింహ పాత్రుడు పలువురు అధికారులు, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి నాయకులు విందులో పాల్గొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి అనిత

7వ పేజీ తరువాయి ..

సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏర్పాట్లు ఎక్కడివరకు వచ్చాయో అడిగి తెలుసుకున్నారు. సమయం తక్కువ ఉన్నందున అధికారులు, నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. సభకు హాజరయ్యే ప్రజలకుఎటు వంటి అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, నక్కపల్లి అడ్డురోడ్డు ఆర్డీ వో వీవీ రమణ, పలుశాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఆనందపురం కూడలిలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా..

విశాఖపట్నం, మార్చి 20ప్రభాతవార్త

ఆనందపురం కూడలిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుని సమగ్ర ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎన్.హెచ్.ఎ.ఐ. అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆనందపురం కూడలిని పరిశీలించిన వారు, ప్రస్తుత ట్రాఫిక్ పరిస్థితులను సమీక్షించారు. భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా సమగ్ర ప్రణాళిక రూపొందించి, తక్షణం అమలు చేయగల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించేందుకు పూల మార్కెట్‌ను సమీపంలోని రైతు బజార్‌కు కేటాయించిన 95 సెంట్ల స్థలానికి తరలించే అంశంపై చర్చించారు. అలాగే, దానికి ఆనుకుని ఉన్న ఎస్సీ కార్పొరేషన్ స్థలాన్ని కూడా వినియోగించే అవకాశాలను పరిశీలించాలని నిర్ణయించారు. ఫ్లైఓవర్ కింద విస్తరణ పనులు చేపట్టి, తాత్కాలికంగా ట్రాఫిక్ సమస్యలను తగ్గించే చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండేలా ప్రాంత పరిస్థితులను సూక్ష్మంగా అధ్యయనం చేసి, శాశ్వత పరిష్కారానికి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఎన్.హెచ్.ఎ.ఐ. అధికారులు, పోలీస్ శాఖ, స్థానిక రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగ భవన్, గురజాడకు వచ్చే సందర్శకులకు రక్షిత తాగునీరు

విశాఖపట్నం, మార్చి 20ప్రభాతవార్త

వీఎంఆర్డీఏ కార్యాలయం, చిల్డ్రన్ ఏరినా, గురజాడ కళాక్షేత్రంకి వచ్చే సందర్శకుల కోసం రక్షిత తాగునీరు అందించేందుకు ఆర్వో ప్లాంట్‌లు అందుబాటులోకి తీసుకువచ్చామని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ అన్నారు. వీఎంఆర్డీఏ కార్యాలయం, గురజాడ కళాక్షేత్రం ఆవరణలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ ఓ ప్లాంట్ లను మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్‌తో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో సందర్శకుల దాహార్తిని తీర్చేందుకు శుద్ధపరచబడిన నీటిని దివీస్ సంస్థ వారి తమ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆ ప్లాంట్ లు ఒక్కొకటి సుమారు రూ 8.00 లక్షల ఖర్చుతో అందుబాటులోకి తీసుకువచ్చినందుకు దివిస్ సంస్థ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. పర్యాటకులకు మరింత మేలు జరిగేలా అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖని పర్యాటక రాజధానిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందన్నారు. ఉద్యోగ భవన్ లో వివిధ శాఖల కార్యాలయాలు ఉన్న నేపథ్యంలో అనేక మంది ప్రజలు తమ తమ పనులపై నిత్యం ఇక్కడికి వస్తుంటారని వారందరికీ ప్రయోజనం కలిగేలా కార్యాలయ ఆవరణలో చల్లటి రక్షిత మంచి నీరు అందించాలని భావించామని, వీటిని ఉగాది పండుగ రోజున ప్రారంభించటం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మురళీ కృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీ శంకర్, మధుసూదనరావు, కార్యనిర్వాహక ఇంజనీర్ సింగ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### జాబ్ క్యాలెండర్ ప్రకటన..

## కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం

విశాఖపట్నం, మార్చి 20 ప్రభాతవార్త

ఉగాది పర్వదినం వేళ యువత ఆకాంక్షలను గౌరవిస్తూ, కూటమి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం ఒక ముఖ్యమైన ముందడుగని విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్ తన ఫేస్ బుక్‌లో పేర్కొన్నారు. యువగళంలో ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ 10,060పోస్టులను భర్తీ చేసేందుకు తేదీలను ప్రకటిస్తూ స్పష్టమైన పారదర్శకమైన నోటిఫికేషన్లు, క్రమబద్ధమైన విధానంతో జాబ్ క్యాలెండర్ విడుదల చేశారన్నారు...ఇది కూటమిప్రభుత్వానికి వున్న చిత్తశుద్ధిని సూచిస్తోందని పేర్కొన్నారు. దీని వల్ల అభ్యర్థులు నమ్మకంతో పరీక్షలకు సిద్ధం కావడానికి మంచి అవకాశం కలిగిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విద్యా,ఐటిశాఖల మంత్రి నారాలోకేష్ నాయకత్వంలో రాష్ట్రం, ప్రతి యువకుడిలో ఆత్మవిశ్వాసాన్ని, అర్థవంతమైన అవకాశాలను సృష్టిస్తోందన్నారు. అభ్యర్థులందరూ ఈ సదావకశాలను సద్వినియో చేసుకుని కొత్త ప్రారంభానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు.. హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ ఈ ఉగాది పర్వదినం అందరి ఆశల్ని, ఆకాంక్షలని నెరవేరుస్తుందనే విశ్వాసాన్ని శ్రీభరత్ వెలిబుచ్చారు..

## జాబ్ క్యాలెండర్ విడుదలపై హర్షం వ్యక్తం చేసిన పోలాకి

7వ పేజీ తరువాయి ..

అవధులు లేవన్నారు.మే 15న,ఉన్నత విద్యా శాఖకు చెందిన 1500 విశ్వవిద్యాలయ అధ్యాపక పోస్టులకు, ఆగస్టు 15న, 91 గ్రూప్-1పోస్టులు- హోం శాఖలో 2,778, ఇతర శాఖల్లో 928 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కానుందన్నారు. అలాగే సెప్టెంబర్ 15న,750 గ్రూప్-2- 503 ఏఈఈ - ఇతరత్రా 506 పోస్టులకు మరియు అక్టోబర్ 15న,పాఠశాల- ఇంటర్మీడియట్ విద్యకు చెందిన 3,004 పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల కానున్నాయని తెలియజేశారు. మరియు విద్యుత్ శాఖలో ఖాళీ గా ఉన్న పోస్టులు 1711 జూనియర్ లైన్మెన్ 800 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ మరియు 7142 పోస్టులు వివిధ కేటగిరీలో భర్తీ చేయాలని మరియు క్షేత్రస్థాయిలో వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విశాఖపట్నం, మార్చి 20 ప్రభాతవార్త



మాదక ద్రవ్యాలకు బానిసై యువత తమ జీవితాలను నాశనం చేసుకోకూడదని విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32వ వార్డు మాజీ కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు పేర్కొన్నారు. 32వ వార్డు ఎల్లపువారి వీధి, చలువ తోట,పాల సందు,నంది వీధి, తారకరామ కాలనీ, అల్లిపురం మార్కెట్,సమస్యాత్మక ప్రాంతాల్లో టూటౌన్ సిఐ ఎర్రంనాయుడు,ఎస్సై మన్మధరావు,కొంతమంది పోలీసులతో కలిసి డాక్టర్ కందుల నాగరాజు పర్యటించి, అక్కడ పరిస్థితులను,స్థానిక సమస్యల పై ప్రజలను నేరుగా అడిగి తెలుసుకొని, డ్రగ్స్ పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ 32 వ వార్డులో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగితే సహించేది లేదన్నారు. ఈ ప్రాంతంలో ఆ సాంఘిక శక్తులకు చోటు లేదని చెప్పారు. ఈ క్రమంలోనే వార్డులోని ఎల్లపువారి వీధి, చలువ తోట,పాల సందు,నంది వీధి, తారకరామ కాలనీ,అల్లిపురం మార్కెట్,సమస్యాత్మక ప్రాంతాల్లో టూటౌన్ సిఐ ఎర్రంనాయుడు,ఎస్సై మన్మధరావు, కొంతమంది పోలీసులకు పర్యటించి ప్రజలకు డ్రగ్ పై అవగాహన కలిగించడం జరిగిందన్నారు. టూటౌన్ సిఐ ఎర్రంనాయుడు మాట్లాడుతూ ఆ సాంఘిక శక్తులపై ఉక్కు పాదం మోపుతామని హెచ్చరించారు. ఎవరిని వదిలిపెట్టే సమస్య లేదని స్పష్టం చేశారు. కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు పోలీస్ వారికి ఎంతో సహకరిస్తున్నారని వెల్లడించారు. ప్రజలు కూడా అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎస్సై మన్మధరావు, సిపిఐ బుజ్జి, కృష్ణ, టూ టౌన్ పోలీస్ స్టేషన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చెట్లను నరికేస్తున్నా..

7వ పేజీ తరువాయి ..

కక్కుర్తి పడి పచ్చని చెట్లను నరికి వేస్తున్నారు. వీటికి అడ్డుకట్ట వేయాల్సిన రెవెన్యూ , అటవీశాఖ, నీటిపారుదల శాఖ అధికారులు ఎవరికి వారు యమునా తీరు అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. వాల్టా చట్టాన్ని పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉన్నప్పటికీ వారు కన్నెత్తి చూడకపోవడం ఈ తతంగానికి ఊతమిస్తున్నట్లు అనిపిస్తుంది. పట్టణములోని గవర్నమెంట్ హాస్పటల్ సమీపంలో పంట కాలువ వద్ద కొద్ది రోజుల క్రితం భారీ వృక్షాలను నరికివేశారు. చెట్లను నరికి వేస్తున్న అధికారులు మాత్రం స్పందన నామమాత్రంగానే ఉంది. రెండు రోజుల క్రితం పట్టణము నుండి తురంగల పాలెం గ్రామానికి వెళ్లే రహదారి పక్కన కాలువ సమీపంలో పెద్దపెద్ద వృక్షాలను నరికివేశారు . ఓ పక్క నీటిపారుదుల శాఖ అధికారులు గానీ అటవీ శాఖ అధికారులు గానీ దీనిపై సంప్రదించగా వారు ఒకరి మీద ఒకరు మాకు సంబంధం లేదు మాకు సంబంధం లేదు అంటూ చెబుతున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మొక్కలను పెంచే కార్యక్రమం నిర్వహిస్తుంది. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ గ్రీన్ అబ్బుగా తయారు చేయడానికి మొక్కలను పెంచే కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే విధంగా అసెంబ్లీలో ప్రస్తావిస్తుంటే ఇక్కడ మాత్రం ఎమ్మెల్యే కు వ్యతిరేకంగా అధికారులు ప్రవర్తిస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఈ మధ్యకాలంలోనే పంట కాలవ వెంబడి చెట్లను నరికి వేస్తున్న అధికారులు మాత్రం ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా చెట్లను నరికి వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



విశాఖపట్నం, మార్చి 20, ప్రభాతవార్త

సీఎం సహాయనిధి నుంచి విడుదలైన రూ. 7.43 లక్షల విలువైన చెక్కులను ఎంవీపీ కాలనీ లోని క్యాంప్ కార్యాలయం లో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం అందజేశారు. వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స తీసుకున్న ఆనందపురం, పద్మనాభం, జీవీఎంసీ 1, 5 వార్డులకు చెందిన 9 మందికి ఆర్థిక సాయం చెక్కులు అందించారు. పేద ప్రజల కోసం ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ చెప్పారు. గతం కంటే ఎంతో వేగంగా సీఎం సహాయ నిధి అందుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రామస్వామి నాయుడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాట్రాజు అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, తమ్మిన సూరిబాబు, కోరాడ రమణ, కసిరెడ్డి దామోదరరావు, దండి వెంకటేష్, మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, నాగోతి సత్యనారాయణ, కాకర రమణ, కురుమిన లీలావతి, సూరాల సత్య వరప్రసాద్ పాల్గొన్నారు.

## గాంధీనగర్‌లో భావనాఋషి భద్రావతిల పూజామహోత్సవం



ఆరిలోవ మార్చి 20 ప్రభాతవార్త

తూర్పు నియోజకవర్గం స్థానిక 11వ వార్డు గాంధీ నగర్లో శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి యువజన సేవా సంఘం వారి ఆధ్వర్యంలో గత 6 సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న శ్రీ భావనాఋషి భద్రావతిల పూజామహోత్సవ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 800 మంది గాంధీనగర్ గ్రామంలో నివాసముంటున్న పద్మశాలి కుటుంబీకులు హాజరై స్వామి వారి ప్రసాదం అన్నదాన రూపంలో స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు,11 వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముగడ రాజారావు, 11 వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు కాకి గంగరాజు, కాళ్ల శంకర్ హాజరయ్యారు.

## పద్మనాభం కెజిబివి పాఠశాలలో ప్రవేశాలకి దరఖాస్తుల స్వీకరణ



పద్మనాభం, మార్చి 20,ప్రభాతవార్త

మండలంలో కృష్ణాపురం గ్రామంలో ఉన్న కెజిబివి పాఠశాలలో ప్రవేశాలకు ధరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ చెప్పారు.ఆరువ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఏప్రిల్ ఒకటివ తేదీలోపుఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు. బడిమానేసి,బడిబయట ఉన్న బాలికలకు, అనాథ పిల్లకు,ఎస్ సి, బి.సి. మైనార్టీలకు చెందిన పిల్లలకు మొదటిసారిగా ప్రాధాన్యత ఇవ్వ నున్నట్లు ఆమె అన్నారు. ఈ వకాశాంను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## నక్కపల్లిలో రూ.1.35 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో "ఉక్కు కర్మాగారం"



గాజువాక,మార్చి 20,ప్రభాతవార్త

పారిశ్రామిక రంగానికి ఊతమిస్తూ అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో రూ.1.35 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో నిర్మించ నున్న 'ఆర్సెలర్ మిట్టల్ - నిప్పన్ స్టీల్' ప్లాంట్‌కు ఈ నెల 23న ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేయనున్నారని ప్రభుత్వ విప్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి గణబాబు వెల్లడించారు. శుక్రవారం విశాఖ పశ్చిమ టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మెగా ప్రాజెక్టు ద్వారా దాదాపు 55,000 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఏడాదికి 17.8 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంతో 2029 నాటికి ప్లాంట్‌ను పూర్తి చేయనున్నారన్నారు. ఈ ప్లాంట్ రాకతో ఉత్తరాంధ్ర దేశంలోనే కీలక పారిశ్రామిక కేంద్రంగా మారుతుందని గణబాబు పేర్కొన్నారు. టీడీపీ సీనియర్ నేత,జింక్ ఆంజనేయ స్వామి మాజీ ట్రస్టి కాకి పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గాజువాకలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు



గాజువాక,మార్చి 20,ప్రభాతవార్త

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించు కుని గాజువాక క్లబ్‌లో శుక్రవారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది. మత సామరస్యానికి ప్రతీకగా సాగిన ఈ వేడుకలో భాజపా రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ కర్ణంరెడ్డి నర్సింగరావు, జనసేన నాయకులు కరణం కనకారావు తదితరులు ముస్లిం సోదరులతో కలిసి విందులో పాల్గొన్నారు.ముస్లిం సోదరులు పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

## యాత విభాగం జిల్లా అధ్యక్షుడిగా అండిబోయిన అప్పారావు



గాజువాక,మార్చి 20,ప్రభాతవార్త

ఉడా కాలనీ వినాయక నగర్ 72వ వార్డులో వైకాపా అనుబంధ విభాగాల నూతన బాధ్యుల సత్కార కార్యక్రమం ఘనంగా జరిగింది. పార్టీ జిల్లా యాత విభాగ అధ్యక్షుడిగా అండిబోయిన అప్పారావు, జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శిగా అండిబోయిన లక్ష్మి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా యాత శెట్టిబలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో వారిని దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ.. కల్లుగీత కార్మికులకు సకాలంలో పింఛన్లు అందేలా చూడటం తో పాటు, ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సంఘ అధ్యక్ష కార్యదర్శులు వనము నాగేశ్వరరావు, అండిబోయిన వెంకటరమణ, అధ్యక్షులు వనము రమణ, మల్లుల సూర్యనారాయణ పాల్గొన్నారు.

## సిటీ పోలీస్ జట్టుకు ఘన ఆరంభం

(విశాఖ క్రైమ్ - ప్రభాత వార్త)

విశాఖపట్నం డిస్ట్రిక్ట్ క్రికెటర్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఇన్స్టిట్యూషనల్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో విశాఖపట్నం సిటీ పోలీస్ క్రికెట్ జట్టు శుభారంభం చేసింది. శుక్రవారం పీఎంపాలెం బి గ్రౌండ్ లో జరిగిన మ్యాచ్‌లో సన్ ఇన్స్టిట్యూషన్స్ జట్టుపై 113 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన సిటీ పోలీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. జట్టులో వి. త్రినాథ్ అద్భుత ప్రదర్శనతో 46 బంతుల్లోనే 109 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించాడు. అతని ఇన్నింగ్స్‌లో 15 ఫోర్లు, 5 సిక్సర్లు ఉన్నాయి. సన్ ఇన్స్టిట్యూషన్ బౌలర్లలో కే. యువతేజ మూడు వికెట్లు పడగొట్టాడు.243 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సన్ ఇన్స్టిట్యూషన్స్ జట్టు 15.4 ఓవర్లలో 130 పరుగులకు ఆలౌటైంది. జట్టులో రోహిత్ 39, ఎస్. కృష్ణ 33 పరుగులతో పోరాడినా ఫలితం లేకపోయింది.సిటీ పోలీస్ బౌలర్లలో కే. శివకేశవ ఐదు వికెట్లు తీసి ప్రత్యర్థి బ్యాటింగ్‌ను కుదేలు చేశాడు. టి. ఉమా మహేశ్వరరావు నాలుగు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.

## రాష్ట్ర ప్రజలు వైయస్ షర్మిల పాలన కోరుకుంటున్నారు



### ఏపీసీసీ స్పోర్ట్స్ సెల్ చైర్మన్ కమలాకర్

విశాఖపట్నం, మార్చి 20 ప్రభాతవార్త

రాష్ట్రంలో ప్రజలు మంచి పాలన కోసం చూస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఏపీ సీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ముఖ్యమంత్రి గా రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని ఏపీసీసీ స్పోర్ట్స్ సెల్ చైర్మన్ కమలాకర్ తెలిపారు. శుక్రవారం వి జె ఎఫ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశం నిర్వహించారు. పిసిసి అధ్యక్షురాలు రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర చేపట్టడంతో అందులో విశాఖ నుండి కమలాకర్ పాల్గొనడంతో ఆయనకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరఫున ఏపీ సీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలారెడ్డి ఫిబ్రవరి 2వ తేదీ నుండి ఈనెల 18వ తారీకు వరకు రాష్ట్రంలో అన్ని జిల్లాలు జిల్లాకు రెండు గ్రామాల్లో పర్యటించారని ఆయన తెలిపారు. ఉపాధి పనిపై ఆమె ఉపాధి కూలీలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సమస్యలను చూసి ఆమె చలించిపోయారని తెలిపారు. ఒక గ్రామంలో మంచినీరే లేదని తెలుసుకొని తక్షణమే కలెక్టర్ కు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య పరిష్కారం చేయాలని కోరారు. మరో గ్రామంలో కాలువలు లేవని కొన్ని గ్రామాల్లో పెన్షన్లు కూడా అందరం లేదని ఉపాధి హామీ పథకానికి వెళ్లిన డబ్బులు ఇవ్వడం లేదని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఉపాధి హామీ పథకం వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే వీటి రూపకల్పన దాల్చుకుందని అప్పట్లో గ్రామ ప్రజలకు ఉపాధి హామీ పథకం ఒక వరంలా మారిందని తెలిపారు. ఒక గ్రామంలో రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన ఉచిత విద్య , ఫీజు రియంబర్స్మెంట్తో ఎంబీఏ చదువుకున్నారని ఆ యువకుడు ప్రభుత్వ ఉద్యోగం లేకపోయినా తన కాలపై తాను నిలబడగలుగుతున్నానని షర్మిలాకు తెలిపినట్లు చెప్పారు. తాను షర్మిల రెడ్డి తో కలిసి సుమారు 9000 కిలోమీటర్లు యాత్ర నిర్వహించానని తాను ఎంతో నేర్చుకున్నట్లు కూడా తెలిపారు. ఆమె ఏదైనా గ్రామానికి వెళ్లాలంటే అక్కడ ప్రజలు ఎండలో ఉండిపోకుండా ఏ సమయమైతే చెప్తే ఆ సమయానికే వెళ్లేవరని ఆమె కమిట్మెంట్ చూసి తనకు ఎంతో నమ్మకం కలిగిందని అన్నారు. ఈ యాత్ర విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త సూర్యనారాయణ, సీనియర్ నాయకులు ఉమ్మడి భాస్కరరావు, కస్తూరి వెంకట్రావు, స్పోర్ట్స్ సెల్ రంగనాయకులు పాత్రుడు, గణేష్, రాజేష్ తోపాటు ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కణితిలో వైభవంగా భవానీ ఋషి స్వామి కల్యాణం



గాజువాక,మార్చి 20,ప్రభాతవార్త :

గాజువాక 87వ వార్డు కణితి పద్మశాలి వీధిలో శ్రీ భద్రావతి సమేత భవానీ ఋషి స్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. ఉగాది పర్వ దినాన్ని పురస్కరించుకుని శ్రీ మార్కండేయ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు వైకాపా అధ్యక్షులు బొడ్డ గోవిందా, గ్రామ కమిటీ చైర్మన్ ప్రగఢ శ్రీనివాస్, వైకాపా నాయకులు దుగ్గపు దానప్పలు, ఆదారి శ్రీను, దాక సత్తిబాబు, దొడ్డి కనకరాజు పాల్గొన్నారు. సేవా సంఘం సభ్యులు తదితరులు కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

## మద్యం తాగించి మొబైల్, నగదు దోపిడి - ఐదుగురు అరెస్ట్

(విశాఖ క్రైమ్ - ప్రభాత వార్త)



పరిచయం పెంచుకుని మద్యం తాగించి ఓ వ్యక్తి పై దాడి చేసి మొబైల్ ఫోన్, నగదు అపహరించిన ఐదుగురిని ఎంవీపీ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి దోపిడీకి వినియోగించిన రెండు స్కూటీలు, ఒక మొబైల్ ఫోన్, నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. పైపింగ్ పనులు చేసే వ్యక్తి ఈ నెల 13న రైల్వే స్టేషన్ సమీపంలోని పవన్‌పుత్ర లాడ్జిలో దిగాడు. అదే రోజు రాత్రి బయటకు వచ్చిన సమయంలో ఇద్దరు వ్యక్తులు పరిచయం కాగా, వారు మరో ముగ్గురిని పరిచయం చేశారు. అనంతరం బాధితుడితో మద్యం, బిర్యానీ కొనిపించి పెద్దవాల్తేర్ శ్మశానం ప్రాంతానికి తీసుకెళ్లి రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము 1 గంట వరకు మద్యం సేవించారు. తరువాత బాధితుడి మొబైల్ ఇవ్వాలని డిమాండ్ చేయగా, అతడు నిరాకరించడంతో ముఖంపై దాడి చేసి 1ప్లస్ మొబైల్ ఫోన్‌తో పాటు రూ.10 వేల నగదు లాక్కొని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎంవీపీ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.70/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.డీసీపీ (క్రైమ్స్) లతా మాధురి, ఇంచార్జి ఏసీపీ (క్రైమ్స్) అన్నెపు నరసింహమూర్తి, సీఐ చక్రధరరావు పర్యవేక్షణలో ఎస్సై చి.రామదాసు సిబ్బందితో కలిసి మొబైల్ లొకేషన్, ఫోన్‌పే లావాదేవీల ఆధారంగా నిందితులను గుర్తించారు. బాధితుడి ఫోన్‌పే యాప్ ద్వారా రూ.73 వేల వరకు డ్రా చేసినట్లు గుర్తించారు.అరెస్ట్ చేసిన నిందితులు ఆరిలోవ ప్రాంతానికి చెందిన సుంకరి గౌతమ్ అలియాస్ పండు, కణ్ణన్ చందు అలియాస్ మిక్కీ, వంగర సాయి దినేష్ అలియాస్ పెద్దముక్కుడు, గుజ్జి నిశాంత్ రెడ్డి అలియాస్ బన్నీ, బొర జగదీష్ అలియాస్ జగ్గు అని పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి బాధితుడికి చెందిన మొబైల్, రూ.36 వేల నగదు, రెండు స్కూటీలు స్వాధీనం చేసుకున్నారు.

**LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**

**స్వాధీనతా ప్రకటన**

(స్థిరాస్తి కొరకు)

[illegible]

1) ... లోన్ ఖాతా నెం.: 71150000 & 711500007 ...

డిమాండ్ నోటీసు తేదీ: 07.06.2025 ... 21.10.2025 ...

స్వాధీనపరచుకొన్న తేదీ : 18.03.2026 ... రూ.9,77,078.28/- ...

[illegible]

2) ... లోన్ ఖాతా నెం.: 711500000 ... డిమాండ్ నోటీసు తేదీ: 21.12.2024

స్వాధీనపరచుకొన్న తేదీ : 18.03.2026 ... తేది.21.12.2024 ... రూ.27,71,661.95/- ...

... APEPDCL ... 1113300K3001964 ...

[illegible]

3) ... లోన్ ఖాతా నెం.: ... డిమాండ్ నోటీసు తేదీ: 11.08.2025 ...

స్వాధీనపరచుకొన్న తేదీ : 18.03.2026 ... తేది.11.08.2025 ... రూ.19,97,068.86/- ...

[illegible]

తేదీ. 18.03.2026 ...

తేది : 18.03.2026 ... సం/- అధీకృత అధికారి,

ప్రదేశం : విశాఖపట్నం ... ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

21-3Pg7exHMNWJQE.qxd:21-3Pg7exHMNWJQE.qxd 1/1/02 7:54 AM Page 1



# తెలంగాణ బడ్జెట్ రూ.3,24,234 కోట్లు

**• ఆరు గ్యారంటీలకు రూ.50,713 కోట్లు • రైతు భరోసాకే రూ.18వేల కోట్లు • ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5,500 కోట్లు • మహాలక్ష్మి పథకానికి రూ.4,305 కోట్లు • గృహజ్యోతి పథకానికి రూ.2,080 కోట్లు • యువతకు విదేశీ ఉపాధి కోసం "సిఎం. ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం" • చేయూతలో నూతన పెన్షన్లు • గోదావరి పుష్కరాలకు రూ.500 కోట్లు • అసెంబ్లీలో 2026-27 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



హైదరాబాద్, మార్చి 20 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర వార్షిక బడ్జెట్ రూ.3,24,234 కోట్లు. అందులో రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లు కాగా.. మూలధన వ్యయం రూ.47,267 కోట్లు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. మధ్యాహ్నం 12.05 గంటలకు ప్రారంభించిన బడ్జెట్ ప్రసంగాన్ని గంట 56 నిమిషాలపాటు ప్రసంగించారు. బడ్జెట్ ప్రసంగం ప్రారంభిస్తూ.. పేదవాడి కన్నీరు తుడిచిన నాడే నిజమైన అభివృద్ధి అని అన్నారు. బడ్జెట్ కేవలం సంఖ్యలు, అక్షరాలు మాత్రమే కాదని, తెలంగాణ ప్రజలకు వారి భవిష్యత్‌కు భరోసా కల్పిస్తుందన్న నమ్మకంతో ప్రజల పక్షాన నిలబడి వారి స్వప్నం సాకారం చేసే బడ్జెట్ అన్నారు. వార్షిక బడ్జెట్ రూ. 3,24,234 కోట్లు, రెవెన్యూ వ్యయం రూ. 2,34,406 మూలధన వ్యయం, రూ.47,267 కోట్లుగా ప్రతిపాదిస్తూ సభకు సభకు సమర్పిస్తున్నాని ఉపముఖ్యమంత్రి ప్రకటించారు. 2025-26లో జిఎస్‌డిపి, తలసరిఆదాయం,తెలంగాణ ఆర్థిక వృద్ధిని కూడా ఆయన వివరిస్తూ భవిష్యత్‌లో ఆర్థిక ప్రణాళికను వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో, తెలంగాణస్థూల రాష్ట్రదేశీయోత్పత్తి ప్రస్తుత ధరల ప్రకారం 17,82,198 కోట్ల రూపాయలు. గత సంవత్సరంతో పోలిస్తే వృద్ధిరేటు 10.7శాతంగా నమోదు అయ్యింది. ఇదే సమయంలో, దేశ జిడిపిలో 3,57,13,886 కోట్లు రూపాయలు కాగా, వృద్ధిరేటు 8 శాతంగా ఉంది. తెలంగాణ వృద్ధి రేటు దేశ సగటు వృద్ధి రేటు కంటే 2.7 శాతం ఎక్కువగా ఉంది. అదే విధంగా దేశ జిడిపిలో రాష్ట్ర జిఎస్‌డిపి 5.0శాతం వాటా కలిగి దేశానికి ఒక బలమైన 'గ్రోత్ ఇంజిన్‌గా తెలంగాణ నిలుస్తోంది. భారతదేశ వృద్ధిరేటు తగ్గుతూ మందగమనంలో ఉన్నప్పటికీ, మన రాష్ట్ర వృద్ధిరేటులో మెరుగైన పెరుగుదల కనబడుతోంది. ప్రస్తుత ధరల ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో 9.8 శాతంగా ఉన్న దేశ జిడిపి వృద్ధి రేటు, 2025-26 నాటికి 8 శాతానికి పడిపోయింది. కానీ, సరిగ్గా ఇదే సమయంలో తెలంగాణ రాష్ట్ర స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి వృద్ధిరేటు 2024-25లో 10.6శాతం నుంచి 2025-26 నాటికి 10.7 శాతానికి పెరిగింది.దీని ద్వారా, మన ప్రభుత్వం ఆచరిస్తున్న విధానాలు సరియైన దిశలో ఉన్నాయని, అవి అభివృద్ధికి తోడ్పడుతున్నాయని అనడానికి నిదర్శనం. రాష్ట్ర తలసరి ఆదాయం గణనీయంగా పెరిగింది. 2025-26ఆర్థిక సంవత్సరంలో, ప్రస్తుత ధరలప్రకారం రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931లు కాగా, వృద్ధి రేటు 10.2శాతం. దేశ తలసరి ఆదాయం రూ.2,19,575లు కాగా వృద్ధిరేటు కేవలం 6.9 శాతం. దేశ తలసరి ఆదాయంతో పోల్చితే తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,99,356 ఎక్కువ. అంటే 1.9 రెట్లు ఎక్కువగా ఉంది. 200 యుఎస్ బిలియన్ డాలర్లుగా ఉన్న ఆర్థిక వ్యవస్థ 2034కు ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా 2047కు 3 ట్రిలియన్ యుఎస్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేసింది. ఈసారి పద్దులో రైతు భరోసాకు రూ.18 వేల కోట్లు కేటాయించింది. దేశానికి అన్నం పెడుతున్న రైతు సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యతగా తమ ప్రభుత్వం భావిస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. రైతులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో వ్యవసాయ దిగుబడులలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. రైతులకు పెట్టుబడి సహాయం కోసం ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ.6,000 చొప్పున రెండు పంటలకు కలిపి సంవత్సరానికి రూ.12,000 సహాయం అందిస్తున్నామని అన్నారు. ఈ బడ్జెట్లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి రూ.23,179 కోట్లు ప్రతిపాదిస్తున్నామన్నారు. ఆరు గ్యారంటీలకు రూ. 50,713 కోట్లను కేటాయించింది. ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండడం వారి ఆత్మ గౌరవానికి చిహ్నంగా ఉంటుంది. దీనిని గుర్తించిన ప్రభుత్వం "ఇందిరమ్మ ఇళ్లు" అనే బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించిందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. పేద కుటుంబాలకు వారి సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులకు ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. ఈ పథకం కింద ప్రభుత్వం 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రూ.5,500 కోట్లు కేటాయిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు పరచిన మొదటి వాగ్దానం ఉచిత బస్సు ప్రయాణమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ప్రతిరోజు రాష్ట్రంలోని 34 లక్షల 37 వేల మంది ఆడబిడ్డలు ఉచితంగా ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణిస్తున్నారని చెప్పారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలు 269 కోట్ల 68 లక్షల ఉచిత ప్రయాణాలు చేసి, దాదాపు రూ.9,222 కోట్లు ఆదా చేసుకున్నారని వెల్లడించారు. ఈ సంవత్సరం మహాలక్ష్మి పథకానికి రూ.4,305 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. గృహజ్యోతి పథకం ద్వారా సుమారు 53 లక్షల 9 వేల పేద, మధ్య తరగతి కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందిస్తున్నామని భట్టిపేర్కొన్నారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు 10.97 కోట్ల సున్నా బిల్లులు జారీ చేశామన్నారు. కాగా ఈ సంవత్సరానికి గృహజ్యోతి పథకానికి రూ. 2,080 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. యువతకు ఉపాధి కల్పించేందుకు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ టామ్‌కామ్ ద్వారా యూఏఈ, జర్మనీ, జపాన్, యుకె, కెనడా వంటి 16 దేశాలలో సుమారు 13,930 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా నూతనంగా "సిఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం"ను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ బడ్జెట్‌లో కార్మిక సంక్షేమ శాఖకు రూ.998 కోట్లు ప్రతిపాదిస్తున్నామని తెలిపారు. చేయూత పథకానికి అర్హులైన వారికి 2 లక్షల నూతన పెన్షన్లను మంజూరు చేస్తున్నామన్నారు. నేటి బడ్జెట్‌లో చేయూత పథకానికి రూ.14,861 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు.

గత ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణరాహిత్య విధానాలను సవరిస్తూ అధిక వడ్డీకి తెచ్చిన రూ.25,612 కోట్ల రుణాలను తక్కువ వడ్డీకి మా ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. అంతేకాకుండా, రుణ చెల్లింపుల వ్యవధిని పెంచి, అసలు చెల్లించాల్సిన కాలాన్ని 20నుంచి 39 సంవత్సరాలకు పొడిగించింది. ఈ రుణ పునర్ వ్యవస్థీకరణ ద్వారా 2025-26 నుండి 2031-32 దాకా చెల్లించాల్సిన 34 వేల 58 కోట్ల రూపాయల నుంచి 11 వేల 915 కోట్లకు తగ్గింది. దీని ద్వారా, రాష్ట్రానికి 22 వేల 142 కోట్ల రూపాయలు క్యాష్ అవుట్ ఫ్లో తగ్గి నగదు వెసులుబాటు కలిగింది. రాష్ట్ర దీర్ఘకాలిక అభివృద్ధి వ్యూహంను క్యూర్ ప్యూర్ రేర్‌లతో ప్రతిపాదించింది. దీనితో సమతుల్య, సుస్థిర అభివృద్ధి సాధించడానికి వీలవుతోంది. గోదావరి పుష్కరాల నిర్వహణ కొరకు ఈ బడ్జెట్‌లో రూ.500 కోట్లు ప్రతిపాదిస్తున్నాం. గోదావరి పుష్కర పవిత్ర దినాల్లో సుమారు 8 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత భీమా ఇస్తామని తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పేరుతో మొదలయ్యే ఈ పథకానికి రూ.4 వేల కోట్లుకేటాయిస్తామని జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేస్తామని ప్రకటించారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రకటించారు. ప్రి ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు అల్పాహారం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం అమలు చేస్తామని. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు ఇస్తామని తెలిపారు. ఐటిఐ, ఎటిసిల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల ఉపకారవేతనం ఇస్తామని తెలిపారు. రూ.73,383 కోట్ల కొత్త రుణాలకు ప్రతిపాదన చేశారు. వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు,పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు కేటాయిస్తు డిప్యూటీ సిఎం ప్రకటన చేశారు. విద్యా శాఖకు రూ.26.674 కోట్లు ప్రతిపాదించారు. వైద్య శాఖకు రూ.13,679 కోట్లు, కార్మిక శాఖకు రూ.998 కోట్లు, మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు, పర్యాటక రంగానికి రూ.1,224 కోట్లు, ఎస్సీ సంక్షేమం కోసం రూ.11,784 కోట్లు ప్రతిపాదించారు. ఎస్టీ సంక్షేమం రూ.7,934 కోట్లు, వెనుకబడిన తరగతుల సంక్షేమం రూ.12,511 కోట్లు కేటాయిస్తూ ప్రకటన చేశారు. మైనార్టీ సంక్షేమం రూ.3,769 కోట్లు, కల్యాణ లక్ష్మీ పథకం రూ.3,683 కోట్లు కేటాయింపుల చేశారు. ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు ప్రతిపాదించారు. యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు ప్రకటించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్మెంట్ రూ.1500 కోట్లు, ఉస్మానియా యూనివర్సిటీకి వెయ్యి కోట్ల రూపాయలు, మెట్రో రైలు ఫేజ్2 కోసం రూ.600 కోట్లు మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ పథకం రూ.723 కోట్లు కేటాయిస్తూ ప్రతిపాదనలు చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి రూ.33,688 కోట్లు కేటాయించామని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు రూ.22,615 కోట్లు ప్రతిపాదించారు. పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ రూ.17,907కోట్లు, శాంతి భద్రతలు రూ.11,907 కోట్లు, పర్యాటక శాఖ రూ.1,224 కోట్లు కేటాయించారు. పంచాయతీరాజ్ రోడ్లకు 2,062 కోట్లు రోడ్లు భవనాల శాఖకు 6416 కోట్లు కేటాయించారు. హ్యాంమ్ రోడ్లకు 3053 కోట్లు, రీజనల్ రింగ్ రోడ్డుకు 1525 కోట్లు, రాజీవ్ యువ వికాసానికి 5800 కోట్లు ప్రతిపాదించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా, సమాజంలోని అట్టడుగు వర్గాల సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశామన్నారు. గతంలో జరిగిన ఆర్థిక తప్పిదాలను సరిదిద్దుతూ, రాష్ట్రాన్ని అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకు కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నామని సభకు వివరించారు.

# పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు నిధుల పెంపు

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** ఈ యేడాది 2026-27 బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధిశాఖకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. గత 2025-26 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది బడ్జెట్‌లో నిధుల కేటాయింపు పెరిగింది. ఈ ఏడాడి బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు రూ. 33, 688 కోట్ల కేటాయింపులు జరిగాయి. గత ఏడాది బడ్జెట్‌లో రూ.31605 కోట్లు కేటాయించారు. మొత్తంగా గత బడ్జెట్‌తో పోలిస్తే ఈ ఏడాది పంచా యతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు రూ.2083 కోట్ల మేర కేటాయింపులు పెరిగాయి. అయితే పెంపు మొత్తం అతి స్వల్పంగా కావడం గమనార్హం. గత 2025-26 మొత్తం బడ్జెట్ రూ.3,04, 965కోట్లు కాగా అందులో 31605 కోట్ల కేటాయింపు శాతం 10.36శాతంగా ఉండగా ఈ ఏడాది 3, 24, 234 కోట్లలో కేటాయింపులు రూ.33, 688 కోట్ల కేటాయింపు 10.39 శాతంగా ఉంది. గత ఏడాది మొత్తం బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు కేటా యింపుల శాతంతో పోలిస్తే ఈ ఏడాది కేటాయింపుల శాతం అతి స్వల్పంగా 0.03శాతం మేర మాత్రమే పెరిగాయి. ఈ ఏడాది బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు కేటా యించిన రూ.33688 కోట్లలో రూ.5893 కోట్లను ఉద్యోగుల జీతాలు, ఇతరత్రా ఖర్చులు (ఎస్టాబ్లిష్‌మెంట్)కింద ఖర్చు చేయనుండగా రూ. 27, 794 కోట్లను శాఖాపరమైన గ్రామీ ణాభివృద్ధి కార్యక్రమాల కోసం ఖర్చు చేయనున్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో పంచా యతీరాజ్ రోడ్ల అభివృద్ధి కోసం రూ. 2062 కోట్లను ప్రత్యేకంగా కేటాయిం చారు. ఇక 5 లక్షల కంటే తక్కువ గ్రాంట్లు పొందే పంచాయ తీలకు ఆర్థికసాయం కింద రూ.10కోట్లు, సర్పంచ్‌ల వేతన చెల్లింపుల కోసం రూ.99కోట్లు, హ్యామ్ రోడ్ల నిర్మాణం కోసం రూ.1372 కోట్లు, గ్రామాల్లో వంతెనల నిర్మాణం కోసం రూ.20కోట్లు, గ్రామ పంచాయతీలకు స్టేట్ ఫైనాన్స్ నిధుల కింద మ్యాచింగ్ గ్రాంట్ రూ.721కోట్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలుకు రూ.600 కోట్లు, చేయూత పింఛన్ల చెల్లింపుకు రూ.14, 861 కోట్లు కేటా యించారు. అదేవిధంగా గ్రామీణ రోడ్ల నిర్మాణం కోసం రూ.750 కోట్లు, రోడ్ల నిర్వహణ కోసం ప్రత్యేకంగా రూ.500 కోట్ల కేటాయింపులు జరిగాయి. ఇక హ్యామ్ విధానంలో రోడ్ల నిర్మాణంలో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 2,980 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు.




> 2,083 కోట్లు అధికంగా మొత్తం రూ. 33,688 కోట్లు కేటాయింపు
>
> మొత్తం బడ్జెట్‌లో 10.39 శాతం నిధులు
>
> హ్యామ్ రోడ్ల నిర్మాణానికి రూ.1372 కోట్లు,
>
> చేయూత పింఛన్లకు రూ.14, 861 కోట్లు

## ప్రయాణికులకు అలర్ట్... పలు ప్యాసింజర్ రైళ్లు రద్దు

**తార్నాక, మార్చి 20 ప్రభాతవార్త:** ఎపి, తెలంగాణ రాష్ట్రాల్లో రైలు ప్రయాణం చేసే ప్రయాణికులకు ముఖ్యమైన సమాచారాన్ని అందించింది రైల్వే శాఖ. రైల్వే ట్రాక్ మరమ్మతులు, అభివృద్ధి పనుల కారణంగా పలు మార్గాల్లో నడిచే ప్యాసింజర్ రైళ్ల తాత్కాలికంగా రద్దు చేయబడినట్లు రైల్వే శాఖ వెల్లడించింది. ఈ రైళ్ల నిర్ణీత తేదీల్లో నడవవని అధికారులు స్పష్టం చేశారు. పనులు పూర్తయ్యిన తర్వాత సేవలను పునరుద్ధరించనున్నట్లు వెల్లడించారు. ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందు సంబంధిత రైళ్ల సమయాలు, రద్దుల వివరాలు అధికారిక వెబ్‌సైట్ లేదా హెల్ప్‌లైన్ ద్వారా తెలుసుకోవాలని సూచించారు.

## పుదుచ్చేరిలో పొత్తులు ఖరారు

**పుదుచ్చేరి, మార్చి 20:** పుదుచ్చేరిలోని ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ సారథ్యంలోని ఎన్డీయేలో సీట్ల పంపకాలు ఖరారయ్యారు. ఆ ప్రకారం ఏఐ ఎన్ఆర్‌సీ 16 సీట్లలో పోటీ చేయనుండగా, భాగస్వామ్య పక్షమైన బీజేపీ 10 సీట్లలో పోటీ చేయనుంది. తక్కిన భాగస్వామ్య పక్షాల్లో అన్నాడీ ఎంకే, ఎల్‌జేకేకు చెరో రెండు సీట్లు కేటాయించారు. సిఎం ఎన్ రంగస్వామి సారథ్యంలో ఎన్డీయే కూటమి ఎన్నికలకు వెళ్తోంది. ఎన్డీయే కూటమితో ఏఐఎన్ఆర్‌సీ పొత్తు కొనసాగించే విషయంలో కొద్దిరోజులుగా సస్పెన్స్ కొనసాగుతున్నప్పటికీ ఇందులో ఎలాంటి మార్పు లేదని, బీజేపీతో కలిసే ఎన్నికలకు వెళ్తున్నామని రంగస్వామి శుక్రవారం ప్రకటించారు. ఈసారి ఆయన రెండు నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నారు. తట్టంచవాడి, మంగళం నియోజకవర్గాల్లో నామినేషన్లు వేశారు. ఏప్రిల్ 9న పోలింగ్ జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి. 2021 పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో రంగస్వామి సారథ్యంలోని ఏఐఎన్ఆర్‌సీ 10 సీట్లు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా నిలిచింది. డీఎంకే 6, కాంగ్రెస్ 6, బీజేపీ 6 సీట్లు గెలుచుకున్నాయి. 84.8 శాతం ఓటింగ్ నమోదైంది. 2016 ఎన్నికల్లో కాంగ్రెస్ 15 సీట్లతో మెజారిటీ సాధించింది. ఏఐఎన్ఆర్‌సీ 8 సీట్లు, అన్నాడీఎంకే 4 సీట్లు, డీఎంకే 2 సీట్లు దక్కించుకున్నాయి. 83.6 శాతం పోలింగ్ నమోదైంది.



## భారత్‌లో ఎస్ఇడి న్యూరోసైన్స్ ఆధారిత లెర్నింగ్ ప్లాట్‌ఫాం ప్రారంభం

### శ్రీచైతన్యతో వ్యూహాత్మక భాగస్వామ్యం ప్రకటన




హైదరాబాద్, మార్చి 20 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి: అమెరికాకు చెందిన స్టూడెంట్ ఎడ్యుకేషన్ డయాగ్నస్టిక్స్ (ఎస్ఈడి) తన నేచురల్ ఇంటెలిజెన్స్, న్యూరోసైన్స్ ఆధారిత లెర్నింగ్ డయాగ్నస్టిక్ ప్లాట్ ఫాంను భారత దేశంలో అధికారికంగా ప్రారంభించింది. ఈ సందర్భంగా మార్చి 20న హైదరాబాద్‌లోని హోటల్ దస్పల్లాలో ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి ముందు మార్చి 17న న్యూఢిల్లీలో విజయవంతంగా మొదటి లాంచ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈడీ, శ్రీచైతన్య ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ భాగస్వామ్యానికి గుర్తుగా రెండు సంస్థల మధ్య కుదిరిన మెమొరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్ (ఎంఓయు) ఫ్రేమ్ కాపీని ఎస్ఈడీ ప్రతినిదులు శ్రీచైతన్య ప్రతినిధులకు వేదికపై అందజేశారు. మీడియా సమక్షంలో జరిగిన ఈ ఎంఓయు ప్రదర్శన ఈ కార్యక్రమానికి ముఖ్య ఆకర్షణగా నిలిచింది. ఎస్ఈడీ ప్లాట్‌ఫాం సంప్రదాయ మూల్యాంకనం విధానాలకు భిన్నంగా, విద్యార్థులు ఎలా నేర్చుకుంటారు అనే అంశంపై దృష్టి పెడుతుంది. నేచురల్ ఇంటెలిజెన్స్, న్యూరోసైన్స్ సిద్ధాంతాల ఆధారంగా, ఇది విద్యార్థుల మానసిక నమూనాలను విశ్లేషించి, వారి బలాలు, లెర్నింగ్ గ్యాప్స్‌ను గుర్తించి వ్యక్తిగత అభివృది మార్గాలనను రూపొందిస్తుంది. ఈ ప్లాట్ ఫాం న్యూరోసైన్స్ బెస్ట్ అసెస్‌మెంట్స్ ద్వారా విద్యార్థులు సమాచారాన్ని ఎలా గ్రహిస్తారు. ఎలా ఉపయోగిస్తారు అన్న దానిని విశ్లేషిస్తుంది. తద్వారా వ్యక్తిగత అకడమిక్ రోడ్ మ్యాప్‌లను రూపొందించి ప్రారంభ దశలోనే లెర్నింగ్ లోపాలను గుర్తించి విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

శ్రీచైతన్య ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ అకడమిక్ డైరెక్టర్ సీమ బొప్పన మాట్లాడుతూ ఎస్ఈడీతో భాగస్వామ్యం కావడం మాకు ఆనందంగా ఉంది, నేచురల్ ఇంటెలిజెన్స్, న్యూరోసైన్స్ ఆధారంగా విద్యార్థులు లెర్నింగ్ ప్యాటర్న్స్‌ను అర్థం చేసుకోవడం ద్వారా విద్యా వ్యవస్థ మరింత బలపడుతుందన్నారు. ఎస్ఈడి వ్యవస్థాపకులు శ్రీనేష్ వి, ఎస్ఈడీ సీఈవో ఆష్లీ సంబాలుక్ మాట్లాడారు.

## టిడిపి అధిష్టానానికి ఎంపి పుట్టా సంజాయిషీ

### డ్రగ్స్ తీసుకున్నారనే అభియోగాలపై సీల్డ్‌కవర్‌లో వివరణ

**విజయవాడ, మార్చి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** టీడీపీ అధిష్టానం ఇచ్చిన సంజాయిషీ లేఖకు ఎంపీ పుట్టా సతీష్ వివరణ ఇచ్చినట్లు కీలక సమాచారం. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించినందుకు గాను టీడీపీ హైకమాండ్ ఎంపీ మహేశ్ కుమార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనిపై స్పందించిన ఎంపీ, తన వివరణను ఒక సీల్డ్ కవర్‌లో పార్టీ కార్యాలయానికి పంపారు. ఈ లేఖను అందుకున్న ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు కి పంపించారు. ప్రస్తుతం ఈ లేఖలో ఎంపీ ఏం వివరణ ఇచ్చారనేది రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. హైదరాబాద్ శివార్లలోని మొయినాబాద్ ప్రాంతంలో జరిగిన ఒక ప్రైవేట్ పార్టీపై పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ పార్టీలో డ్రగ్స్ వినియోగం జరిగినట్లు సమాచారం రావడంతో ఈగల్ బృందం రంగంలోకి దిగింది. పార్టీలో పాల్గొన్న పలువురికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌తో పాటు పలువురికి డ్రగ్స్ తీసుకున్నట్లు తేలింది.డ్రగ్స్ కేసులో ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ పట్టుబడిన వ్యవహారంపై చంద్రబాబు మొదటి నుంచి సీరియస్‌గా ఉన్నారు. ఇటీవల తిరుపతిలో జరిగిన ఎమ్మెల్యేల సమావేశంలో కూడా ఎంపీ పేరును ప్రస్తావిస్తూ చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ పేరు డ్రగ్స్ కేసులో వినిపించడమే కాకుండా, పరీక్షల్లో పాజిటివ్ అని తేలడంతో టీడీపీ హైకమాండ్ తీవ్రంగా పరిగణించింది.

### రోహిత్ రెడ్డి సహా ముగ్గురు నిందితుల

## కస్టడీపై సోమవారం తీర్పు

### మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ కేసు

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్‌లోని రోహిత్ రెడ్డి ఫాం హౌస్ డ్రగ్స్ కేసు వ్యవహారంలో అరెస్టయిన ముగ్గురు వ్యక్తుల కస్టడీ పిటిషన్‌పై రాజేంద్రనగర్ కోర్టు సోమవారం నాడు తీర్పు వెలువరించనుంది. ఈ మేరకు న్యాయమూర్తి శుక్రవారం ఆదేశాలు వెలువడ్డాయి. ఈ నెల 14వ తేదీ రాత్రి మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్‌లో గల రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌లో పోలీసులు దాడిచేసిన సమయంలో రితేష్ రెడ్డికి చెందిన లైసెన్స్ రివాల్వర్‌ను నమిత్ శర్మ తీసుకుని పోలీసులను భయపెట్టేందుకు గాలిలో నాలుగు రౌండ్లు కాల్పులు జరపడం సంచలనం రేపింది. పోలీసులపై కాల్పులు జరపాలని రోహిత్ రెడ్డి పురిగొల్పినట్లు పోలీసులు నిర్ధారించారు. దీంతో రోహిత్ రెడ్డి తన ఫాం హౌస్‌లో అసాంఘీక కార్యకలాపాలకు స్థానం కల్పించినందుకు, తన లైసెన్స్ రివ్వార్‌ను మరో వ్యక్తికి ఇచ్చి నందుకు రితేష్ రెడ్డిని, మరొకరి రివాల్వర్‌చేత పోలీసులపై కాల్పులు జరిపినందుకు నమిత్ శర్మను పోలీసులు అరెస్టు చేశారు. డ్రగ్స్ సేవించిన ఎంపి మహేష్ కుమార్ యాదవ్ సహా అందరికి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. కాగా పోలీసులు అరెస్టు చేసిన రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలు ప్రస్తుతం చంచల్‌గూడ జైల్లో వుండగా, వీరిపై డ్రగ్స్ వాడడం, అక్రమంగా మాదకద్రవ్యాలు కలిగి వుండడంతో పాటు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. దీనిపై శుక్రవారం నాడు మరోసారి విచారించిన న్యాయమూర్తి తీర్పును సోమవారం వెలువరించనున్నట్లు ప్రకటించారు.

## హైదరాబాద్ పన్ను చెల్లింపుదారులకు శుభవార్త

### హెచ్‌ఆర్‌ఎ మినహాయింపు 50శాతం పెంపు ఇంటి యజమాని వివరాలు తప్పనిసరిగా వెల్లడించాలి: కేంద్రం

**న్యూఢిల్లీ, మార్చి 20:** హైదరాబాద్ పన్ను చెల్లింపుదారులకు కేంద్రం శుభవార్త చెప్పింది. ఏప్రిల్ 1, 2026 నుండి అమల్లోకి వచ్చే కొత్త ఆదాయపు పన్ను నిబంధనల నోటిఫికేషన్ ప్రకరారం, అద్దె ఇళ్లలో నివసించే జీతభత్యాలు పొందే ఉద్యోగులకు లభించే పన్ను రాయితీ (హెచ్‌ఆర్‌ఎ మినహాయింపు) 50శాతానికి పెంచింది. ఇంతకు ముందు ఈ మినహాయింపు 40శాతం ఉండేది. సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ (సిబిడిటి) ఈ మేరకు నిబంధనలను నోటిఫై చేసింది. ఈ అధిక పన్ను రాయితీ కోసం ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై నగరాలతోపాటు హైదరాబాద్, బెంగళూరు, పుణె, అహ్మదాబాద్ వంటి కొత్త నగరాలు కూడా చేరాయి. కానీ ఇంటి యజమాని అద్దెదారు సంబంధాన్ని వెల్లడించడాన్ని తప్పనిసరి చేసే ఆదాయపు పన్ను చట్టం, 2025కు సంబంధించిన నిబంధనలను కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు శుక్రవారం నోటిఫై చేసింది. దేశంలోని ఇతర ప్రాంతాల్లోని ఉద్యోగులకు 40 శాతం మినహాయింపు అమలులో ఉంటుంది. హెచ్‌ఆర్‌ఏ పరిమితిని 50 శాతానికి పెంచడంతో హైదరాబాద్ జీతభత్యాల వర్గానికి భారీ పన్ను ఉపశమనమని చెప్పవచ్చు.

## చేవెళ్లలో పెద్ద శబ్దంతో భూ ప్రకంపనలు

### భయంతో వణికి పోయిన జనం

**చేవెళ్ల, మార్చి 20, ప్రభాతవార్త:** చేవెళలో పెద్ద శబ్దంతో భూ ప్రకంపనలు కలకలం సృష్టించింది. శుక్రవారం ఉ. 9.30 గం.ల ప్రాంతంలో చేవెళ్లలో పెద్ద శబ్దం రావడంతో జనం వణికి పోయారు. ఒక్క సారిగా పెద్ద శబ్దంతో భూమి కంపించడంతో జనం తీవ్ర భయాందోళనకు గురైయ్యారు. దీంతో ఎమైందో తెలియక జనం పరుగుల తీశారు. భూమి కంపించిందని కొందరు చెప్పగా, శబ్దం వచ్చిందని మరి కొందరు స్థానికులు తెలిపారు. ఇంట్లోని వస్తువులు కదలడం గమనించామని తెలిపారు. భూ ప్రకంపమా? లేక పెద్ద ఎత్తున భూమిని ఎవరైన బ్లాస్లింగ్ చేశారా? అని, భూకంపం వస్తే భూమి కంపిస్తుంది కాని శబ్దం మాత్రం రాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. శబ్దంతో పాటు భూమి కంపిండంతో ఎమై ఉంటుందని తెలియక జనం తికమక పడుతున్నారు. ఇప్పటికి ఏమై ఉంటుందో తెలియరాలేదని తెలిపారు.

## అసెంబ్లీ ఆవరణలో పాము కలకలం

**హైదరాబాద్, మార్చి 20 ప్రభాతవార్త:** అసెంబ్లీలో పాము కలకలం సృష్టించింది. శుక్రవారం శాసన మండలి పాత భవనం గార్డెన్ వద్ద పాము ప్రత్యక్షం కావడంతో అక్కడున్న వారు పరుగులు తీశారు. వెంటనే అప్రమత్తమైన ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆర్. వెంకటేష్ నాయక్ పామును పట్టుకున్నారు. పట్టుకున్న పాముతో కానిస్టేబుల్ మీడియా పాయింట్ వద్దకు రావడం.. అక్కడు న్న కెమెరాలు క్లిక్ మనిపించాయి. అనంతరం జూపార్కు అధికారులకు సమాచారం అందించి వారికి పామును అప్పగించారు. పామును ధైర్యంగా, చాకచక్యంగా పట్టుకున్న ట్రాఫిక్ కాని స్టేబుల్‌ను పలువురు అభినందించారు. అసెంబ్లీ సమావేశాలు మరికొద్ది సేపట్లో ప్రారంభం అయ్యే సమయంలో పాము ప్రత్యక్షం కావడం, అక్కడే డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంకటేష్ నాయక్ పామును పట్టుకొని జెర్రిపోతు గా తేల్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



అసెంబ్లీ ఆవరణలో పామును పట్టుకున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆర్. వెంకటేష్ నాయక్

## ఘనంగా వీరు నాయుడు తీర్థం ...



ఎలమంచిలి, మార్చి 20, ప్రభాతవార్త

విశాఖ డైరీ గత చైర్మన్ ఆడారి తులసి రావు తాతయ్య ఆడారి వీరునాయుడు తీర్థ మహోత్సవం పట్టణంలో వీరు నాయుడు కోట వద్ద ఘనంగా జరిపేందుకు ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది ఉగాది మరునాడు ఆనవాయితీగా జరిపే తీర్థం శుక్రవారం నాడు జరిపేందుకు ఏర్పాటు చేశారు. ఉదయాన్నే మునుమను రాలైన మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధ్యాహ్నం కోట వద్ద అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో కుటుంబీకులు పిల్లా రామకృష్ణ,ఆడారి రాధాకృష్ణ, బిజెపి పార్టీ నుండి సుందరపు బాబ్జి, బొడ్డెడ సురేష్ ,ఎల్లపు రాజు,విశాఖ డైరీ జోనల్ మేనేజర్ శ్రీను,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులతో ఎం.వి.ఆర్ భేటీ

### లక్ష రూపాయల విరాళం ఇచ్చేందుకు సంసిద్ధత

అనకాపల్లి, మార్చి20, ప్రభాత వార్త



పట్టణానికి చెందిన ప్రముఖ సంఘ సేవకులు, పారిశ్రామికవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎం వి ఆర్) ను విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) జిల్లా కమిటీ సభ్యులు శుక్రవారం పట్టణంలోనే నర్సింగరావుపేటలో గల ఎం.వి.ఆర్ ప్రధాన కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హిందూ ధర్మ ప్రచారానికి, సామాజిక సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారంగా ఎం.వి.ఆర్ లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించి, త్వరలో అందజేస్తానని నిర్వాహకులకు తెలియజేశారు.ఆయన భారతీయ జనతా పార్టీలోకి వస్తున్నారనే వార్త పట్ల వి.హెచ్.పి నేతలు హర్షం వ్యక్తం చేస్తూ.. హిందూ సంప్రదాయాలను గౌరవిస్తూ, ధర్మ రక్షణకు అండగా నిలుస్తున్న ఎం.వి.ఆర్ రాజకీయాల్లోకి రావడం మాకు గర్వకారణం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా విహెచ్‌పి అధ్యక్షులు డాక్టర్ డి.డి. నాయుడు, సహ కార్యదర్శి లీలా హేమ జగదీష్ నాయుడు, ఉపాధ్యక్షులు రాపిడి రామకొండరావు, కటకం లక్ష్మణరావు, కాళహస్తి రమేష్‌లతో పాటు ఎం.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అనకాపల్లి ఇంచార్జ్ గైపూరి రాజు అభిమానులు పాల్గొన్నారు.

## సీతారామ కళ్యాణం ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



అనకాపల్లి మార్చి 20 :(ప్రభాత వార్త)

స్థానిక మెయిన్ రోడ్ చిన్న బజార్ వద్ద లో కొలువైన శ్రీ సీతారామ ఆలయంలో ఈనెల 27న శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం సందర్భంగా శుక్రవారం ఆలయంలో స్వామివారి కళ్యాణ ఆహ్వాన పత్రికలు కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో. శాశ్వత గౌరవ అధ్యక్షులు. కొణతాల జగన్నాధరావు నాయుడు (జగన్), శాశ్వత ఆలయ అధ్యక్షులు. కె నారాయణ రావు మాస్టారు, కార్యదర్శి సిరసపల్లి సూరిబాబు, కోశాధికారి. దాసిరెడ్డి వెంకటేశ్వరరావు. సత్తివాడ దుర్గారావు,ఉత్సవ కమిటీ అధ్యక్షులు. తిమ్మా పాత్రుని వెంకటేష్, కార్యదర్శి. సిరసపల్లి రాజు, కోశాధికారి. పాముల ప్రసాద్. ఆలయ కన్వీనర్ కుంచా చిన్ను, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు అండగా నిలిచిన లోకేష్ : మాజీ ఎమ్మెల్సీ నాగ జగదీష్

అనకాపల్లి మార్చి 20 (ప్రభాత వార్త)



తెలుగు సంవత్సరం ఉగాది రోజున నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించిందని, నైరాస్యంగా ఉన్న యువతకు జాబ్ క్యాలెండర్ ఆక్సిజన్ ల పనిచేస్తుందని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు విద్య ఐటీ శాఖ మాత్యులకు అభినందనలు తెలియజేశారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రతి జనవరిలో జాబ్ క్యాలెండర్ అని చెప్పి యువతను మోసం చేసి వారి ఆశల నిరాశలు చేసిన జగన్ రెడ్డి వారి నోట్లో మట్టి కొట్టారని నాగ జగదీష్ అన్నారు. నాడు యువగళం పాదయాత్రలో యువతకు ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ పథకంలో మెగా డీఎస్సీ తొలి సంతకం చేసి నోటిఫికేషన్ జారీ చేసి 16,467 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు తీసుకువచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ఉగాది రోజున ప్రకటిస్తామని చెప్పిన ప్రకారం 10060 ఉద్యోగాలకు ముందుగానే తేదీలు ప్రకటించి ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామని ఘనత కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పారదర్శకంగా ఉద్యోగాలు భర్తీ చేయడానికి తీసుకున్న నిర్ణయం గర్వకారణమని నాగ జగదీష్ అన్నారు. డీఎస్సీ పోలీస్ నియమకాలు మినహా అన్నింటినీ ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేస్తామని ఇది నిరుద్యోగ యువతకు పారదర్శకమని ఎటువంటి అవినీతి అక్రమాలకు చోటు ఇవ్వకుండా ఇటువంటి నిర్ణయం తీసుకోవడం విద్య శాఖ మంత్రి నారా లోకేష్ కే సాధ్యమని నాగ జగదీష్ అన్నారు.

## పోలీస్ సిబ్బంది సంక్షేమమే మా ధ్యేయం:నేరుగా జిల్లా ఎస్పీ తో మాట్లాడిన సిబ్బంది

### సమస్యల పరిష్కారానికి తక్షణ ఆదేశాలు జారీ చేసిన ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి, మార్చి 20 (ప్రభాత వార్త)



జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సంక్షే మానికి పెద్దపీట వేస్తూ ప్రవేశపెట్టిన ఫోన్-ఇన్ కార్యక్రమం జిల్లా పోలీసు కార్యాలయంలో విజయవంతంగా నిర్వహించ బడింది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్వయంగా ఫోన్ లైన్ ద్వారా సిబ్బంది సమస్యలను ఆలకించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకత్వానికి క్షేత్రస్థాయి సిబ్బందికి మధ్య ఉన్న దూరాన్ని తగ్గించి, సిబ్బంది తమ వ్యక్తిగత లేదా వృత్తిపరమైన ఇబ్బందులను ఎటువంటి సంకోచం లేకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చేలా ఈ వేదికను రూపొందించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఫోన్ నంబర్ 93469 12011 ద్వారా ఎస్పీ తో మాట్లాడారు. సిబ్బంది ప్రధానంగా సర్వీస్ పరమైన పోస్టింగ్స్, బదిలీలు, సెలవులు, కుటుంబ ఆరోగ్య సమస్యలను వివరించారు. ప్రతి సమస్యను లోతుగా విశ్లేషించిన ఎస్పీ, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. పోలీస్ సిబ్బంది సమస్యను పరిష్కరించడమే మా ప్రాధాన్యత. దూర ప్రాంతాల నుండి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, సిబ్బంది తమ సమస్యలను నేరుగా నాతో పంచుకోవచ్చు. ప్రతి సమస్యను గోప్యంగా ఉంచుతూ త్వరితగతిన పరిష్కారం చూపుతామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. ఈ కార్యక్రమం ప్రతి శుక్రవారం ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు నిరంతరాయంగా కొనసాగుతుంది. ప్రతి ఫిర్యాదును డిజిటల్ రిజిస్టర్‌లో నమోదు చేసి, పరిష్కారం అయ్యే వరకు పర్యవేక్షించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు, ఎస్పై ప్రసాద్, ఆఫీస్ సూపరింటెండెంట్ గిరి ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ఉగాది ఉత్సవాలు

అనకాపల్లి రూరల్ మార్చి 20 (ప్రభాత వార్త)

స్థానిక బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి సత్యాస్ లక్ష్మి గ్రాండ్ ఫంక్షన్ హాల్ లో బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ సిల్వర్ జూబ్లీ మహోత్సవాలు, ఉగాది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. 2001 లో క్లబ్ స్థాపించమని, అప్పటినుండి ఇప్పటివరకు అధ్యక్షులను, కార్యదర్శిలను, ప్రస్తుత పాలకవర్గ సభ్యులను అందరిని ఘనంగా సత్కరించారు. ఈవెంట్ ఆర్గనైజర్ కర్రీ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు చేసే భరతనాట్యం, తెలంగాణ బోనాలు నృత్యం, పలు సంస్కృత కార్యక్రమాలు క్లబ్ సభ్యులకు ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ. క్లబ్ స్థాపించి ఈ ఏడాదికి 25 సంవత్సరాలు పూర్తయిందని, సిల్వర్ జూబ్లీ ఫంక్షన్ ఘనంగా జరిగిందని తెలియజేశారు.తెలుగు తొలి పండగ ఉగాది ఉత్సవాలు బెస్ట్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో జరగడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. తెలుగు సంస్కృతి మనకే కాకుండా మన పిల్లలు కూడా అలవాటు చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు నర్సింగరావు, చైర్మన్ పిఎస్అప్పారావ్ ,అధ్యక్షులు బి ఎస్ ఎం కె జోగి నాయుడు, కార్యదర్శి పెంటకోట ప్రభాకర్, కోశాధికారి భర్సికాన శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీ. బుద్ధశివ, ఉపాధ్యక్షులు భీమర శెట్టి శ్రీనివాసరావు, క్లబ్ డైరెక్టర్లు బుద్ధ శ్రీనివాసరావు, బుద్ధ ప్పల నాయుడు, బుద్ధ లక్ష్మణరావు, బొడ్డేడ రాజేష్, పీవీ సత్యనారాయణ, కాండ్రేగుల జగ్గారావు, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## నూకాంబికను దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గణబాబు దంపతులు



అనకాపల్లి మార్చి 20, ప్రభాత వార్త

ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం అనకాపల్లి నూకాంబిక అమ్మవారిని కొత్త అమావాస్య జాతరలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు పి జి వి ఆర్ నాయుడు (గణ బాబు) కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ పీలా నాగ శ్రీను, ఈవో శ్రీధర్ ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్. దాడి జైవీర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### పట్టణ ప్రజలకు శుభవార్త

## ఇంటి పన్నులు చెల్లింపులో 50 శాతం రాయితీ

అనకాపల్లి రూరల్ మార్చి 20 (ప్రభాత వార్త)



అనకాపల్లి జీవీఎంసీ జోన్ పరిధిలో ఉన్న ప్రజలకు ఇంటి పన్నులు చెల్లింపులో 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో ఉన్న ప్రజలకు ఆర్థికంగా వెలుసుబాటు కల్పించాలని లక్ష్యంతో ఇంటి పన్నులు వ్యాపార సంస్థ ట్యాక్స్ తదితర వాటిపై 50 శాతం రాయితీ కల్పించిందని తెలిపారు. ఈనెల 19న ప్రభుత్వం నుండి అధికారికంగా జీవో విడుదల చేసిందని జోనల్ కమిషనర్ చక్రవర్తి తెలిపారు. అయితే ఈ అవకాశం ఈనెల 30 తేదీ వరకు మాత్రమే ఉంటుందని ఈ పది రోజులు లోగా 50 శాతం రాయితీ తో పన్నులు చెల్లించి ఆర్థికలబ్ది పొందాలని ఆయన పట్టణ ప్రజలకు సూచించారు. గడువు దాటిన తర్వాత యధావిధిగా ఎటువంటి రాయితీ లేకుండా మొత్తం అమౌంట్ తో పాటు పెనాల్టీ కూడా చెల్లించవలసి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని ఈనెల 30లోగా పన్నులు చెల్లించాలని, ఇటువంటి అవకాశం గతంలో ఎప్పుడూ కూడా కల్పించలేదని అన్నారు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ ప్రజలు శుక్రవారం నుండే పనులు చెల్లించేందుకు ఉత్సాహం చూపుతున్నారని, ఉదాహరణకు ఐదు లక్షలు పన్ను కట్టవలసి ఉండగా 50 శాతం రాయితీతో 2 లక్షల 50 వేలు చెక్కు రూపేనా చెల్లించారని తెలిపారు. మొత్తం అనకాపల్లి జోన్ పరిధిలో 16 కోట్ల 80 లక్షలు రావాల్సి ఉండగా ఇప్పటివరకు 10 కోట్ల 10 లక్షలు వసూలు అయిందని, ఇంకా 6 కోట్ల 70 లక్షలు రావాల్సి ఉందన్నారు.

## ఘనంగా శ్రీరాములు ఉత్సవరాట



(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలోని ఉపమాక మెరక వీధి రామాలయంలో ఈనెల 27న శ్రీరామనవమి సందర్భంగా శ్రీ శ్రీనివాసా భజన భక్త సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం సప్తాహం (భజన) కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా రామాలయం వద్ద మహోత్సవానికి సంబంధించిన రాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మహోత్సవం 7 రోజుల పాటు భజన కార్యక్రమం చేపట్టనున్నారు. సప్తాహం ప్రారంభంలో భాగంగా ముందుగా గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. 20 వ తేదీ శుక్రవారం ఉదయం 6 గంటల నుండి ప్రారంభమైన భజన కార్యక్రమం 27 వ తేదీ శుక్రవారం ఉదయం 6 గంటల వరకు కొనసాగుతుంది. పలు గ్రామాల నుండి భజన సమాజ బృందాలు పాల్గొన్నారు.

## నటుడు శోభన్ బాబుకు ఘన నివాళి

అనకాపల్లి రూరల్ మార్చి 20 :(ప్రభాతవార్త)



స్థానిక విజయరామరాజుపేటలో ఆంధ్రుల అందాల నటుడు శోభన్ బాబు 18 వర్ధంతి వేడుకలు శోభన్ బాబు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ముగడ అప్పారావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ముందుగా శోభన్ బాబు చిత్రపటానికి విజయరామరాజుపేట శోభన్ బాబు అభిమానులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల శివరామ సత్యనారాయణ, పలకా రాము, పలకా సత్యనారాయణ, పిట్ల బుద్దేశ్వరరావు, ఆళ్ల రామకృష్ణ, ఒమ్మి రాము, బొబ్బిలి అప్పారావు, బొబ్బిలి గోవింద్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బోట్ల చిన్ని యాదవ్, పాల్గొన్నారు.

## గూడుపమ్మ ఆలయానికి భక్తుల తాకిడి.!



(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలోని రేబాక గ్రామంలో గూడుపమ్మ తల్లి ఆలయానికి భక్తుల తాకిడి పెరుగుతుంది. శుక్రవారం ఉదయం అనేక ప్రాంతాల నుంచి భక్తులు రేబాక వచ్చి అమ్మవారిని' దర్శించుకున్నారు. ఆలయంలో అమ్మవారికి శ్రీసూక్తం, దుర్గాసూక్తం, కనకధారస్తోత్రం, కాలభైరావష్టకం, లలితా చాలీసా, దేవీ ఖడ్గమాలా స్తోత్రం, అష్టోత్తర శతనామార్చన పూజలు చేశారు. భక్తులందరికీ పసు పుకొమ్ములు, మహిళలకు గాజులను పంపిణీ చేశారు. కొంతమంది ఆలయ పరిసరాల్లో వంటలు చేసి భోజనాలు చేసి ఉల్లాసంగా గడిపారు.

## ఆలయ అర్చకుని సేవలు మరువలేనివి

కసింకోట, మార్చి 20, ప్రభాతవార్త;



కశింకోట మండలం చింతలపాలెం గ్రామం లో వెలసిన శ్రీ సాయిబాబా ఆలయంలో గత పదిహేను సంత్సరాలుగా పంతులుగా వుంటూ సాయిబాబా గుడికి ఎంతో సేవ చేసి మా గ్రామంతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు అభిమానశీ సంపాదించుకున్న జుత్తాడ కాశీ పంతులు దంపతులను చింతలపాలెం సర్పంచ్ కొట్టె రాము నరసింగబిల్లి సర్పంచ్ కోన నాగేశ్వరావు. మండల ఐ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జెర్రిపోతుల నూకునాయుడు జనసేన పార్టీ నాయకులు కోన శివ కోన చిన్నయ్య కాశీ దంపతులను పూల మాలలు వేసి శాలువా తో సత్కారించి వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేసి అయన గుడికి చేసిన సేవలను కొనియాడి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో సోమిరెడ్డి శివ పోతిని అప్పలస్వామినాయుడు సోమిరెడ్డి నాగేశ్వరావు గోంతిని రమణ ప్రకాష్ కోన రవీంద్ర పడాల ధర్మరాజు దుర్గాప్రసాద్ ఈగాల భాస్కర్ అప్పలస్వామినాయుడు పాల్గొని అభినందనలు తెలియజేసారు.

## సత్యవరం గ్రామంలో కొబ్బరికాయ కొట్టి సిమెంట్ రోడ్డు ప్రారంభించిన టిడిపి నాయకులు



పాయకరావుపేట మార్చి 20 ప్రభాతవార్త:

పాయకరావుపేట మండలం సత్యవరం గ్రామంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సిమెంట్ రోడ్డు ప్రారంభించడం జరిగింది .ఈ కార్యక్రమంలో కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన ..టీడీపీ నాయకులు రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు , పాయకరావుపేట మండల టిడిపి అధ్యక్షుడు చంచలపు ప్రదీప్ , పట్టణ టిడిపి అధ్యక్షుడు యాళ్ల వరహాలు బాబు , కంకిపాటి వెంకటేశ్వరావు , బొంది కాశి విశ్వనాథ్ , వేములపూడి అప్పారావు,దువ్వ శ్రీనివాస్ యాదవ్, సత్యవరం గ్రామ శాఖ అధ్యక్షుడు వద్దాది వాసు, సిద్ది రెడ్డి నాగేశ్వరావు, కంకిపాటి సంజూ, పెదిరెడ్డి శ్రీ రామ్, గోళ్ళ సన్యాసిరావు, బొలిశెట్టి నాగేశ్వరావు , కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పెద్ద చెరువు ఆక్రమణలపై ఆయకట్టు రైతులు ఆందోళన

నర్సీపట్నం,మార్చి 20,ప్రభాతవార్త



నర్సీపట్నం పెద్ద చెరువు ఆక్రమణలపై ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమణల వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోందని, దీనివల్ల తమ పంటలు దెబ్బతింటున్నాయని వారు తెలిపారు.ఈ సమస్యను పరిష్కరించేందుకు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ను కలిసి తమ సమస్యలను వివరించారు. చెరువును ఆక్రమణదారుల నుండి రక్షించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు మాట్లాడుతూ, చెరువు కాపాడకపోతే భవిష్యత్తులో వ్యవసాయం తీవ్రంగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై వెంటనే స్పందించి చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




## చోరీ సొత్తు స్వాధీనం..

### నిందితుడు పలు కేసుల్లో బాల నేరస్తుడు.. సీఐ రేవతమ్మ



గొలుగొండ మార్చి 20 ప్రభాతవార్త

గుండుపాల కొత్తూరులో ఈ నెల 13న జరిగిన చోరీ లో నగలు స్వాధీనం చేసుకున్నట్లు నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ తెలిపారు. గొలుగొండలో నిర్వహించిన పత్రిక సమావేశంలో చోరీ వివరాలు వెల్లడించారు. మండలంలో గుండుపాల పంచాయతీ శివారు జి కొత్తూరు గ్రామంలో రంగుల దేవుడు ఇంట్లో నగలు, కొంత నగదు చోరీకి గురయ్యాయని అన్నారు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు నర్సీపట్నం డిఎస్పి శ్రీనివాస రావు ఆదేశాలతో మూడు ప్రత్యేక పొందాల ఏర్పాటు చేసి గాలించగా బాల నేరస్తుడు పట్టుబడ్డారని అన్నారు. పూర్తి కోణంలో విచారణ చేయగా చోరీకి ఎత్తిరించిన బాలనారస్తులు గుండుపాల కొత్తూరు గ్రామంలో చుట్టం చూపుగా దేవుడు ఇంటికి వచ్చారని, మరో వ్యక్తి ద్వారా దేవుడు పరిచయం అయ్యారని అన్నారు. 13 వ తారీకు ఉదయం పని నిమిత్తం నర్సీపట్నం కి వెళ్ళగా సాయంత్రం వచ్చి చూసే సరికి ఇల్లంతా చంద్రమండలిగా ఉండడంతా పోలీసులకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. దర్యాప్తులో పట్టుబడిన బాలుడు నుండి 32. 41 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకొని బాల నేరస్తుల్ని అదుపులోకి తీసుకున్నా మన్నారు. బాలనారస్తులు కావడంతో సంబంధిత సంరక్షణ కేంద్రానికి తరలించామని సిఐ తెలిపారు. పట్టుబడిన బాల నేరస్థుడు మరికొన్ని కేసుల్లో నమోదయి ఉన్నాడని పరవాల్లో అటెంప్ట్ మర్డర్, చోడవరంలో చోరీ కేసు తోపాటు మరికొన్ని కేసుల్లో నిందితుడిగా ఉన్నారన్నారు. గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండి కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరించినట్లయితే 100, 112కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సీఐ అన్నారు. తక్కువ రోజుల్లోనే చోరీ చోత్తు స్వాధీనం చేసుకోవడంపై సిబ్బందిని అభినందిం చారు. పట్టుబడిన సత్యం కోర్టు ద్వారా అందజేస్తామని తెలిపారు. సిఐతో పాటు ఎస్ఐ పి రామారావు సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడా పోటీల్లో అనకాపల్లి ఎక్సైంజ్ పోలీసులు ప్రతిభ

అనకాపల్లి మార్చి 20 :(ప్రభాతవార్త)



ప్రోహిబీషన్, ఎక్సైంజ్ ఉద్యోగులకు ఈనెల 16, 17, 18 తేదీల్లో విశాఖపట్నం కొమ్మాది లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్టేడియంలో నిర్వహించిన అంతర్ జిల్లాల క్రీడా పోటీల్లో అనకాపల్లి జిల్లాకు చెందిన పలువురు ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని తమ తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి 126 పతకాలు సాధించారు. విజేతలుగా నిలిచిన సిబ్బందిని శుక్రవారం జిల్లా డిస్ట్రిక్ట్ ప్రోహిబీషన్, ఎక్సైంజ్ అధికారి వి సుధీర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది రోజువారి తమ విధులు నిర్వహించడానికి శరీర దృఢత్వం కాపాడుకోవడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రతి ఉద్యోగి తమ దైనందిన జీవితంలో క్రీడలు ఒక భాగం కావాలని సూచించారు. త్వరలో రాష్ట్రస్థాయిలో జరగబోయే క్రీడ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమలో దాగివున్న నైపుణ్యాన్ని ప్రదర్శించి అనకాపల్లి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలనిజిల్లా డిస్ట్రిక్ట్ ప్రోహిబీషన్, ఎక్సైంజ్ అధికారి వి సుధీర్ ఆకాంక్షించారు.

## ప్రభుత్వం నిధులు దుర్వినియోగం... అధికార పార్టీపై నిందల..

### టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు తారక వేణుగోపాల్



గొలుగొండ మార్చి 20 ప్రభాతవార్త

పప్పు శెట్టిపాలెం పంచాయతీ జమ్మాదేవిపేట గిరిజనులను మోసం చేసిన సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి భర్త రామకృష్ణ నాయుడు పై అధికారులు తీసుకున్న చర్యలకు అధికార పార్టీ కక్ష సాధింపు అనడం విజ్ఞత లేని ఆరోపణగా టిడిపి నాయకులు కొట్టు పారేశారు. గొలుగొండ పోలీస్ స్టేషన్ లో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ చేసిన ఆరోపణలు ఖండిస్తూ తప్పులు మీరు చేసి అధికార పార్టీపై నిందలు వేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. నాడు అధికారం ఉంది కదా అని గిరిజనులు మోసం చేసి కమ్యూనిటీ హాల్ పునాదులతో సహా బిల్లులు మార్చుకొని నిధులు కాఫీసి నేడు తప్పు చేయలేదు అంటే ప్రజలు నమ్ముతారా అని ఎద్దేవా చేశారు. గ్రామస్తులు అంత శ్రమదానం సొంత నిధులతో నిర్మించుకున్న అధికార దాహంతో బిల్లులు మార్చుకోవడం మీకే చెల్లిందన్నారు. తప్పులు చేశారు కాబట్టి చట్టపరమైన చర్యలు తప్పవని ఇది ఎంతటి వారికైనా చట్టం సమానమే అన్నారు. తప్పులను గుర్తించి చర్యలకు పాల్పడుతున్న అధికారులను బెదిరించడం వైసిపికి పరిపాటుగా మారిందని విమర్శించారు. నిధులు కాజేశానని లిఖితపూర్వకంగా రాసి ఇచ్చిన కాంట్రాక్టర్ గా వ్యవహరించిన రామకృష్ణ, ఆ నిధులను చెక్కు రూపంలో అందజేసిన సర్పంచ్ విజయలక్ష్మి తప్పు చేయలేదని ప్రశ్నించారు. మీరే పోలీస్ స్టేషన్ లో స్వయంగా ఒప్పుకున్నారని కోర్టు పరిధిలో ఉన్న విషయాన్ని అధికారులను బెదిరించే దాకా తీసుకొస్తున్నారని ఇది మీ విజ్ఞప్తికే వదిలేస్తున్నామన్నారు. నోటీసులు ఇచ్చి విచారణకు పిలవడం అది అధికారిక చర్యలని కోర్టు ఆదేశాలను అధికారులు పాటించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. నిజంగా కక్ష సాధింపు చర్యలు చేపడితే నర్సీపట్నం నియోజకవర్గంలో ఎంతమంది వైసీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టామో నిరూపించాలన్నారు. అధికారులను బెదిరించి బిల్లులు చేయించి మింగేసిన నాయకులను వేసుకుని వచ్చి ఇలా మాట్లాడటం తగదు అన్నారు గ్రామస్తులు ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించి చర్యలు చేపడుతున్నారు తప్ప ఇందులో రాజకీయ ప్రమేయం ఏమీ లేదని స్పష్టం చేశారు. మీలాగా తప్పుడు కేసులు పెట్టి మా నాయకుడైన చింతకాయల అయ్యన్నపాత్రుడుని ఎంత హింసకు గురి చేసారో మేము ఇంకా మర్చిపోలేదన్నారు, తప్పుడు కేసులు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూడడం. మళ్లీ అధికారంలోకి వచ్చి అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పడం అధికారులను బెదిరించడం వంటి చర్యలు మానుకోవాలిఅని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చిటికెల తారక వేణుగోపాల్, అనకాపల్లి పార్లమెంట్ టిడిపి పార్టీ ఉపాధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు,జోగంపేట మాజీ సర్పంచ్ సుర్ల బాబ్జి. ఎల్ పురం ఎంపీటీసీ రుత్తుల రామకృష్ణ. అల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎం వి వి ప్రసాద్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## మాజీ సర్పంచ్ ధూళి రమణ మృతి

(రాంబిల్లి మార్చి 20 ప్రభాతవార్త)

రాంబిల్లి మండలం హరిపురం గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది, మాజీ సర్పంచ్, కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ ధూళి రమణ(55) గురువారం మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి, విశాఖపట్నం ప్రైవేట్ ఆస్పత్రిలో మరణించారని గ్రామస్తులు తెలిపారు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు,మాజీ సర్పంచ్ గా ఉన్న కాలంలో ఆయన గ్రామ అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు, ఈ విషాద వార్త తెలిసిన వెంటనే గ్రామమంతా శోకసంద్రంగా మారింది.

## ప్రతిభ కనుభరిచిన మత్స్యకార కుసుమం

### పవిత్ర ను సత్కరించినా జాతీయ మత్స్య కార సంఘం

ఎస్ రాయవరం మార్చి 20 ప్రభాత వార్త



మండలంలోని బంగారమ్మపాలెం మత్స్యకార కుటుశీ బానికి చెందిన సిహెచ్.పవిత్ర గెట్ పరీక్ష లో ప్రతిభా కనుపరిచింది .గెట్ పరీక్ష ఫలితాలు లో 1940 ర్యాంక్ సాదిశీచింధి.ప్రతిభా కనుభరిచిన పవిత్ర ను శుక్రవారం జాతీయ మత్స్యకార సంఘ రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు పవిత్రను, వారి తల్లీదండ్రులను అభినందించి దుస్సాలువా కప్పీ సత్కారించారు.మీ తల్లీదండ్రులకు ,మత్స్యకార కులానికి గోప్ప ఖ్యాతీ చెప్పి పెట్టావని కొనియా డారు.మరింత మంధికి నీవు ఆదర్శం కావాలని అప్పలరాజు అన్నారు. ఈ కార్యక్రమం లో జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి కోవిరి వెంకటేష్, కార్యాదర్శి ఎమ్.జగ్గరావు,జిల్లాఅధ్యక్షులు ఎరిపిల్లి అప్పలరాజు, గ్రామ సర్పంచ్ మైలిపల్లి శీను, కోదండరావు, నారాయణ, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

## కాఫీ రైతులకు జి.సి.సి కొనుగోలు చేయటంలో నిర్లక్ష్యం

### చలో జి.సి.సి ఆఫీసు : ఎం.పి.టి.సి బుజ్జిబాబు



గూడెం కొత్త వీధి మార్చి 20, ప్రభాతవార్త

ప్రభుత్వ సంస్థ అయిన జి.సి.సి, కాఫీ రైతులకు ఈ సంవత్సరం కేజీ చెర్రీ కాఫీని, 270 ప్రకటించిన విషయం అందరికి తెలిసిందే. కానీ జి.సి.సి సంస్థ అధికారులు కాఫీ రైతుల దగ్గర కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం చేయడం వలన రైతులు దాలరి వద్ద, తీవ్రమైన నష్టన్నీ పొందవల సిన అవసరం ఉన్నందున, కాఫీ రైతులు ఆందోళనకు గురికావడం జరుగుతుందనీ అన్నారు. అయితే జి.సి.సి సంస్థ రైతులు దగ్గర కొనుగోలు చేయడానికి ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని, రైతులతో ప్రజాసంఘాల నాయకులు ఆందోళన చెందుతున్నారు. దీనికి స్పందించిన జిసిసి అధికారులు టార్గెట్ పూర్తి చేస్తు , ఇంక జిసిసి సంస్థ ద్వారా ఋణాలు పొందిన రైతులు దగ్గర కొనుగోలు చేయడం జరుగుతుంది అని వివరాణ ఇచ్చారు ఇది వాస్తవం కాదు.అదికారులు చెప్పినది వాస్తవం అంటే పై అధికారులు ఇచ్చిన టార్గెట్ ప్రకారంగా మండలంలో ఎ గ్రామంలో, ఎంతమంది రైతులు ఎవరు ఎన్ని కేజీలు వేసారో తెలియజేయలని గాలి కొండ ఎం.పి.టి.సి అంపురంగి బుజ్జి బాబు డిమాండ్ చేశారు. ఎందుకంటె రైతులు జి.సి.సి నీ నమ్ముకొని చాల రోజులుగా ఎదురు చూస్తు వ్యాపారులు దగ్గర చాలా నష్టపోయరని అన్నారు. దీనికి కారణం జి.సి.సి ఇచ్చిన మాటప్రకారం కొనుగోలు చేయకపోవడమే, కావున 23న సోమవారం, జికె వీధి జి.సి.సి ముందు కాఫీ రైతులతో ఆందోళన చేయనున్నట్టు బుజ్జి బాబు విలేకరులకు తెలిపారు కావున మండలంలో ఉన్న గిరిజన కాఫీ రైతులు ఉదయం 10 గంటలకు జి కె వీధిలో హాజరు కావాలని కోరారు.

## జిల్లాను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయుటకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి

### మౌలిక వసతులు కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి : జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

పాడేరు,మార్చి20,ప్రభాతవార్త:



అల్లూరి జిల్లాను పర్యాటకంగా మూడు క్లస్టర్లుగా అభివృద్ధి పరచుటకు సమగ్రమైనటువంటి ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుండి అటవీ శాఖ, పర్యాటక శాఖ అధికారులతో అరకు, పాడేరు, లంబసింగి మూడు క్లస్టర్ల పరిధిలో 122 కిలోమీటర్ల మేర క్రాస్ క్లస్టర్ల అభివృద్ధికి చేపట్టవలసిన వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలు, పనుల పురోగతి, భవిష్యత్ అవసరాల గురించి చేపట్టవలసిన కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లా డుతూ ట్రెక్కింగ్‌కు అనుకూలంగా క్రాస్ క్లస్టర్‌లలో మౌలిక సదుపాయాలు (122 కి.మీ.) పరిధిలో మొదటి గా కోర్ ట్రైల్ సిస్టమ్స్‌లో భాగంగా కొండచరియల బాట అభివృద్ధి, స్థిరీకరణ, నీటిపారుదల, కోత నియంత్రణ, మార్గదర్శనం, సంకేతాలు, కాలిబాట వర్గీకరణ సులభం-మధ్యస్థం-కఠినం, అడవి, జలపాతం అను సంధాన మార్గాలు అభివృద్ధి చేయాలన్నారు. అందులో పర్యావరణ పారిశుధ్యంతో కూడిన నిర్దేశిత క్యాంపింగ్ నకు స్థలాలు గుర్తించాలన్నారు. రెండవదిగా సందర్శకుల నిర్వహణ జిఐఎస్- ఆధారిత ట్రైల్ మ్యాపింగ్, డిజిటల్ పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ట్రెక్కింగ్ చేపట్టేవారు, తప్పనిసరిగా నమోదు ఆన్‌లైన్ గేట్‌వే చేసుకోవా లన్నారు. మోసే సామర్థ్య అమలు రోజువారీ పరిమితులు, సమయ విభాగాలపై పర్యవేక్షణ ఉండాలన్నారు. మూడవదిగా పర్యాటకుల భద్రతకు అత్యంత సమర్థమైన రక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, అత్యవసర ఆశ్రయాలు, రెస్క్యూ పరికరాలు, స్ట్రెచర్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలు నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు. కీలకమైన మార్గాలలో గైడ్ సహాయంతో ట్రెక్కింగ్ ప్రతిపాదిత భాగాలు- అరకు క్లస్టర్ (98 కి.మీ.) పరిధిలో కాఫీ అనుభవ కేంద్రం అనంతగిరి ఫ్లాగ్‌షిప్ ఆస్ట్రో అబ్జర్వేటరీ- గాలికొండ, గేట్‌వే మౌలిక సదుపాయాలు ప్రవేశ కేంద్రాలు- అరకు, అనంతగిరి 2-3 ప్రదేశాలు, పార్కింగ్, రిజిస్ట్రేషన్, ఓరియెంటేషన్ కియోస్క్,టాయిలెట్లు, త్రాగునీరు, ప్రథమ చికిత్స, పర్యవేక్షణ అందుబాటులో ఉంచాలన్నారు. కాఫీ రుచి చూసే కియోస్క్‌లు - ట్రైల్ మార్గాల వెంబడి ఏర్పాటు చేయాలన్నారు. కమ్యూనిటీ టూరిజంలో సౌకర్యాలు, ఓఏటీ, కమ్యూనిటీ కిచెన్, హస్తకళల వర్క్‌షాప్/సెంట్రల్ 5-6 ఎంపిక చేసిన గ్రామాలలో ఉండాలన్నారు. వాతావరణ పరిస్థితుల అవగాహనపై వెదర్ మానిటరింగ్ యూనిట్‌లను- అర్మ కొండ, గాలికొండ, బొర్రా గుహలు వద్ద ఏర్పాటు చేయాలన్నారు. సెంట్రల్ మానిటరింగ్, కంట్రోల్ రూమ్ - అరకు వ్యాలీ ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలన్నారు. కారవాన్ పార్క్-2 స్థానాలు అరకు క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమాల నిర్మాణానికి సూచనాత్మక వ్యయ గణనతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కీలక స్థానాలు, కవరేజ్‌లు, కాఫీ రుచి చూసే కియోస్క్‌లు, కాలిబాట మార్గాలు, గ్రామ అనుసంధానాలు, ప్రధాన ట్రైల్ ప్రదేశాల వెంబడి, స్థానికంగా పండించిన కాఫీని అందించే సుమారు 10 కియోస్క్‌లను కమ్యూనిటీ గ్రూపులు నిర్వహిస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫ్లాగ్‌షిప్ ఆస్ట్రో అబ్జర్వేటరీ సెంటర్ గాలికొండ రిడ్జ్ (అరకు క్లస్టర్)వేధశాల గోపురం, టెలిస్కోపులు, వీక్షణ వేదిక, వివరణ స్థలం, పరికరాలు. నిల్వ,గ్రామ నక్షత్ర వీక్షణ యూనిట్లు అభివృద్ధి చేయాలన్నారు. దల్లాపల్లి,పాడేరు క్లస్టర్, చెరువులవేణం (లమ్మ సింగి క్లస్టర్) పరిధిలో టెలిస్కోపులు, వీక్షణ వేదికలు, నిల్వ సౌకర్యాలతో కూడిన రెండు గ్రామ యూనిట్లు. కారవాన్ పార్క్ సౌకర్యాలు అరకులోయ 2, వంజంగి మూల గ్రామం 1, లంబసింగి 1 ఏర్పాటు చేయాలన్నా రు. నాలుగు కారవాన్ పార్కులు, కారవాన్ పార్కింగ్ బేలు, యుటిలిటీలు, పారిశుధ్య సౌకర్యాలతో సహా అందుబాటులో ఉంచాలన్నారు. కమ్యూనిటీ బేస్డ్ ఏకో టూరిజంలో భాగంగా, కమ్యూనిటీ టూరిజం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ట్రైల్ నెట్‌వర్క్ వెంట 8-10 ఎంపిక చేసిన గ్రామాలు ఓపెన్ ఎయిర్ థియేటర్, కమ్యూనిటీ కిచెన్‌లు, హస్తకళల బజార్లు, కళలు, చేతిపనుల ప్రదర్శన వర్క్‌షాప్‌లు, సందర్శకులతో సంభాషించే ప్రదేశాలతో సహా సామాజిక సౌకర్యాలు రూపకల్పన చేపట్టాలన్నారు. ప్రవేశ ద్వారాలు, గ్రామాలు, కాలిబాట మార్గాలు పర్యావరణ పరిరక్షణ చర్యలు, వ్యర్థాల నిర్వహణ వ్యర్థాల విభజన యూనిట్లు, కంపోస్టింగ్ వ్యవస్థలు, పర్యావరణ నిర్వహణ మౌలిక సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండడం వల్ల, జిల్లా పర్యటకంగా మరింత అభివృద్ధి చెందుతుందనీ, స్థానిక నిరుద్యోగ యువకులకు ఉపాధి లభిస్తుందని, ఈ ప్రాంత ప్రజల ఆర్థిక, సామాజిక, జీవన ప్రమాణాలు మెరుగుపరచుటకు అది ఎంతో దోహదపడుతుందని, దీనికి జిల్లా అధికారులందరూ సమిష్టి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ రెవెన్యూ అధికారి పి.అంబేద్కర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.శేషగిరిరావు, అరకు డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, పాడేరు సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఎస్.సాజిత్, జిల్లా పర్యాటక శాఖ అధికారి దాసు, పంచాయతీరాజ్ ఇంజనీర్ దీప, పాల్గొన్నారు.

## గాలికుంటు వ్యాధి నివారణకు అప్రమత్తత అవసరం

### పశు వైద్య శిబిరంలో ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ డాక్టర్ సియ్యారి దొన్ను దొర

అరకు రూరల్, మార్చి 20, ప్రభాతవార్త



పశు సంరక్షణ నిమిత్తం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరంతరం ప్రత్యేక దృష్టి సారి స్తుందని ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, టిడిపి అరకు అసెంబ్లీ నియోజక వర్గ ఇన్చార్జి సియ్యారి దొన్ను దొర అన్నారు. అరకులోయ మండలం పెదలబుడు పంచాయతీలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరాన్ని చైర్మన్ దొన్నుదొర ముఖ్య అతిథిగా హాజరై, ఏ ఎం సి చైర్మన్ బిబి లక్ష్మితో ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువులకు గాలి కుంటు టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు సంరక్షణ వ్యవసాయంలో ఒక భాగమని చెప్పారు. ఈమధ్య పశువులకు గాలి కుంటు వ్యాధి ఎక్కువగా సోకుతుందని దాని నివారణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంద న్నారు. దానిలో భాగంగానే ఇప్పుడు ప్రతిచోట పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తుందని చెప్పారు. ఈ శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. పశువులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. పశువుల కోసం మొబైల్ వెహికల్స్ కూడా ఉన్నాయని వాటి సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టి డి పి అరకులోయ మండల అధ్యక్షుడు లోకోయి మహాదేవ్, సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, మండల మాజీ అధ్యక్షురాలు వంతల ద్రౌపతి, ఎంపీటీసీ ఎల్ బి భీమరాజు, మాజీ ఎంపీటీసీ కిల్లో కుమార్, పెదలబుడు పంచాయతీ అధ్యక్షుడు బోయి దామోదర్, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



అరకులోయ, మార్చి 20, ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా వేదిక (గ్రీవెన్స్) నిర్వహిస్తున్నామని ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, టిడిపి అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ సియ్యారి దొన్ను దొర అన్నారు. అరకులోయలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజావేదిక (గ్రీవెన్స్) ను శుక్రవారం చైర్మన్ నిర్వహించారు. వివిధ మండలాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వినతులు అందజేశారు. అందులో సామాజికంగా, వ్యక్తిగతమైన సమస్యల పరిష్కారం కోరుతూ చాలామంది గ్రీవెన్స్‌కు హాజరవడం జరిగింది. కొన్ని తాగునీటి సమస్యలకు సంబంధించి మరికొన్ని కొత్త పెన్షన్ల మంజూరు చేయాలని వినతులు వచ్చాయి. సిసి రోడ్ల నిర్మాణానికి సహకరించాలని పలువురు విన్నవించారు. గ్రీవెన్స్ లో ప్రజల నుంచి అర్జీలు తీసుకున్ననంతరం చైర్మన్ దొన్ను దొర మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం నిబద్ధతతో ఉందన్నారు. అందుకే ప్రజల కోరకపోయినా నియోజకవర్గం ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహిస్తుందన్నారు. గ్రీవెన్స్‌కు వచ్చే ప్రతి అర్జీకి అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంటుందన్నారు. గ్రీవెన్స్‌లో సమస్యల పరిష్కారం అవుతున్నాయి కాబట్టే ప్రజల నుంచి స్పందన వస్తుందన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతున్నా మన్నారు.. ఈ కార్యక్రమం లో ఏఎంసి చైర్మన్ బిబి లక్ష్మి, పార్టీ మండలం అధ్యక్షుడు లోకోయి మహాదేవ్, డుంబ్రిగూడ మండల అధ్యక్షుడు కిల్లో ఆనందరావు, సర్పంచ్ పెట్టెలీ దాసుబాబు, ప్రధాన కార్యదర్శి పాంగి రాజు, అరకు నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షుడు బురిడీ కొమ్ములు నాయుడు, హుకుంపేట ప్రధాన కార్యదర్శి బొడ్డ శ్యామ్, పార్లమెంట్ అధ్యక్షురాలు టి ఎన్ ఎస్ ఎఫ్ పట్టిబోయిన శంకర్, అరకు నియోజకవర్గం రైతు అధ్యక్షుడు గొల్లూరి సుబ్బారావు, సర్పంచ్ వంతల శ్రీనివాసరావు, టిడిపి నాయకుడు వీరభద్ర రావు, పి ఏ సి ఎస్ చైర్మన్ పాంగి సుబ్బారావు, నాయకులు పూజారి మాణిక్యం, పాంగి భగత్, బ్యాంక్ డైరెక్టర్ అర్జున్, బ్యాంక్ డైరెక్టర్ స్వాబి దొన్ను, మంతల వెంకటరావు మండల కార్యవర్గ కార్యదర్శి కిలో నాగరాజు, ఏ ఎం సి డైరెక్టర్ సొనాయి గంగ, పెదలబుడు పంచాయతీ అధ్యక్షుడు బోయి దామోదర్, సర్పంచ్లు, ఎంపీటీసీలు, టిడిపి క్లస్టర్ ఇన్చార్జిలు భూతి ఇన్చార్జిలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమ్మవారి భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు

పాడేరు,మార్చి20,ప్రభాతవార్త:

పాడేరు గిరిజన ఆరాధ్య దైవం కోరికలు తీర్చే కొంగుబంగారంగా పేరుగాంచిన శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ వారి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్,ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు శుక్రవారం అమ్మవారి సన్నిధిలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆదేశాలతో అమ్మవారిని సందర్శించుకునే భక్తులకు గత రెండున్నర సంవత్సరాల కాలం నుంచి ఆలయ కమిటీ సభ్యుల సంయుక్తంగా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటిబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం పాడేరు మేజర్ పంచాయితీ మాజీ సర్పంచ్ కిల్లు వెంకటరత్నం,కిల్లు జగన్ మోహిని చేతుల మీదగా అన్నప్రసాద కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు నాయుడు,ఆలయ కమిటీ సభ్యులు చల్ల రామకృష్ణ,కిల్లు చంద్రమోహన్ కుమార్, కొణతాల సతీష్, గూడెపు సూర్యాప్రకాష్, లకె రత్నాబాయి ,పలాసి రమణమ్మ, కిల్లు వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సోమవారం మండల స్థాయి అధికారి గ్రీవెన్స్‌కు హాజరు కావాల్సిందే

### నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్



పాడేరు,మార్చి20,ప్రభాతవార్త:

సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 43, రెవెన్యూ క్లినిక్‌కు 9 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్నా జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, ఇంచార్జి డిఆర్ఓ అంబేద్కర్, ఇంచార్జి ఆర్డీఓ లోకేశ్వరావు లతో కలసి సంయుక్తంగా వివిధ మండలాల, గ్రామాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. అర్జీ దారుల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ సంబంధిత భూ సమస్యలను తక్షణమే పరిష్కరించుటకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నందు ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ ని నిర్వహించడం జరుగుతుందని మండల రెవెన్యూ అధికారులు, డిప్యూటీ తాసిల్దారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు,సర్వేయర్లు,విలేజి రెవెన్యూ ఆఫీసర్లు సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉంటారని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ఫిర్యాదులను స్వీకరించడం, పరిష్కరించడం జరుగుతుందని కొన్ని రకాల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడం, పరిష్కరం కానీ ఫిర్యాదులను ఎంత గడువు గడువులోగా పరిష్కరిస్తారో తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల స్థాయిలో ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక నిర్వహించాలని ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని అలా లేని ఎడల వారిపై తగు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మండల స్థాయిలో వచ్చే అర్జీలను మండల్ స్థాయి లోనే పరిశీలించినట్లయితే, జిల్లాస్థాయిలో ప్రజా ఫిర్యాదులు తగ్గుతాయని తద్వారా వాటిని వెంటనే పరిష్కరించగలరని తెలిపారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధుల నుండి వచ్చే గ్రీవెన్స్ ను కూడా నిర్ణీత గడువులోపు అర్జీ దారంతో మాట్లాడే సమస్యను పరిష్కారించి, గ్రీవెన్స్ హోటల్ లో అప్లోడ్ చేసి ఫిర్యాదును క్లోజ్ చేయాలన్నారు. అప్పుడు మాత్రమే పోర్టర్లో పెండింగ్ లేకుండా ఉంటుందని లేకుంటే పదేపదే అప్లికేషన్ రిపీట్ అవుతుందని తెలియజేశారు. గ్రీవెన్స్‌లో అర్జితాలు ఇచ్చే అర్జీలు పూర్తిగా పరిశీలించి సంబంధిత శాఖకు పంపే విధంగా చూడాలన్నారు. అర్జిదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని,అర్జీలు నేటికీ పరిష్కారం కాకపోయినా, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ ను సంప్రదించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలపై ప్రభుత్వం ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తుందని ఐవి ఆర్ ఎస్ ద్వారా ప్రజల నుండి అభిప్రాయాలను తీసుకుంటుందని, ప్రజల యొక్క ఫిర్యాదులు పరిష్కరించి వారి యొక్క సంతృప్తి స్థాయిలు పెంచాలని, ఈ ప్రక్రియలో జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించి ఏ స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు కార్యాలయాల నుంచి ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయో ఆ స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయాల పరిధిలో ఉన్నటువంటి ఫిర్యాదుదారులు లతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సమస్య ఎందుకు పరిష్కారం కాదో బాధ్యతగా ఫిర్యాదు దారుణకు వివరించాలన్నారు. ప్రత్యేకంగా భూ సంబంధిత సమస్యలపై వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించేటప్పుడు కచ్చితంగా ఫిర్యాదు దారుని భూ రికార్డులను తనిఖీ చేయాలని, ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారంతో క్రోడీకరించి సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ పిబికె పరిమళ, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి పి. బాబు, భూగర్భ జల వనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి. శ్రీనివాస రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బి ఎస్ నంద్, డిఆర్డిఏ పిడి వి. మురళి, జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. కృష్ణ మూర్తి నాయక్, స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయాల నోడల్ ఆఫీసర్ పి ఎస్ కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్, ఆర్ బ్ల్యూఎస్ ఈఈ నాగేశ్వరరావు, జిల్లా ఖజానా శాఖాధికారి ప్రసాద్ బాబు, జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిణి ఝాన్సీ రామ్ పడాల్, లీడ్ బ్యాంకు మేనేజర్ మాతు నాయుడు, పలువురు తాహాసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.






## అల్లూరి జిల్లా బి.జె.పి గిరిజన మోర్చా కార్యదర్శిగా ఎం.లక్ష్మణ్



గూడెం కొత్తవీధి మార్చి 20 (ప్రభాతవార్త)

అల్లూరి సీతారామరాజు జిల్లా. గూడెం కొత్తవీధి మండలంలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న సీనియర్ నాయకులను సమస్థిత స్థానం కల్పించారు. అలాగే పార్టీలో కష్టపడిన నాయకులను గౌరవిస్తూ భారతీయ జనతా పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షురాలు మఠం శాంత కుమారి ఆదేశాల మేరకు జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షులుగా లకే.అబ్బాయి దొర ను నియమిస్తున్నామని తెలియజేశారు. అలాగే బిజెపి గూడెం కొత్త వీధి మండల అధ్యక్షులు కాకురు శేఖర్ ఆధ్వర్యంలో గిరిజన మోర్చాజిల్లా కార్యదర్శిగా మొట్టడం లక్ష్మణ్, గిరిజన మోర్చా జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ గా మత్స్యరాస రామ్ కిరణ్ కుమార్ లను నియమిస్తూ అల్లూరి జిల్లా భారతీయ జనతా పార్టీ పెద్దల ఆదేశాలు జారీ చేశారు.

## షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయాలి: ఆదివాసీ జెఏసీ

గూడెం కొత్తవీధి మార్చి 20 (ప్రభాతవార్త



షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యో నియమ కాల చట్టం చేయాలని ఏప్రిల్ 3న పాడేరులో జరిగే ఆదివాసీ సత్యగ్రహ యాత్ర భారీ ర్యాలీని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఏసి రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు, అల్లూరి సీతారామరాజు జిల్లా చైర్మన్ రామరావుదొర పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రామరావుదొర మాట్లాడుతూ సత్య గ్రహయాత్ర ఈ రోజుతో 130 వ రోజుకు చేరుకుందని, రాష్ట్రంలో అనేక గ్రామాలను పర్యటిస్తూ, షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకల చట్టం చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివాసి నిరుద్యోగులకు న్యాయం చేయడం కోసం ఆదివాసి ప్రాంత ఉద్యోగాలన్నీ స్థానిక ఆదివాసీలకే కల్పించేలా చట్టం చేస్తామని పలు సందర్భాల్లో ఆదివాసి ప్రాంతాల పర్యటన లో హామీ ఇచ్చి, ఇప్పుడు మరిచిపోయారన్నారు. 2025 ఆగస్టు 9న పాడేరులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చినప్పుడు ఈ చట్టం చేస్తామని ఆదివాసి జేఏసీకి, ఆదివాసులకు హామీ ఇచ్చారన్నారు. షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం చేసేంతవరకు ఆదివాసులందరూ ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ఈ చట్టం చేయడం ఆదివాసులకు చారిత్రక అవసరమే కాదు కూటమి ప్రభుత్వం యొక్క గురుతర బాధ్యత కూడా అని రామారావు దొర అన్నారు. అలాగే ఏజెన్సీ చట్టాలు రాజ్యాంగ పరిధులు పరిగణలోకి తీసుకొని షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం కూర్పు లో స్టేట్ కేడర్ పోస్టులలో 30శాతం, జోనల్ కేడర్ పోస్టులలో 50శాతం, లోకల్ కేడర్ పోస్టులన్నిటిని స్థానిక ఆదివాసీలతో భర్తీ చేసే విధంగా సమగ్రమైన చట్టం చేయాలని పలుదఫాలుగా ప్రభుత్వం తో జరిపిన చర్చలలో ఆదివాసి జేఏసీ స్పష్టం చేసింది, ఇప్పటికైనా షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం చేయకపోతే, గౌరవ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా మరో మారు ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరగనుందని ఆదివాసి జేఏసీ హెచ్చరిస్తుంది. కావున కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చకుంటే, షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం చేయకపోతే ఆదివాసి జేఏసీ ఉద్యమాలు తీవ్రతరం చేసి ప్రభుత్వనికి డిమాండ్ చేస్తామని హెచ్చరించారు.ఆదివాసీ జెఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు మాట్లాడుతూ జిఓ నెంబర్ 3 రద్దు చేయడంతో ఆదివాసీలకు తీవ్ర నష్టం జరిగిందని, గిరిజన సలహా మండలి (టిఏసి)ద్వారా షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ చట్టాలైనా భూబదాలయింపు నిషేధ చట్టం,పెసా చట్టం, అటవీ హక్కుల చట్టం, ఎస్సి,ఎస్టీ అట్రాసిటీ చట్టాలను సక్రమంగా అమలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వానిదేనని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఏసీ నాయకులు లకే.రామచంద్రుడు,జెఏసి మీడియా ప్రతినిధి మరియు గిరిజన విద్యార్థి సంఘం డివిజన్ అధ్యక్షుడు మణుగూరు బాబుజీ, పార్థసారథి,స్వామి మరియు మొట్టడం రామరావు, వనపల జోగిరాజు,లకే ఈశ్వరి, వనపల దేవేంద్రతో పాటు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేరాల, గూడెం కోలనీ, ఆర్వీనగర్, వంచుల, కొత్తపాలెం, జర్రెల, మొండిగెడ్డ,రింతాడ, సంకాడ, పెదవలస,దొకులూరు,లక్కవరపుపేట, దేవరాపల్లి తో పాటు వివిధ గ్రామాలకు ఆదివాసి సత్యాగ్రహ యాత్ర రథం వెళ్లి ఏప్రిల్ 3 వ తారీకున పాడేరులో జరిగే ర్యాలీ విజయవంతం చేయాలని ప్రచారం చేసారు.

## గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులు అరెస్ట్

### 50 కేజీల గంజాయి స్వాధీనం -అల్లూరి జిల్లాలో గంజాయి సాగు పూర్తిగా నిర్మూలం -పాడేరు డీఎస్పీ ఆర్ అభిషేక్

పాడేరు,మార్చి20,ప్రభాతవార్త:



అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రస్తుతం ఎక్కడా గంజాయి సాగు లేదని, అయితే అంతర్రాష్ట్ర స్మగ్లర్లు అల్లూరి జిల్లా సరిహద్దులను కేవలం రవాణా మార్గంగా వాడుకుం టున్నారని పాడేరు డిఎస్పీ అర్.అభిషేక్ పేర్కొన్నారు. పాడేరు జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ అభిషేక్ మాట్లాడారు. గురువరం సాయంత్రం ముంచింగిపుట్టు ఎస్.ఐ మరియు సిబ్బంది లబ్బురు జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, బైక్‌పై పారిపోవడానికి ప్రయత్నించిన నరసింగ్ ఎ-2 అనే వ్యక్తిని చాకచక్యంగా పట్టుకోగా, అతని సమాచారం మేరకు జోలాపుట్టు సమీపంలో భీమా ఎ-1 అనే వ్యక్తిను అదుపులోకి తీసుకోని కోర్టులో హాజరుపర్చి విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించడం జరిగిందని ఆయన తెలిపారు. వీరి విచారణలో ఒడిశాలోని పనసపుట్టు, జనబ,జంత్రి,తాబేరు పరిసర ప్రాంతాలలో నుండి గంజాయిని సేకరించి, అక్కడి నుండి ముంచింగిపుట్టు మండలంలోని బుంగాపుట్టు, లబ్బురు గ్రామాల మీదుగా జోలాపుట్టును కేంద్రంగా చేసుకుని, అక్కడి నుండి ఒడిశాలోని జైపూర్‌కు అక్రమంగా తరలిస్తున్నట్లు నిందితులు తెలిపారన్నారు. జైపూర్ కేంద్రంగా ఈ అక్రమ గంజాయి వ్యాపారం సాగుతుంది.నిందితుల నుండి 50 కేజీల గంజాయి, రెండు మోటార్ సైకిళ్లు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని పాడేరు డీఎస్పీ అభిషేక్ అన్నారు. పొరుగు రాష్ట్ర అధికారుల సమన్వయంతో ఇలాంటి రవాణా నెట్‌వర్క్‌లపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పాడేరు డీఎస్పీ హెచ్చరించారు. అల్లూరి జిల్లాలో గంజాయిని పూర్తిగా నిర్మూలించాలనీ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చేపట్టిన ఆపరేషన్ వజ్రప్రహార్'లిలో భాగంగా, అన్ని చర్యలు చేపట్టినట్టు ఆయన తెలిపారు.

## మహిళల భద్రతపై ఏకలవ్యలో అవగాహన




డుంబ్రిగుడ, మార్చి 20 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని స్థానిక ఏకలవ్య పాఠశాలలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళల భద్రతకై పోలీసు యంత్రాంగం తీసుకున్న చర్యలపై విద్యార్థినిలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై సురేష్ మాట్లాడుతూ గంజాయి రవాణా చేయడం, సేవించడం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన పరచడంతో పాటు వాటి వల్ల జరిగే అనర్థాలపై అవగాహన పరిచారు. వచ్చే వేసవి సెలవులలో విద్యార్థినిలు విద్యార్థులు ఎటువంటి చెడు అలవాట్లకు గురి కావద్దని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## గొలుగొండలో మహిళా దినోత్సవం

గొలుగొండ మార్చి 20, ప్రభాతవార్త



అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకను స్థానిక కస్తూర్బా పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఐసిడిఎస్ సిడిపిఓ శ్రీ గౌరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ వేడుకలను చీడిగుమ్మల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలే సమాజ నిలుస్తారని మహిళలు యొక్క ప్రాముఖ్యత సమాజంలో పెరుగుతూ వస్తుందని అన్నారు. సృష్టికి ప్రతిరూపంగా నిలిచిన అమ్మ మహిళ యొక్క ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరు గుర్తించుకొని గౌరవించాలన్నారు. అన్ని రంగాల్లో నేడు మహిళలు ముందడుగు వేస్తున్నారని అందుకు అనుగుణంగానే ప్రభుత్వాలు కూడా ప్రత్యేక స్థానాలు కల్పిస్తున్నాయన్నారు. సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని అటువంటి మహిళలను ఏ స్థితిలో ఉన్న ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా మహిళలకు ఇస్తున్న సేవలు చాలా గణనీయమని తెలిపారు. సమాజంలో మహిళ యొక్క పాత్ర చాలా గొప్పదని మరియు మహిళలు చదువులో ఉద్యోగాలలో రాజకీయాలలో వారికంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకొని సమాజానికి మంచి ఆదర్శప్రాయంగా నిలవాలని కొనియాడారు. మహిళలకు తమ పిల్లలను చిన్నప్పటి నుంచే మంచి సన్మార్గంలో నడిపించాలని సూచించారు. లింగ వివక్ష చూపకుండా ఆడపిల్లల పట్ల మగ పిల్లల పట్ల భేదాలు చూపకూడదన్నారు. ఆడవాళ్ళకి వారి ఆరోగ్య దృష్ట్యా మరియు వారి పిల్లల ఆరోగ్య దృష్ట్యా శ్రద్ధ ఉండాలని అందరూ పౌష్టికాహారం పై దృష్టి సారించాలన్నారు. అప్పుడే సంపూర్ణ మహిళగా సిద్ధమవుతుందన్నారు. ఈ సందర్భంగా అందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు కూడా తెలియజేశారు. ఈ కార్యక్రమం లో భాగంగా డిపిఓ, గొలుగొండ డివిజన్లోని ఉన్న మహిళలందరికీ మెమెంటోలు శాలువాలతో సన్మానం చేశారు.

## లాలం కోడూరులో టిడిపి నాయకుల సమావేశం

(రాంబిల్లి మార్చి 20 ప్రభాతవార్త)



రాంబిల్లి మండలం లాలం కోడూరు గ్రామంలో రాంబిల్లి మండల పార్టీ అధ్యక్షులు లాలం భరత్ అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పల చలపతిరావు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సాయి కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, కార్యదర్శి మరియు యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పప్పల చలపతిరావు మాట్లాడుతూ ఈనెల 23 వ తేదీన పాయకరావుపేట నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన నిమిత్తం విచ్చేయుచున్న సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరూ ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు, అనంతరం రాంబిల్లి మండలంలో గల 19 మంది కి రూ 741285 లు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సిగిరెడ్డి శివప్రసాదరావు, మండల ప్రధాన కార్యదర్శి కలెడ్డ ఈశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జ్ దోడిపల్లి సత్యనారాయణ, బల్లి ఆదిరెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ ఎరిపల్లి చిట్టిబాబు, లాలం తాతబాబు, సూరాడ అప్పలరాజు, చిన్ని నారాయణరావు, అనకాపల్లి శివప్రసాద్, లాలం అఖిరామ్, బద్ది నారాయణరావు, చెల్లూరి కోదండరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన ప్రాంతాన్ని పరిశీలించిన హోం మంత్రి "అనిత"

(నక్కపల్లి ,ప్రభాతవార్త)



మండలం లోని ఈ నెల 23న అత్యంత ప్రతిష్టాత్మకంగా ఐదు గ్రామాలను కలుపుకొని నిర్మించబోతున్న ఆర్సిల్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు భూమి పూజకు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, సీఎం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ సత్యనారాయణ రాజు, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, డీఐజీ గోపినాథ్ జెట్టి, ఎస్పీ తుహిన్ సిన్హా, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ తదితరులు తో కలిసి సభ వేదిక స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమ ఏర్పాట్లపై అధికారులతో హోం మంత్రి వంగలపూడి అనిత సమీక్ష నిర్వహించారు. ప్రధాన వేదిక,హెలిపాడ్ ప్రాంతాలను పరిశీలించారు. భారీ బహిరంగ సభకు మంత్రులు, ప్రముఖులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్న నేపథ్యంలో భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, అవసరమైన అన్ని సదుపాయాలను సమకూర్చాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతూ, ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికాబద్ధంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని హోం మంత్రి అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. అధికారులతో పాటు నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, గింజల లక్ష్మణరావు, బుజ్జి ,కురందాసు నూకరాజు, తదితరులు ఉన్నారు.

## స్టీల్ ప్లాంట్ భూమి పూజకి భద్రతా ఏర్పాట్లను సమీక్షించిన రేంజ్ ఐజీ, జిల్లా ఎస్పీ

(నక్కపల్లి రూరల్ ,ప్రభాతవార్త)



నక్కపల్లి మండలం, చందనాడ గ్రామం లోని తమ్మయ్యపేట వద్ద ఈ నెల 23వ తేదీన జరగనున్న ప్రతిష్టాత్మక ఆర్సిలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ భూమి పూజ కార్యక్రమా నికి సంబంధించి భద్రతా ఏర్పాట్లను పోలీస్ యంత్రాంగం ముమ్మరం చేసింది. ఈ మేరకు శుక్రవారం విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపినాథ్ జట్టి, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా లు కలసి శుక్రవారం సాయంత్రం క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ఈ భూమి పూజ కార్యక్రమానికి వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఉక్కుగనుల శాఖ మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ, కేంద్ర విమానాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరవుతున్న నేపథ్యంలో అత్యున్నత స్థాయి జెడ్ కేటగిరి భద్రత, ప్రోటోకాల్‌ను అమలు చేయాలని ఆదేశించారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్ నిర్మాణం, బారికేడింగ్ పనులు, వాహనాల పార్కింగ్ స్థలాలను ఐజీ క్షుణ్ణంగా పరిశీలించారు. జాతీయ రహదారిపై ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా, కార్యక్రమానికి వచ్చే వాహనాల కోసం ప్రత్యేక ట్రాఫిక్ ప్లాన్ రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డ్రోన్ కెమెరాలు, నిఘా విభాగాల సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. "రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో కీలకమైన ఈ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమం అత్యంత క్రమశిక్షణ తో, ప్రశాంతంగా జరిగేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో అందరూ పనిచేయాలని రేంజ్ డిఐజి గోపినాథ్ జట్టి సూచించారు. ఈ పర్యవేక్షణలో జిల్లా అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన రావు, ఎస్.బి డీఎస్పీ జి.ఆర్.ఆర్. మోహన్, నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు ఎం.శ్రావణి, వి.విష్ణు స్వరూప్,సిఐలు బాల సూర్యారావు, మురళి, ఎస్సై సన్నీ బాబు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైకాపా సమన్వయ కమిటీ బాధ్యుల సమావేశానికి హాజరైన రాష్ట్ర నేత వీసం

నక్కపల్లి, ప్రభాతవార్త



విశాఖపట్నం జిల్లా వైస్సార్సీపీ అధ్యక్షులు కేకే రాజు ఆధ్వర్యంలో వైస్సార్సీపీ కార్యాలయం లో పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు నియోజకవర్గం సమన్వయ కర్తలు నియోజకవర్గం పరిశీలకులు సమావేశంలో వైకాపా రాష్ట్ర కార్యదర్శి, దక్షిణ నియోజకవర్గం పరిశీలకులు వీసం రామకృష్ణ హాజరై నియోజకవర్గానికి సంబంధించిన పలు విషయాలు మాట్లాడారు.

## "తుఫాన్" అంటేనే గజ గజ వణుకుతున్న చట్టపల్లి గ్రామస్తులు

గూడెం కొత్తవీధి మార్చి 20 (ప్రభాతవార్త)



గూడెం కొత్త వీధి మండలం. గాలికొండ పంచాయితీ చట్టపల్లి గ్రామంలో 2024 సంవత్సరంలో డిసెంబర్ 8 న సంభవించిన పెను తుఫానులో ఈ గ్రామానికి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరిగిన సంఘటన మనందరికీ తెలిసిందే. గ్రామంలో ప్రభుత్వం మోడల్ కాలనీ కింద 36 ఇల్లు మంజూరు చేయడం జరిగింది. కానీ ఇప్పటివరకు ఇళ్ల స్థలాలు కానీ, మంజూరు చేసిన ఇల్లు జాడ కానీ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం వారు సొంతంగా ఇల్లు కట్టుకుందామన్న కట్టుకోవడానికి ప్రభుత్వం ఇంటి స్థలం ఇవ్వలేదని గ్రామస్తులంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలియజేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చట్టపల్లి గ్రామస్తులకు ప్రకటించిన విధంగా మోడల్ కాలనీ మంజూరు చేయాలని. లేకుంటే ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద ఇల్లునైనా మంజూరు చేయాలని తెలియజేస్తున్నాను అన్నారు. తుఫాను కారణంగా మృతి చెందిన కొర్ర కుమారి అలాగే కాళ్లు చేతులు పోగొట్టుకున్న కొర్ర రామన్న కుటుంబాలను ప్రభుత్వం ఇల్లు ఇచ్చి ఆదుకోవాలని. ఏజెన్సీలో తుఫాను ప్రభావంతో ఆ గ్రామం గజ గజ వణుకుతుందని పేర్కొన్నారు. గ్రామానికి తుఫాను వచ్చిన తర్వాత అధికారుల పరిశీలనలో గ్రామా మధ్యలో తక్షణమే కలవర్టు నిర్మించాలని లేకపోతే తుఫానుకు ఆ గ్రామం మిగలదని అధికారులు అంచనా వేశారని. వెంటనే ఆ గ్రామానికి కల్వర్టు నిర్మించి చట్టపల్లి గ్రామస్తులను ఆదుకోవాలని అధికారులను కోరుతున్నానని బిజెపి అల్లూరి జిల్లా ఉపాధ్యక్షురాలు రిమల రాజేశ్వరి తెలియజేశారు.

## కమలం గూటికి ప్రముఖ వ్యాపారవేత్త,సామాజిక వేత్త ఎంవిఆర్

### పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ సమక్షంలో నేడు పార్టీలో చేరిక

అనకాపల్లి, మార్చి19, ప్రభాతవార్త



జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకోబోతోంది. సుదీర్ఘ కాలంగా తన సేవా కార్యక్రమాలతో సామాన్యుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న ప్రముఖ పారిశ్రామికవేత్త, సంఘ సేవకుడు ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరేందుకు రంగం సిద్ధం అయ్యింది. భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాదవ్ సమక్షంలో శనివారం ఆయన పార్టీ లో చేరనున్నారు. గత చాలాకాలంగా బారతీయ జనతాపార్టీ సంఘం సేవకులు ఎం వి ఆర్ ను పార్టీలో కి తీసుకోవడం ద్వారా విశాఖ ఉమ్మడి జిల్లాలలో పార్టీని మరింత బలోపేతం చేసుకోవాలనే లక్ష్యంతో ఉంది. ఎట్టకేలకు ఎం వి ఆర్ కూడా అందుకు సంసిద్దత వ్యక్తం చేశారు.వ్యాపార రంగంలో రాణిస్తూనే, అనకాపల్లి పరిసర ప్రాంతాల్లోని నిరుపేదలకు, అట్టడుగు వర్గాలకు అండగా నిలవడంలో ఎం.వి.ఆర్ ఎప్పుడూ ముందుంటారు. విద్య, వైద్యం, మరియు సామాజిక అభివృద్ధిలో ఆయన చేసిన కృషి అమోఘం. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం, దేశాభివృద్ధి పట్ల బీజేపీకి ఉన్న అంకితభావం పట్ల ఆకర్షితులై, ఆ పార్టీ ద్వారా ప్రజలకు మరింత విస్తృతంగా సేవ చేయాలని నిర్ణయించుకున్నట్లు పారిశ్రామిక వేత్త వెంకటేశ్వర రావు తెలిపారు. విశాఖపట్నంలో పార్టీ కార్యాలయంలో మాదవ్ సమక్షంలో పెద్ద సంఖ్యలో తన అభిమానులతో ఎం వి ఆర్ పార్టీ తీర్థం తీసుకుంటున్నారు.

## రైతన్నా మీకోసం వారోత్సవాలలో రైతులు భాగస్వాములు కావాలి : జెడిఏ ఆషా దేవి

(అడ్డు రోడ్డు ,ప్రభాతవార్త)



నక్కపల్లి మండలంలో అన్ని గ్రామాల్లో రైతన్నా మీకోసం– వారోత్సవాలు జరగతున్నాయి. రైతులను కలిసి వారికి వ్యవసాయ సూచనలు ఇస్తూ అర్హత ఉండి లబ్ధి చేకూరనీ రైతులు జాబితా, ఫిర్యాదులను స్వీకరించాలని ఈ కార్యక్రమంలో భాగంగా సూచనలిస్తూ శుక్రవారం జెడిఏ ఆషా దేవి కాగిత గ్రామములో క్షేత్ర పర్యటన చేశారు. గ్రామాలలో రైతులని కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలు ,ముఖ్య మంత్రి ఐదు సూత్రాలు అయిన నీటి భద్రత, డిమాండ్ – ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు పై వివరిస్తూ ప్రోత్సహించడం చేశారు. 2026–27లో ఉండబోయే ఎల్–నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించడం, వేసవి వర్షాలను ఉపయోగించుకుంటూ, ఎల్–నినోను తట్టుకోవడానికి సంబంధించిన పద్ధతులను వివరించాలని సిబ్బంది కి ఆదేశాలు ఆదేశించారు. ముఖ్య మంత్రి పంపించిన కరపత్రాలను అందచేసి రైతుల వివరాలు వ్యవసాయ సమాచార నిర్వహణ వ్యవస్థ యాప్‌లో నమోదు చేయాలని కోరడమైనది. ఈ కార్యక్రమం వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్,వ్యవసాయ సహాయకులు ధనరాజు, రైతులు పాల్గొన్నారు.

## రేపు పోలవరం సముద్ర తీరంలో అలలలో మునిగిపోతున్న యువకుడు కాపాడిన మెరిన్ పోలీసులు

ఎస్ రాయవరం మార్చి 20 ప్రభాత వార్త



రేపు పాలన తీరంలో శుక్రవారం మధ్యాహ్నం సమయంలో సిహెచ్ తేజ తండ్రిమణి, వయసు17 సంవత్సరములు తిరుపతి జిల్లా తిరుపతి మండలం కోర్లగుంట గ్రామంనకు చెందిన యువకుడు తనతో పాటు ఇంటర్ పూర్తి చేసిన తిరుపతికి చెందిన మరో 5 గురు స్నేహితులతో కలిసి సెలవులు కారణంగా మరొక సేహితుడు నర్సీపట్నంలోని మాలేపాటి విన్నీ తండ్రి మహేష్ వయసు 17 సంవత్సరములు విరి ఇంటికి వచ్చి అక్కడ నుండి సముద్ర స్నానం నిమిత్తం రేవుపోలవరం వచ్చి సముద్రం స్నానం చేయుచుండగా పెద్ద అలల తాకిడికి సిహెచ్ తేజ సముద్రం లోనికి కొట్టుకుపోవుచుండగా అక్కడే సీఐ వై మురళి రావు, ఎస్సై వివియం దొర తీరప్రాంత గస్తీ విధులు నిర్వహిస్తున్న పెంటకోట మెరైన్ సిబ్బంది ఆధ్వర్యంలో వీరిని రక్షించి ప్రధమ చికిత్స చేసి కాపాడారు. తేజ ఆరోగ్యం నిలకడ గా ఉందని తెలియజేశారు. వీరి వెంట సిబ్బంది చినబాబు, అప్పలరాజు, గోపి తదితరులు ఉన్నారు.

## నిర్వాసితుల నోట్లో మట్టి కొట్టి

## మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు భూమి పూజ.!

(నక్కపల్లి రూరల్/అడ్డురోడ్డు /ప్రభాతవార్త)



అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం లో ఈనెల ఇరవై మూడున ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కు భూమి పూజ చేయడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో ఈ భూమి పూజ కు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కేంద్రమంత్రి కుమారస్వామి లతోపాటు పలువురు కేంద్ర మంత్రులు లు వస్తున్న విషయం తెలిసిందే.! ఈ మేరకు శుక్రవారం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కొత్తపల్లి లోకనాథంతో సహా ప్రతినిధి బృందం మండలంలోని పెద్ద బోధిగల్లం వద్ద నిర్మిస్తున్న ఆర్ అండ్ ఆర్ కాలనీలో పర్యటించి నిర్వాసితులు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాధం మాట్లాడుతూ ఆర్సెలార్ మిట్టల్, నిప్పాను స్టీల్ ప్లాంట్ కొరకు భూములు, ఇల్లులు కోల్పోయిన నిర్వాసితులు సమస్యలు పరిష్కారం చేయకుండా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కు భూమి పూజ ఎలా చేస్తారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం మిట్టల్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యానికి ఎంత తొందరగా భూములు అప్పగిద్దాం ఏ విధమైన సేవలు చేద్దాము అనే తాపత్రయం తప్ప సర్వం కోల్పోయిన నిర్వాసితులను ఎలా ఆదుకుందామనే ఆలోచనే లేదని అన్నారు. సిమ్మెంట్, ఐరన్, ఇసుక, ఇటుకలు సబ్సిడీ పైన ఇస్తామని, పునాదులు కప్పు కోవడానికి గ్రావెల్, ఇంటి నిర్మాణ సమయంలో ఉచితంగా కరంట్ అందిస్తామని హామీలు ఇచ్చిన అదికారులు మాట తప్పారని ఇది ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ఇచ్చిన ప్యాకేజీ రూ 8,98,000 పెరిగిన ఇంటి సామగ్రి ధరలు వలన ఏ విధంగా ఇల్లు నిర్మించుకోవడానికి సరిపోదని 25 లక్షలు ప్యాకేజీ ఇవ్వాలని పోరాడినా ప్రభుత్వం పట్టించు కోలేదని, ప్రస్తుతం ఇచ్చిన ప్యాకేజీ వలన ఇల్లు నిర్మించుకోవడం సాధ్యం కాదని పూర్వం నుండి నివసిస్తున్న స్వంత ఇల్లు కోల్పోయి ఇక్కడ ఇల్లు నిర్మించుకోలేక ఇబ్బంది పడుతున్నామని నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో సిపిఎం జిల్లా కార్యదర్శి జీ. కోటేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. అప్పలరాజు మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం సెక్షన్ 32 ప్రకారం నిర్వాసితుల కాలనీలో ప్రభుత్వం విద్యా, వైద్యం, దాదాపు 25 రకాల సౌకర్యాలు కల్పించిన తర్వాతనే, నిర్వాసిత కాలనీలో ఇల్లు నిర్మించుకున్న తరువాత మాత్రమే స్వంత గ్రామంలో ఇల్లు లు కాలీ చేయించాలి అటువంటిది ఇక్కడ అధికారులు చట్టాలను ఉల్లంఘించి నిర్వాసితులను భయబ్రాంతులకు గురి చేసి మిట్టల్ మెప్పు కోసం ఇల్లులు నేలమట్టం చేసి నిర్వాసితులను నడిరోడ్డుమీదకు నెట్టారని,ఇంటి అద్దె చొప్పున ఐదు నెలకు ఇరవై ఐదు వేలు ఇంటి అద్దె చెల్లిస్తామని చెప్పి కొంత మందికి మాత్రమే చెల్లించారని, మిగతా వాళ్ళు కు ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించారు. వివాహం అయిన ఆడపిల్లలకు, పద్దెనిమిది సంవత్సరాలు నిండిన మగ పిల్లలు, అర్హత కలిగి ప్యాకేజీ అందని వారుకి రెండో లిస్ట్ అని చెప్పి కాలయాపన చేయకుండా వెంటనే ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులందరికీ ఆర్ కార్డులు ఇవ్వాలని నిర్వాసితులకు, స్థానికులకు డబ్బై ఐదు శాతం ఉద్యోగాలు ఇవ్వాలని దీనిపై ప్రభుత్వం కంపెనీ యాజమాన్యంతో ఒప్పందం చేయాలని,వెంటనే స్కిల్ డవలఫ్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం. సత్యనారాయణ,సిపిఎం మండల కార్యదర్శి ఎం. రాజేష్ మాట్లాడుతూ నిర్వాసిత కాలనీ చట్టం ప్రకారం ఇరవై ఐదు రకాలు మౌళిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమం లో నాయకులు ఎం. మహేష్ బాబు, వై. నవీన్,జీ. రమణ, కె.దేవుడు,ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణకుమారికి సంకల్ప్, నారీ శక్తి ప్రతిష్టాత్మక పురస్కారాలు

అరకులోయ, మార్చి 20, ప్రభాతవార్త



మానవ హక్కుల నేరం నిరోధిక సంఘం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కమిడి కృష్ణ కుమారి తను చేసిన సేవా కార్యక్రమాలకుగాను ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్నారు. సామాజిక సేవా రంగంలో విశేష కృషి చేస్తున్న హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ క్రైమ్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా విభాగం కె కృష్ణ కుమారి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలు సంస్థల నుండి ప్రతిష్టాత్మక పురస్కారాలను అందు కున్నారు. కృష్ణ కుమారి గత కొంత కాలంగా ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యటిస్తూ గిరిజన, వెనుకబడిన వర్గాలకు చట్టపరమైన అవగాహన కల్పిస్తూ వారి హక్కుల కోసం పోరాడుతున్నారు. కేవలం అవగాహనకే పరిమితం కాకుండా, నిరుపేద కుటుంబాలకు బట్టలు, బియ్యం, నూనె, నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తూ తన దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. ఆమె చేస్తున్న ఈ నిరంతర సామాజిక సేవలను గుర్తించి మక్ష్ గ్లోబల్ ఫౌండేషన్ తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో నిర్వహించిన వేడుకల్లో "సంకల్ప్ పురస్కార్ –2026"ను ప్రదానం చేశారు. అలాగే నవ భారత్ కళాక్షేత్రం వారు అంతర్జాతీయ మహిళా దినోత్సవం, ఉగాది సంబరాల సందర్భంగా "నారీశక్తి పురస్కారం" తో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణ కుమారి మాట్లాడుతూ, ఈ పురస్కారాలు తనపై బాధ్యతను మరింత పెంచాయని, భవిష్యత్తులో హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ క్రైమ్ అసోసియేషన్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని పేర్కొన్నారు. ఆమెకు ఈ అవార్డులు రావడం పట్ల అసోసియేషన్ సభ్యులు మరియు పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## వర్షంలోనూ కూడా ఆధ్యాత్మిక శోభతో అలరించిన నూకాంబికా అమ్మవారి ఉత్సవాలు

### జానపద గీతాలతో అలరించిన భక్తులు

అనకాపల్లి, మార్చి 20, ప్రభాతవార్త



శ్రీ నూకాంబికా అమ్మవారి రాష్ట్ర పండుగ మహోత్సవాలు నాలుగో రోజు వేడుకలు అనకాపల్లి పట్టణాన్ని భక్తి మయంగా మార్చాయి. ఆలయ ప్రాంగణం నుంచి పట్టణ వీధుల దాకా ఆధ్యాత్మిక వాతావరణం అలుముకుంది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో, జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పట్టణంలో స్థానిక ఎన్టీఆర్ మైదానంలో శుక్రవారం సాయంత్రం ఆరు గంటల నుండి రాత్రి 7 గంటలు వరకు సాగిన శ్రీవారి కీర్తనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.కార్యక్రమం మధ్యలో వర్షం కారణంగా మిగిలిన కార్యక్రమాలు ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకంబిక అమ్మవారి దేవస్థానంలో నిర్వహించారు. అందులో భాగంగా ఇంద్రజ డ్యాన్స్ అకాడమీ ప్రదర్శించిన జానపద నృత్యాలు ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో మార్మోగాయి. దీంతో ఆలయం భక్తులతో సంస్కృతి కార్యక్రమాలతో కలకలలాడింది.

## కళాకారులకు సత్కారం ..ఘనంగా ముగిసిన ఉత్సవాలు

నక్కపల్లి, ప్రభాతవార్త )



నక్కపల్లి నూకాలమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నక్కపల్లికి చెందిన జాతీయ ఉత్తమ కళాకారులు అవార్డు గ్రహీతలు, శ్రీ బాల వినాయక మ్యూజికల్ బ్యాండ్ పార్టీ స్వర్గీయ ఉప్పలపు గురుమూర్తి కుమారులు శ్రీను, శివ, వారి బృందం సభ్యులను నక్కపల్లి గ్రామ పెద్దలు వీసం రామకృష్ణ, కొప్పిశెట్టి వెంకటేష్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. నూకాల మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రజలు సహకారం అందించడంతో వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## భూమి పూజకు రండి.!

(నక్కపల్లి, ప్రభాతవార్త



రాష్ట్ర హోం విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనితమ్మ నాయకత్వంలో నెల 23 వ తేదీన జరిగే స్టీల్ ప్లాంట్ భూమి పూజ కార్యక్రమానికి రావాలంటూ ప్రతి ఇంటికి వెళ్లి రాజకీయాలక తీతంగా కూటమి నాయకులు ఆహ్వానాలు అందజేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్య శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ తో పాటు కేంద్ర, రాష్ట్ర, మంత్రులు వస్తున్నారని ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగం కావాలని ఆహ్వానం అందించేటప్పుడు కోరుతున్నారు. ఎంపిటీసీ పిక్కి సత్తియ్య, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, సొసైటీ అధ్యక్షులు పిక్కి కోదండరావు,జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి కోదండరావు (బుజ్జి), నక్కపల్లి మండల జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి బొంది గుర్రన్న, యూనిట్ ఇంచార్జ్ వాసుపల్లి శివాజీ, ఐటిడిపి అనకాపల్లి జిల్లా కమిటి సభ్యులు మడదా రాంబాబు, పిక్కి చిన్నారి, కోదండరావు, సత్తిబాబు, అప్పలరాజు, జగ్గ, కాశి తదితరులు పాల్గొన్నారు.

## పేకాట ఆడుతున్న 9 మంది కేసు నమోదు

పాయకరావుపేట మార్చి 20 ప్రభాతవార్త:



పాయకరావుపేట ఎస్‌హెచ్ఓ జి.అప్పన్న తెలియ జేసిన వివరాల మేరకు ఎస్సై పురుషోత్తం స్టేషన్ సిబ్బంది చిన్న కందిపూడి శివారుణ సుమారు 9 మంది పేకాట ఆడుతుండగా పాయకరావుపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది అన్నివైపుల నుండి వచ్చి సుమారు 23,580 రూపాయలు, 52 పేక ముక్కలు, 9 సెల్‌ఫోన్లు పట్టుకోనీ సీజ్ చేసి, కేసు నమోదు చేసి ఇన్వెస్టిగేషన్ చేయడం జరిగిందని తెలిపారు. కోడిపందాలు, రబ్బరు గుండాట, పేకాట లాంటి ఆటలు ఆడినట్టు సమాచారం ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేయడం జరిగింది.

## ఆధార్, అంగన్వాడి కేంద్రాలను ఎం.పీ.డీ.వో ఆకస్మిక తనిఖీ

గూడెంకొత్తవీధి మార్చి 20 (ప్రభాతవార్త)



గూడెం కొత్తవీధి మండలంలోని పెద్దవలసలో ఎంపీడీవో రమణబాబు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం గ్రామంలో పర్యటించి స్థానిక సచివాలయంలో నిర్వహిస్తున్న ఆదర్శ సెంటర్‌ను తనిఖీ చేశారు. చాలామంది గిరిజనులు ఆధార్ సేవల కోసం సుదూర ప్రాంతాల నుంచి వస్తున్నారని తెలిపారు. కచ్చితంగా ప్రతిరోజు ఆధార్ సెంటర్ తెరిచి సేవలు అందించాలని సూచించారు. ఆధార్ సేవలను నిర్లక్ష్యం చేయవద్దని, సేవల కోసం వచ్చే వారి నుంచి వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి లబ్ధిదారులకు వండిన ఆహారాన్ని రుచి చూశారు. కేంద్రానికి వచ్చే పిల్లలకు ఆటపాటలతో పాటు ప్రీస్కూల్ విద్యను అందించాలన్నారు. నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఏ.ఐ.టి.యు.సి జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయండి : కె.సత్తిబాబు

గూడెం కొత్తవీధి మార్చి 20, ప్రభాతవార్త



అల్లూరి సీతారామరాజు జిల్లా జీ.కే వీధి మండలం ఏ.ఐ.టి.యు.సి. (ఏ పీ.ఎఫ్.డి.సి) కాఫీ వర్కర్స్ యూనియన్ ఉప అధ్యక్షులు కంకిపాటి సత్తిబాబు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో కార్మిక హక్కుల రక్షణకై ఐక్యంగా పోరాడుదాం అంటూ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ నెల 23న పాడేరులో జరగబోయే జిల్లా ప్రథమ మహాసభకు ముఖ్య అతిథులుగా ఏ.ఐ.టి.యు.సి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల్ రమణ, ఏ.ఐ.టి.యు.సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, గౌరవ అధ్యక్షులు సత్య ఆంజనేయ, సి.పి.ఐ. పార్టీ జిల్లా కార్యదర్శి పొట్టిగా సత్యనారాయణ హాజరవుతున్నారు. ఏ.ఐ.టి.యు.సి అనుబంధ సంస్థలు, సంఘాల కార్మిక సోదరులందరూ హాజరై ఈ మహాసభను జయప్రదం చేయాలంటూ కంకిపాటి సత్తిబాబు తెలిపారు.

## గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం పాడేరు మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక

పాడేరు,మార్చి20,ప్రభాతవార్త



ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం పాడేరు మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నికలు జిల్లా అధ్యకాసులు కూడా రాంబాబు, ప్రధాన కార్యదర్శి కూడా చిట్టిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం పాడేరులో జరిగాయి. ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం పాడేరు మండలం నూతన కార్యవర్గం గౌరవ అధ్యక్షులుగా ఎల్. వి.ఏం.పాత్రుడు, అధ్యక్షులుగా, ఏం.భానుమూర్తి, ప్రధాన కార్యదర్శిగా సల్మాన్‌రాజ్ పడాల్, ఆసోషియేట్ అధ్యక్షులుగా కె.కుమారి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కే.ఈశ్వరమ్మ, ఉపాధ్యక్షులుగా ఎ.సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శిగా కె.శారద, కోశాధికారిగా ఎస్. దేముడమ్మ, మహిళ కార్యదర్శిగా ఏం.ప్రమీల చంద్రకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు, జి.పీ.ఎస్ పాఠశాలల ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## డుంబ్రిగుడకు శ్రీను శెట్టికి డాక్టరేట్

### అభినందనలతో మండల ప్రజలు

డుంబ్రిగుడ, మార్చి20,ప్రభాతవార్త



మండల కేంద్రనికి చెందిన శెట్టి శ్రీను ఆంధ్ర విశ్వవిద్యాలం నుంచి డాక్టరేట్ తీసుకున్నారు. స్టాటిస్టిక్స్ విభాగంలో ప్రొఫెసర్ బి మునిస్వామి మార్గదర్శకత్వంలో ఫెర్టిలిటీ ప్యాటర??్నప పరిశోధన చేసి పీహెచ్ పట్టా పొందారు. ఈపరిశోధనలో ప్రపంచవ్యాప్తంగా సిజేరియన్ ప్రసవాలు 21 శాతం పెరిగినట్లు వెల్లడించారు. 2030 నాటికి ఇవి 29 శాతంకు చేరే అవకాశం ఉందన్నారు. చిన్నతనం లోనే తండ్రిని కోల్పోయి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని కనీస అక్షరాస్య లేని తల్లి సహకారంతో అరకులోయలో ఉన్న సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రాథమిక విద్యను పూర్తి చేసి విజయవాడ లైలా కళశాలలో డిగ్రీ పట్టా పొందారు. అనంతరం ఆంధ్రవిశ్వవిద్యాలంలో ఉన్నత విద్యాను అభవ్యషించారు. పట్టా పొందిన శ్రీను శెట్టి కి మండల కేంద్రంలోని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

## రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి : అచ్చెన్న



కోటబొమ్మాళి, మార్చి 20, ప్రభాతవార్త: ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని రాష్ట్ర మంత్రి కింజ రాపు అచ్చెన్నాయుడు వైద్యులను ఆదేశించారు. కోటబొమ్మాళిలో శుక్రవారం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు వార్డులు, మందుల నిల్వ గది తదితర వాటిని స్వయంగా సందర్శించారు. ఆసుపత్రికి వచ్చే రోగులు వివరాలు రికార్డుల్లో నమోదు వివరాలను పరిశీలిం చారు. వైద్య పరికరాల పనితీరు తెలుసుకొని ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వివిధ వైద్య పరీక్షలు వాటి నివేదికలు తెలియ జేయుటకు పట్టే సమయం, వ్యాధి నిర్ధారణ పరీక్షల కిట్లు లభ్యత తదితర వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. వార్డులో రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. నిల్వలు, రక్త పరీక్షల విభాగాలను తనిఖీ చేశారు. ఆసుపత్రి సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉండాలన్నారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మనమంతా పక్షులను కాపాడుకుందాం



కంచిలి, మార్చి 20 ప్రభాతవార్త: పక్షులను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిదని ఉపాధ్యాయుడు నిరంజన్ ఖడంగా అన్నారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో ఎనిమిదో తరగతి హిందీ పాఠ్యపుస్తకంలో హం సబ్ ధరతి కీ సంతాన్ పాఠ్యాంశం నుండి పక్షులపై సంభాషణ విషయ ములను విద్యార్థులకు అవగాహన పరచి విద్యార్థులచే పక్షులను కాపాడుకుందాం ప్రతిజ్ఞను చేయించారు. ప్రతి బయట ఆవరణలో నీరు పెట్టి పక్షుల దాహాన్ని తీర్చుకునేందుకు అలాగే ఆహారం పెట్టి ఆకలిని తీర్చేందుకు విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఇంట్లో పిచ్చుక గూడు కట్టుకోవడం శుభసూచికంగా భావిస్తారు. ఇది కుటుంబానికి ఐశ్వర్యం సంతోషాన్ని తెస్తుందని పెద్దలు నమ్మకం పెట్టుకొని ధాన్యపు లేకిని కూడా జడలుగా అల్లి చెట్లపై పురిండ్లపై కట్టే పరిస్థితి గతంలో ఉండేదని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు సోమేశ్వరరావు ఇతర ఉపాధ్యాయులు చంద్రశేఖర్, కాంతారావు, చలపతి, ఎంవి రమణ, రోజా రాణి విద్యార్థులను అభినందించారు.

## నిరుద్యోగులకు ఉగాది కానుకగా జాబ్ క్యాలెండర్

**పాలకొండ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి**



సీతంపేట, మార్చి 20 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉగాది కానుకగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని టీడీపీ ఇన్‌చార్జ్ పడాల భూదేవి స్పష్టం చేశారు. శుక్రవా రం సీతంపేట టీడీపీ కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా కుటమి ప్రభుత్వం పనిచేస్తుందని, ఇప్పటికే 20 నెలల్లో 6,28,347 ఉద్యోగాలు యువతకు అందించడం జరిగిందన్నారు. జాబ్ క్యాలెండర్‌లో ప్రధానంగా విద్య, పోలీస్ శాఖలకు పెద్దపీట వేయడం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించి భారీగా టీచర్ పోస్టులను భర్తీ చేయడం జరిగిందని ఉగాది కానుకగా మరోసారి డీఎస్సీని జూనియర్ లెక్చరర్ పోస్టుల కోసం మూడు వేల ఖాళీలను కేటాయించింది. పరిపాలన విభాగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్రూప్ వన్, గ్రూప్ టు ఉద్యోగాల కోసం దాదాపు 600 పోస్టులతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం 1000 పోలీస్ కానిస్టేబుల్, 400 ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టులు భర్తీకి మన యువ నాయకులు తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి ఐటి శాఖ మంత్రివర్యులు నారా లోకేష్‌బాబు కృషితో పోస్టులు భర్తీకి ప్రభుత్వం పచ్చ జెండా ఊపిందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాలకొండ మండల కన్వీనర్ తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గండి రామనాయుడు, సీతంపేట మండల కన్వీనర్ సవర తోట ముఖలింగం. మాజీ ఎంపీపీ సవర కుంపి తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ మనదే... దూసుకుపోండి : ఎమ్మెల్సీ విక్రమ్



వీరఘట్టం, మార్చి 20 ప్రభాతవార్త : రానున్న భవిష్యత్తు అంతా మనదేనని... మీరంతా ఉత్సాహంగా ముందుకు సాగి, దూసుకుపోవాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. శుక్రవారం వీరఘట్టం టౌన్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమా వేశం ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మా ట్లాడారు. వైకాపా అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్టానికి అంతా మంచే జరుగుతుందని ఇందుకు ప్రతి ఒక్కరు పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అన్ని విధాల అభివృద్ధిలో వెనుకబడిందని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలని మర్చిపోయిందని ఆయన చెబుతూ, ప్రజల్ని పూర్తిగా నట్టేట ముంచిందని ఆయన దుయ్యబట్టారు. ప్రజా పరిపాలన గాలికి వదిలి మాయమాటలతో కాలాన్ని వెల్లబుచ్చుతున్నారన్నారు. కార్యకర్తలు ఎవరు అధైర్య పడవద్దని, అందరికీ అన్ని విధాల అధిష్టానం తోడుగా నిలబడుతుందని ఆయన అన్నారు. రానున్న స్థానిక ఎన్నికలకు అందరూ సమాయత్తం కావాలన్నారు. సమావేశంలో వీరఘట్టం టౌన్‌కు సంబంధించి కమిటీలు ఏర్పాటుపై చర్చించారు. అన్ని కమిటీలు త్వరితగతిన పూర్తి చేయాలని, డిజిటలైజేషన్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో వీరఘట్టం ఎంపీపీ దమలపాటి వెంకటరమణ నాయుడు, పట్టణ శాఖ అధ్యక్షులు దిబ్బ లలిత కుమారి, భోగి మాణిక్య చంద్రశేఖర్, పిన్నింటి శ్రీనివాసరావు, జలుమూరు అమర్నాథ్, అంబల్ల రవికుమార్, కెంగువ ఆంజనేయులు, భోగి మదన్ మోహన్, బూరాడ చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వీరఘట్టం, మార్చి 20 ప్రభాతవార్త : వీరఘట్టం ఉపకేంద్రం పరిధిలోని బిటివాడ పీడర్ పరిధిలోని గ్రామాలకు ఈ నెల 21వ తేదీ శనివారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇం జనీర్ కె.విష్ణుమూర్తి శుక్రవారం విలేకరులకు తెలిపారు. 11 కేవీ బిటివాడ ఫీడర్ నందు ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ మరియు చెట్లు తొలగించుట, ఇతర పనులు చేయుటం వలన విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నామన్నారు. బిటివాడ ఫీడర్ పరిధిలో ఉన్నటువంటి చిదిమి, యు.వెంకంపేట, రేగులపాడు, కత్తులకవిటి, కె.ఇచ్ఛాపురం, ఎం.రాజపురం, తూడి, పాలమెట్ట, గంగంపేట, హుస్సైనుపురం, కొంచ తదితర గ్రామాలకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు. దయచేసి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## విజన్ టెక్నాలజీస్‌లో వేసవి శిక్షణ తరగతులు

**సంస్థ డైరెక్టర్ అల్లు భాగ్యశ్రీ**



రాజాం, మార్చి 20 ప్రభాతవార్త : స్థానిక మెయిన్ రోడ్డు లోని ఆంధ్రాబ్యాంక్ పక్కన ఉన్న విజన్ టెక్నాలజీస్ కంప్యూటర్ శిక్షణా సంస్థలో వేసవి సెలవుల సందర్భంగా 45 రోజుల ప్రత్యేక శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయని సంస్థ డైరెక్టర్ అల్లు భాగ్యశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ నిష్ణాతులైన శిక్షకులతో పిజిడిసిఎ, టాలీ, డిటిపి వంటి ప్రొఫెష నల్ కోర్సులతో పాటు ఎం.ఎస్.ఆఫీస్, ఇంటర్నెట్ , టైపింగ్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, గృహిణులు, ఉద్యోగార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ప్రత్యేక స్పోకెన్ ఇంగ్లీష్ తరగ తులు నిర్వహిస్తున్నామని, 4 నుండి 10వ తరగతి విద్యార్థుల కోసం వేదిక్ మ్యాథ్స్, హ్యాండ్ రైటింగ్ (లూసిడా,కర్సివ్) క్లాసులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ఐఎస్‌వో గుర్తింపు పొందిన సర్టిఫికెట్ అందజేయడంతో పాటు ఫార్మా కంపెనీలు, ఇతర టెక్నికల్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆమె తెలిపారు. ఆసక్తిగలవారు మరిన్ని వివరాల కోసం 79815 22881 లేదా 9346456307 నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

## ప్రజాదర్బార్‌తో సమస్యల పరిష్కారం : కూన



ఆమదాలవలస, మార్చి 20, ప్రభాతవార్త: ప్రజా దర్బార్‌తో ప్రజా సమస్యలను పరిష్కరించు కోవచ్చు నని, సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతి వారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమదాలవలస ఎమ్మెల్యే, పియుసి కమిటీ ఛైర్మన్ కూన రవికుమార్ అన్నారు. శాంతినగర్ కాలనీలో ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజలు అందజేసిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలు తీర్చేందుకు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునని అన్నారు. ప్రజా పాలన దిశగా కూటమి ప్రభు త్వం నిరంతరం పని చేస్తుందని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు. ప్రజల నుండి వచ్చిన పలు వినతులు తెలుసుకొని సంబం ధిత శాఖల అధికారులతో వెంటనే మాట్లాడి పరిష్కారం చూపాలని అన్నారు. ముఖ్యంగా నియోజక వర్గంలో తాగునీరు, పారిశుధ్య, రోడ్లు, విద్యుత్, పింఛన్లు, గృహ నిర్మాణం వంటి సమస్యలపై ప్రత్యేకం గా దృష్టిసారించి పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## అత్యాచారం కేసులో ముద్దాయి అరెస్టు



కవిటి, మార్చి 20 ప్రభాతవార్త: మార్చి 18వ తేదీన కవిటి పోలీస్ స్టేషన్‌లో నమోదైన అత్యాచార కేసులో ముద్దాయి దుక్క జోగారావు అలియాస్ చిన్నారెడ్డిని తిప్పనపుట్టుగ గ్రామ కూడలిలో అరెస్ట్ చేసినట్టు ఇచ్ఛాపురం సిఐ చిన్నంనాయుడు, కవిటి ఎస్ఐ రవివర్మ తెలిపారు. ఈ మేరకు ముద్దాయి వద్ద సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని అతన్ని రిమాండ్‌కు తరలించినట్టు సిఐ చిన్నంనాయుడు తెలిపారు. ఈ నెల 18వ తేదీన మండలంలోని నెలవంక పంచాయతీ దుర్గమ్మ పుట్టుక గ్రామానికి చెందిన దుర్గాసి గంగమ్మ మానసిక వికలాంగురాలు అయిన తన కుమార్తెపై నెలవంక గ్రామానికి చెందిన డి.జోగారావు అత్యాచారం చేసినట్లు ఫిర్యాదు చేసిన విషయం విదితమే.

## ఉద్దానంలో సోంపేట తరహా ఉద్యమం తప్పదేమో : వామపక్షాలు




పలాస, ప్రభాతవార్త : పలాస కార్గో ఎయిర్పోర్ట్ వద్దు ప్రజల భూములే ముద్దు ..పచ్చని ఉద్దానంలో కార్గో ఎయిర్ పోర్ట్ రద్దు చేయాలని, బలవంతపు భూసేకరణ ఆపాలని, నిర్బంధాన్ని ఎత్తివేయాలని కోరుతున్న కార్గో ఎయిర్ పోర్ట్ బాధితులకు మద్దతుగా ప్రాణాలైనా ఇస్తాం, ప్రజల భూములు కాపాడతాం అంటున్న వామపక్షాలు పలాస కాశీబుగ్గ టౌన్ లో కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు గారు ఆధ్వర్యంలో ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ ఏర్పాటు చేసిన సమావేశంలో మార్చి 23 నుండి 31 వరకు అన్ని గ్రామాలలో బ్లాక్ రిబ్బన్ ధరించి నిరసనలు తెలియజేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, లిబరేషన్ నాయకులు యం రామారావు,కార్గో ఎయిర్ పోర్ట్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొమర వాసు, జోగి అప్పారావులు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయం ఆవరణలో కార్గో ఎయిర్పోర్ట్ వ్యతి రేక పోరాట పోరాటానికి సంఘీభావంగా సభ నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపా ధ్యక్షుడు కె మోహన్ రావు, రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వంకల మాధవరావు,సిఐ టియు జిల్లా కార్యదర్శి యన్ గణపతి,జిడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ మీడియా వింగ్ కన్వీనర్ బత్తిని లక్ష్మణ్,ప్రజా సంఘాల నాయకులు పి కుసుమ,కె గురయ్య, కె లోకనాథం, కార్గో పోరాట కమిటీ నాయకులు పొట్టి ధర్మారావు, గుంటి లోకనాథం,గుంటు రామస్వామి, లండ రామస్వామి,తదితరులు పాల్గొన్నారు.

## సీతంపేటలో వడగళ్ల వాన

సీతంపేట, మార్చి 20 ప్రభాతవార్త : మండలంలో శుక్రవారం రాత్రి పెద్ద ఎత్తున ఉరుములతో కూడిన వడగళ్ల వాన కురిసింది. దీంతో జీడి మామిడి, చింత, కొండ చీపుర్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. పెద్ద ఎత్తున వడగళ్ల వర్షం కురవడం వలన మామిడి పిందెలు రాలిపోయావని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గత నాలుగు నెలలుగా ఎటువంటి వర్షాలు లేకపోవడం ఒక్కసారి పెద్ద ఎత్తున వడగళ్ల వర్షం కురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు స్పష్టం చేశారు.

## పాతపట్నంలో రైల్వేహాల్ట్ ప్రారంభం



పాతపట్నం, మార్చి 20 ప్రభాతవార్త: పాతపట్నం నియోజకవర్గ ప్రజల కోరిక నెరవేరింది. స్థానిక ప్రయాణికుల సౌకర్యార్థం రాజారాణి ఎక్స్‌ప్రెస్ రైల్‌ను పాతపట్నం రైల్వే స్టేషన్లో హాల్ట్‌ను శుక్రవారం కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మో హన్ నాయుడు, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, రైల్వే డిఆర్ఎం బి లలిత్ జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. గత కొంతకాలంగా ఈ హాల్ట్ కోసం ప్రజలు ఎదురుచూస్తున్న తరుణంలో ఎమ్మెల్యే గోవిందరావు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి ఈ సమస్యను పలుమార్లు తీసుకెళ్ళి, ఆయన తో సమన్వయం చేసి ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి వచ్చేలా కృషి చేశారు. ఈ హాల్ట్ ప్రారంభంతో వేలాది మంది ప్రయాణికులకు, ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు మరియు చిన్న వ్యాపారులకు రవాణా సౌకర్యం మరింత సులభం కానుంది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ పాతపట్నం ప్రాంత ప్రజల అవసరాలను గుర్తించి ఈ రైల్వే హాల్ట్‌ను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించడం కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గోవిందరావు చొరవతో ఈ హాల్ట్ సాధ్యమైందన్నారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ పాతపట్నం ప్రజల కోరిక నేరవేరిందని, ఈ హాల్ట్ కోసం ఎన్నో రోజులుగా కృషి చేశామన్నారు. పర్లాకిమిడి ఎమ్మెల్యే రుపేష్ పాణిగ్రాహి, రైల్వే ఉన్నతాధికారులు, ఎన్‌డిఏ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ నాయకులు, ప్రజలు, ప్రయాణికులు పాల్గొన్నారు.

## ఉగాది కానుకగా యువతకు జాబ్ క్యాలెండర్

**రాష్ట్ర కళింగ వైశ్యుల కార్పొరేషన్ ఛైర్మన్ బోయిన**



కోటబొమ్మాళి, మార్చి 20, ప్రభాతవార్త: రాష్ట్ర యువతకు ఉగాది పండుగ సందర్భంగా కూటమి ప్రభుత్వం గొప్ప కానుకగా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయడం హర్షణీయ మని రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ బోయిన గోవింద రాజులు తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మంత్రి నారా లోకేష్ విడుదల చేసిన 10,060 పోస్టులతో కూడిన జాబ్ క్యాలెండర్ నిరుద్యోగ యువతకు కొత్త ఆశలను నింపిందన్నారు. ఇది నిరుద్యోగులకు నిజమైన ఉగాది పండుగగా మారిందని పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని మంత్రి లోకేష్ కచ్చితంగా అమలు చేస్తుండటం అభినందనీయమ న్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఒకవైపు పరిశ్రమలను రాష్ట్రానికి ఆకర్షిస్తూ, మరోవైపు యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రికి, ఉప ముఖ్య మంత్రి, కేంద్ర పౌర విమానాయశాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

## నవోదయ ఫలితాల్లో.. రాజాం విద్యార్థి ప్రతిభ



రాజాం, మార్చి 20, ప్రభాతవార్త: జవహర్ నవోదయ పరీక్ష ఫలితాల్లో రాజాంకి చెందిన విద్యార్థి ప్రతిభ చూపారు. బొబ్బిలి మండల కేంద్రంలోని ఏపీ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్న రాజాం వాసి జొన్నాడ లితిస్ ఆరో తరగతి ప్రవేశాలకు ఎంపిక య్యారు. వీరి ఎంపిక పట్ల ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ సత్యనారాయణ, తల్లిదండ్రులు, రంజిత్ అభినందనలు, తెలిపారు.

## సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్



ఆమదాలవలస, మార్చి 20, ప్రభాతవార్త: ప్రజా సమస్యల కోసమే ప్రజా దర్బార్ నిర్వహి స్తున్నట్లు మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీత, రాష్ట్రకాలింగా కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు, ఎమ్మెల్యే కూన రవికుమార్ పిలుపు మేరకు ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో టిడిపి కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వ హించి, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజలు అందజేసిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకొని వెళ్తామని అన్నారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలు తీర్చేందుకు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఎమ్మెల్యే రవికుమార్ ఉంటారని ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకోవచ్చనని అన్నారు. ప్రజాపాలన దిశగా కూటమి ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని తెలిపారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపదరావు మురళీధర్,కూన ఆంజనేయులు, తమ్మినేని శ్రీనివాసరావు, పీవీకే రాజు,చౌదల గోవిందరావు, నాగళ్ళ మురళీధర్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## నీలమణి దుర్గ ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి గ్రీన్‌సిగ్నల్



పాతపట్నం, మార్చి 20 ప్రభాతవార్త: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం, పాతపట్నంలో వెలసియున్న నీలమణి దుర్గ అమ్మవారి దేవ స్థానంలో భక్తుల సౌకర్యార్థం నిత్యాన్నదానం పథకాన్ని అమలు చేసేం దుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ అనుమతి మంజూరు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆలయ అధికా రులు ఒక ప్రకటన విడుదల చేశారు. దేవాదాయ శాఖ నిబంధ నల ప్రకారం ఈ పథకం కోసం దాతలు, భక్తుల నుండి విరాళాలు సేకరిం చడం జరుగుతుంది. మొత్తం రూ.50 లక్షల మూలనిధి సమకూరిన వెంటనే దానిపై వచ్చే వడ్డీతో ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభిస్తారు. అమ్మవారి సేవలో భాగస్వాములు కావాలనుకునే దాతలు తమ విరాళాలను డిమాండ్ డ్రాఫ్ట్, చెక్, నగదు రూపంలో అందించి ఆలయ కార్యాలయం నుండి తగిన రసీదును పొందాలని కార్యనిర్వహణాధి కారి టి.వాసుదేవరావు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ అక్కంద్ర సన్యాసిరావు, కమిటీ సభ్యులు కోరారు. శుక్రవారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సమక్షంలో ఈ అన్నదాన పథకం గురించి అధికారికంగా ప్రకటించడం జరిగిందని ఈఓ వాసుదేవరావు పేర్కొన్నారు.

## మందిరం ప్రతిష్ఠలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పాతపట్నం, మార్చి 20 ప్రభాతవార్త: మండలంలోని అచ్యుతాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ త్రినాథ స్వామి మందిర ప్రతిష్ఠ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు మరియు మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి వైకాపా నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పంచసూత్రాలపై రైతులకు అవగాహన



కోటబొమ్మాళి, మార్చి 20 ప్రభాతవార్త: స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా వ్యవసాయంలో పంచసూత్రాలపై రైతులు అవగాహన పెంచుకోవాలని టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహన్‌రావు అన్నారు. ఆయన శుక్రవారం మండలం వాండ్రాడ గ్రామంలో అన్నదాత సుఖీభవ లబ్ధిదారులతో రైతన్న మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ వ్యవసాయ సహాయకులతో ప్రతి లబ్ధిదారుడు ఇంటికి వెళ్ళి పంచ సూత్రాలను వివరించారు. మండల వ్యవసాయశాఖ అధికారి ఎస్.గోవిందరావు, సర్పంచ్ చల్ల అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## నిరాహార దీక్షలు విజయవంతం చేయండి



కంచిలి, మార్చి 20 ప్రభాతవార్త: కంచిలి సీఐటీయు భవనంలో కంచిలి, కవిటి, సోంపేట ముఖ్య బాధ్యుల సమావేశం జిల్లా కార్యదర్శి మురళీ ప్రకాష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు లండ బాబురావు హాజరై ఈ నెల 24న ఇచ్ఛాపురంలో జరిగే నిరాహార దీక్ష(ఆర్థికసమస్యలు పరిష్కారం కోసం) విజయవంతం చెయ్యాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సీపీఎస్ కన్వీనర్ రవి, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ కాళిదాష్, కంచిలి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మురళీ నాయక్, లక్ష్మణ్, సోంపేట అధ్యక్షులు కూర్మారావు, దొరబాబు, రవి, ప్రకాష్, త్రినాథ సాహు తదితరులు పాల్గొన్నారు.

## సోంపేట రైల్వేస్టేషన్ అభివృద్ధికి సహకరించండి



**మంత్రి రామ్మోహన, డీఆర్ఎంని కోరిన అభివృద్ధి కమిటీ**

కంచిలి, మార్చి 20 ప్రభాతవార్త: సోంపేట రైల్వే స్టేషన్ అభివృద్ధికి సహకరించాలని పౌర విమానయ శాఖ కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును, ఖుర్ధ రైల్వే డిఆర్ఎం సునీల్ కుట్టిను కలిసి సోంపేట రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ మాజీ రైల్వే అధికారులు వినతిపత్రం ద్వారా కోరారు. మందస రైల్వే స్టేషన్లో రైల్ హాల్ట్ కోసం వచ్చిన కేంద్రమంత్రిని కలిసి రైల్వే స్టేషన్ అభివృద్ధికి సహకరించాలని అలాగే ఓవర్ బ్రిడ్జ్, విచారణ కార్యాలయం ఏర్పాటు కోసం కోరారు. ఓవర్ బ్రిడ్జ్ మంజూరు అయిందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని, సోంపేటలో ఒకటి రెండు ప్లాట్ ఫారంలో ఆరు షెల్టర్లు మంజూరు అయ్యాయని, స్టేషన్ నూతన కార్యాలయంలో విచారణ కార్యాలయం ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలుగుదేశం నాయకులు, రైల్వే మాజీ అధికారులు పాల్గొన్నారు.

## సీతారామ మందిరం నిర్మాణానికి విరాళం



కంచిలి, మార్చి20 ప్రభాతవార్త: సోంపేట రైల్వే స్టేష న్లో నూతనంగా నిర్మిస్తున్న సీతారామ మందిరం కోసం సోంపేట గ్రామానికి చెందిన ఆర్ఎంసి ఫైనాన్స్ యాజ మాని బోనాల వీరారెడ్డి రూ.1,11,111 విరాళంగా అంద జేశారు. విరాళాన్ని సోంపేట రైల్వే మాజీ టికెట్ కలెక్టర్ అధికారి లోళ్ల సూర్యనారాయణకు అందజేశారు. షావుకా రి తిరుపతిరావు, సంజయ్‌కుమార్ శర్మ పాల్గొన్నారు.

## రేషన్‌దారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



కంచిలి, మార్చి 20 ప్రభాతవార్త : రేషన్ షాపుల ద్వారా రేషన్ సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని తహ సిల్దార్ ఎం.రమేష్ కుమార్ కోరారు. శుక్రవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో మండల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రేషన్ లబ్ధిదారులకు తూకంలో కచ్చితంగా ఉండాలని లబ్ధిదారులకు సరుకులు పంపిణీలో పారదర్శకంగా ఉండాలని, ప్రభుత్వ నియమాలు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పకుండా తీసుకుంటామని హెచ్చరించారు. సిఎస్‌డిటి కూర్మారావు, డీలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## సమస్యలు ఆలకిస్తూ.. ఆప్యాయంగా పలకరిస్తూ



కోటబొమ్మాళి, మార్చి 20 ప్రభాతవార్త : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిమ్మాడలోని క్యాంప్ కార్యాలయంలో నందిగాం, టెక్కలి మండ లాల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వినతులు మర్పించేందుకు వచ్చిన ప్రతి ఒక్కరిని మంత్రి ఆప్యాయంగా పలకరించి, వారు వివరించిన సమస్యలను శ్రద్ధగా ఆలకించారు. అనంతరం సంబంధిత అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేసి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కొంతమంది వృద్ధులు తమ పేదరిక పరిస్థితిని వివరించి, తమకు స్వంత ఇల్లు లేదని, ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి వెంటనే స్పందించి, అర్హతను పరిశీలించి ఇంటి స్థలం మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. అలాగే కొత్త పింఛన్లు మంజూరు చేయాలని కోరిన వారికి, ప్రభుత్వం త్వరలోనే ఆ ప్రక్రియను పూర్తి చేస్తుందని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ , కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనే కూటమి ధ్యేయం : ఎమ్మెల్యే



పాతపట్నం, మార్చి 20 ప్రభాత వార్త: కూటమి ప్రభుత్వం నిరుద్యో గులకు ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవింద రావు అన్నారు. శుక్రవారం నియోజక వర్గ కేంద్రంలో మీడియా సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాబోయే 20 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యంగా కార్యాచరణ చేపట్టినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 20 నెలల్లోనే 6,28,347 ఉద్యోగాలు కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. టీడీపీ పాలనలో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులతో 25 లక్షల ఉద్యోగ అవకాశాలు సృష్టించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్, పారిశ్రామిక వృద్ధి ద్వారా యువతకు విస్తృత అవకాశాలు కల్పిస్తున్నామని, జాబ్ క్యాలెండర్ ద్వారా ప్రతి సంవత్సరం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్య, పారిశ్రా మిక రంగాల్లో పెట్టుబడులు పెంపుతో యువతకు శిక్షణ, ఉపాధి అవకాశాలు పెరుగుతు న్నాయన్నారు. పర్లాకిమిడి శాసనసభ్యులు రూపేష్ కుమార్ పాణిగ్రహి, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## గ్రామస్థాయి సమస్యల పరిష్కారమే లక్ష్యం : జనసేన



పాతపట్నం, మార్చి 20 ప్రభాత వార్త: నియోజకవర్గ అభివృద్ధి, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే ధ్యేయంగా జనసేన అడుగులు వేస్తోందని ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. శుక్రవారం పాతపట్నం మండలం బొడ్డుమర్రి గ్రామంలో పలువురు జనసేన నాయకులు పర్యటించారు. బొడ్డుమర్రి గ్రామానికి చెందిన నీలాపు మాధవ్ భార్య అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకుని వారి నివాసానికి వెళ్లి ఆమెను పరామ ర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ పర్యటనలో గ్రామస్థులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వారు స్పందిస్తూ ఈ సమస్యలన్నింటినీ కూటమి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకువెళ్లి పరి ష్కారం అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. జనసేన ప్రోగ్రాం కమిటీ మెంబర్ మిత్తన ప్రసాద్, పాతపట్నం ఏఎంసీ డైరెక్టర్ రాము, సిరిపురం సందీప్, నవీన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

21vzm15:21vzm15.qxd 20-03-2026 23:37 Page 1



## చీపురుపల్లిలో పేదలకు ఉచిత అన్నదానం



చీపురుపల్లి, మార్చి 20, ప్రభాతవార్త : చీపురుపల్లి పట్నానికి చెందిన విశ్రాంత ఉద్యోగి కోసూరు సన్యాసిరావు (73) జయంతి సందర్భంగా శుక్రవారం నాడు చీపురుపల్లి పట్టణంలో వారి కుమారులు కుమార్తె కోసూరు ప్రసాద్, కోసూరు సుధాకర్, కుమార్తె శ్రీలక్ష్మి ఆర్టీసీ కాంప్లెక్స్, శివ కోవెల సమీపంలోని పేదలకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని పంపిణీ. వారి తండ్రి కోసూరు సన్యాసిరావు జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. ఇటీవల ఫిబ్రవరి 20న ఈ ఏడాది ఆయన మృతి చెందడంతో ఆయన జ్ఞాపకార్థం ఉచిత అన్నదాని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు వారి స్నేహితులు రాజాన లక్ష్మణరావు, గట్టు రవికుమార్ , తదితరులు పాల్గొన్నారు.

## నవోదయకు కౌముది విద్యార్థి ఎంపిక



శృంగవరపుకోట, మార్చి 20, ప్రభాతవార్త: కిల్తంపాలెం నవోదయలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఎస్.కోట కౌముది గ్లోబల్ స్కూల్ విద్యార్థి ఎంపికయ్యాడు.ఐదో తరగతి చదువుతున్న లోడా అభిషేక్ రాజ్ కుమార్ ఉత్తీర్ణత సాధించాడు.అభిషేక్ కుమార్ ఎంపిక పట్ల స్కూల్ ప్రిన్సిపాల్ శాంతి మోహంతి మాట్లాడుతూ ఉత్తమ శిక్షణ ప్రణాళిక బద్ధమైన విద్యతోనే విజయం సాధ్యమవుతుందని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థి అభిషేక్ కుమార్‌కు ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయులు విద్యార్థి తల్లి తండ్రులు అభినందనలు తెలిపారు.

## వెంకన్న ఆభరణాల తయారీకి రూ. 50 వేలు విరాళం



శృంగవరపుకోట,మార్చి20, ప్రభాతవార్త : ఎస్.కోట పుణ్యగిరి కొండ ప్రాంతంలో ఉన్న పుణ్యగిరి తిరుమల గిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆభరణాల తయారీ కోసం స్థానిక పడాల నాగబాబు కుమారుడు రవిబాబు జ్ఞాపకార్థం యాభై వేల రూపాయలు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సమక్షం లో అందజేశారు. విరాళాన్ని ఎమ్మెల్సీ రఘురాజు పెద్దలు పడాల మణిబాబు చేతుల మీదగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## తవ్వేసి... అలాగే వదిలేశారు



దత్తిరాజేరు, మార్చి 20, ప్రభాతవార్త: మండలం లోని గడసాం గ్రామంలో ఇంటింటి కొలాయి పైపు లైన్ను గడసాం మెయిన్ వీధిలో ఫైవ్ జి ఎయిర్టెల్ వారు పనులు చేపట్టడంలోభాగంగా కొళాయి పైపు లైన్ భూమిలోని కట్ చేయడంతో మెయిన్ వీధికి కొళాయి ద్వారా నీరు రావడం లేదని సర్పంచ్ తండ్రి వైసీపీ నాయకుడు నేతేటి వెంకటరమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవికాలంలో ప్రతి ఇంటింటికి నీరు ఎక్కువ అవసరం ఉంటుంది అన్నారు. నీరు కోసం మూగజీవులకు కూడా ఇబ్బందిగా ఉందన్నారు. తవ్వేసి పది రోజులు గడిచిన ఇప్పటికి ఎయిర్టెల్ అధికారులు స్పందించకపోవడం తాగునీరు కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు.

## కావూరికి ఘన నివాళి



కొమరాడ, మార్చి 20, ప్రభాతవార్త: ఆయిల్ పామ్ రైతుల అభివృద్ధికి విశేష కృషి చేసిన మహోన్నత వ్యక్తి మాజీ కేంద్ర మంత్రి స్వర్గీయ కావూరి సాంబశివరావుకు శ్రీ లక్ష్మి బాలాజీ ఆయిల్ పామ్ ఫార్మర్స్ అసోసియేషన్, అధ్యక్షుడు బోల్ల సత్యనారాయణ ,జనరల్ సెక్రెటరి ఎస్. శేఖర్ పాత్రుడు రైతులు ఘన నివాళి అర్పించారు. మాదలంగి గ్రామంలో శుక్రవారం కావూరి చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటిన్చారు. ఈ సందర్భంగా శేఖర్ పాత్రుడు మాట్లాడుతూ దేశంలో ఆయిల్ పామ్ పంట కు మద్దతు ధర అందించే విధంగా కృషి చేసి రైతులు ఆర్థికాభివృద్ధికి విశేష కృషి చేసిన వ్యక్తి కావూరి సాంబశివ రావు అని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

## చార్జ్ తీసుకున్న సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్



సాలూరు, మార్చి 20, ప్రభాతవార్త: సాలూరు పట్టణ పురపాలిక పాలకవర్గం గడువు ముగిసిపోవడంతో జిల్లా సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి ఛార్జ్ తీసుకున్నారు.అందులో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న సబ్ కలెక్టర్ కు కమీషనర్ టిటి రత్నకుమార్ బొకే అందజేసి ఆఫీస్‌లోకి సాదరంగా స్వాగతం పలికారు. అలాగే మున్సిపాల్టీ స్పెషల్ ఆఫీసర్ పాలనలోకి వెళ్లడంతో సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు.అనంతరం ఆయనకు మున్సిపల్ డీఇ ప్రసాద్,మేనేజర్ శివప్రసాద్ శానిటరీ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ ఏఇ అలేక్ కుమార్ అలాగే పట్టణ ఎమ్మార్వో ఎం.సురేష్ పుష్ప గుచ్చాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

## కలెక్టర్ చిన్న పిలుపు .. సమాజంలో పెద్ద మార్పు



పార్వతీపురం, మార్చి 20, ప్రభాతవార్త: కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి కేవలం ఒక పిలుపునిస్తే, అది ఒక సామాజిక ఉద్యమంగా మారింది. నేడు మన్యం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగి ఒంటరివాడు కాదు. అతనికి సహాయం చేయడానికి ఒక హెల్పింగ్ హ్యాండ్‌ఖీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. అధికార యంత్రాంగం, ప్రజలు చేతులు కలిపితే వ్యవస్థలో ఎంతటి సానుకూల మార్పు వస్తుందో చెప్పడానికి ఈ కార్యక్రమమే నిదర్శనం. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల్లో అధిక శాతం నిరక్షరాస్యులు, గిరిజనులు లేదా నిరుపేదలే ఉంటారు. ఆసుపత్రిలో ఏ విభాగానికి ఎటు వెళ్లాలో తెలియని అయోమయం వారిని మరింత కుంగదీస్తుంది. ఈ సమస్యను గుర్తించిన మన జిల్లా కలెక్టర్ రోగులకు భౌతికమైన చికిత్సతో పాటు మానసికమైన ధైర్యాన్ని, మార్గదర్శకత్వాన్ని అందించేందుకు ఖీమన్యం హెల్పింగ్ హాండ్స్ ఖీ అనే వినూత్న వాలంటీర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. రోగి ఆసుపత్రికి వచ్చిన క్షణం నుండి డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వెళ్లే వరకు వారి చేయి పట్టుకుని నడిపించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. కలెక్టర్ పిలుపు మేరకు జిల్లాలోని రిటైర్డ్ అధికారులు, ఉత్సాహవంతులైన విద్యార్థులు మరియు స్థానిక వ్యాపారస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు.

## యువత మత్తు జోలికి వెళ్లొద్దు



బొబ్బిలి, మార్చి 20, ప్రభాతవార్త యువత గంజాయి, తదితర మత్తు పదార్థాలు అలవాటు పడకుండా మల్లెంచడమే చిట్టిబాబు ప్రక్రియ అని బొబ్బిలి డిప్యూటీ సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ ఎస్ రాఘవులు అన్నారు. మండలంలో రంగరాయపురం గ్రామంలో రెండు రోజులు పాటు నిర్వహించు నియోజకవర్గం స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ కు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ముందుగా ఈ కార్యక్రమం చేయడం చాలా ఆనందంగా ఉందని అన్నారు యువతను మత్తు పదార్థాలకు చెడు వ్యసనాలకు లోన్ అవకుండా క్రీడల వైపు మళ్ళించే మార్గాన్ని ఆయన అభినందించారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం కు నాయకత్వ లక్షణాలకు దోహదపడుతుందన్నారు.కార్యక్రమంలో చిట్టిబాబు చేస్తున్న సేవలు అమోఘమని అభివర్ణించారు.

## వ్యాధి లక్షణాల నిర్ధారణ త్వరగా జరగాలి



పార్వతీపురం,మార్చి20, ప్రభాతవార్త: ఎన్.సి.డి, ఆర్.బి. ఎస్.కె సర్వే, స్క్రీనింగ్ లలో గుర్తించిన వ్యాధి లక్షణాల నిర్ధారణ త్వరగా జరిగేలా వైద్యాధికారులు కార్యాచరణ చేయాలని జిల్లా ఆర్.బి.ఎస్.కె అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు అన్నారు. నీలకంఠాపురం గ్రామంలో సంచార చికిత్సా శిబిరాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందులు, వైద్య పరీక్షలు పరిశీలించి, ఏ ఏ సమస్యలకు చికిత్స అందజేశారో రికార్డులో తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి. శ్రీకాంత్, వైద్య సిబ్బంది జె. జయలక్ష్మి, 104 సిబ్బంది ఉన్నారు.

## కొమరాడ గ్రామ సచివాలయం తనిఖీ



కొమరాడ, మార్చి 20, ప్రభాత వార్త : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉల్లాస్ అక్షరాంధ్ర కుటుంబ సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని కొమరాడ ఎంపీడీవో రమేష్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు, శుక్రవారం గుమ్మడ కొమరాడ గ్రామ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ సర్వేలను వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు అంతే కాకుండా హౌస్ టాక్స్ కలెక్షన్ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. అనంతరం డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు, కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రాధాకృష్ణ పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే జగదీశ్వరి



కురుపాం, మార్చి 20, ప్రభాతవార్త : రైతు అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పనిచేస్తుంది అని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం జియ్యమ్మవలస మండలం, కె.టి.వాడ పంచాయతీ, నీచుకువలసలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతన్నా.. మీకోసం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరింత లాభసాటిగా మార్చి రైతుల స్థితిగతులు మెరుగుపర్చేందుకు కూటమి ప్రభుత్వం పంచ సూత్రాలతో ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దొంకాడ రామకృష్ణ, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ కద్రక కళావతి, అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, ఎంపీపీ సురేష్ మండల కన్వీనర్ జోగి భుంజగరావు, మాజీ ఎమ్మెల్యే, జనసేన నాయకులు నిమ్మక జయరాజు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు దాసరి రామారావు, వట్టిగెడ్డ ప్రాజెక్ట్ చైర్మన్ సత్యం నాయుడు, నియోజకవర్గ రైతు అధ్యక్షులు గురాన శ్రీరామూర్తి నాయుడు, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, జనసేన నాయకులు వారణాసి శివ, వ్యవసాయ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## గ్యాస్ కొరతతో పండగ రోజుల్లో తప్పని తిప్పలు

కురుపాం, మార్చి20, ప్రభాతవార్త: పశ్చిమాసియో సంక్షోభం వెరసి ఇటీవలే గ్యాస్ ధరల పెంపుతో ఉగాది, రంజాన్ పండుగ రోజుల్లో నే ప్రజలు పస్తులు ఉండక తప్ప లేదని కురుపాం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ అడ్డాకుల చిన్నారావు ఆందోళన వెలిబుచ్చారు. శుక్రవారం గుమ్మ లక్ష్మీపురం లో విలేకరులతో మాట్లాడుతూ..ఓటిపితోనే గృహవసర సిలిండర్ల పంపిణీ, ఒకటిన్నర రోజుల్లోనే సిలిండర్ ఇంటికి చేరాలి అంటూ సీఎం చంద్రబాబు, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ సౌకర్యం కాన రావడంలేదని మండిపడ్డారు.

## మూటకూడులో తాగునీటి సమస్య పరిష్కరించండి : సీపీఎం



పాచిపెంట, మార్చి 20, ప్రభాతవార్త : గిరిజన గ్రామమైన మూటకూడులో వేసవికాలం మొదటలో తాగునీటి సమస్య ప్రారంభమైందనే సంబంధిత అధికారులు తక్షణమే త్రాగునీటి సమస్య పరిష్కరిం చాలని సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ గిరిజనులు మహిళలు తాగునీటి కోసం తీవ్రమైన కష్టాలు ఎదుర్కొంటున్నారని ముందుండి ముసళ్ళ పండగ ఇంకా వేసవిలో ఎన్ని కష్టాలు పడాలో తెలియని పరిస్థితి నెలకొందని ఇటువంటి పరిస్థితుల్లో ఆ గ్రామంలో బోర్ వేసి తాగునీటి సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు.

## త్వరలో ఎస్టీ కమిషన్ సభ్యుల రాక : ఎమ్మెల్సీ రఘురాజు



శృంగవరపుకోట,మార్చి20, ప్రభాతవార్త: మండలంలోని బొడ్డవర ప్రాంతంలో జిందాల్ భూదోపిడిపై నిగ్గు తేల్చేందుకు త్వరలో ఎస్టీ కమిషన్ సభ్యులు వస్తున్నారని రైతులకు మేలు జరుగుతుందని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు.శుక్రవారం బొడ్డవరలోని ఎమ్మెల్సీ నివాసంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈనెల 30వ తేదీన ఎస్టీ కమిషన్ సభ్యులు బొడ్డవర ప్రాంతానికి వస్తున్నారని జిందాల్ భూదోపిడిపై అన్ని విధాలుగా బహిరంగంగా విచారణ జరగనుందని తెలిపారు.జిందాల్ సంస్థ రైతులకు చేసిన అన్యాయంపై గత తొమ్మిది నెలలుగా పోరాటం చేస్తున్నారని ప్రభుత్వానికి స్థానిక ప్రజాప్రతినిధులకు జిల్లా కలెక్టర్ కు ఎన్నో సార్లు వినతిపత్రాలను అందజేశామని ఆయన స్పందన లేదన్నారు.ఈవిషయాన్ని డిల్లీలో ఉన్న ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు.దీంతో కమిషన్ స్పందించి బహిరంగ విచారణ చేపట్టేందుకు కమిషన్ సభ్యులు రానున్నారని ఆయన తెలిపారు.ఇక 12మంది బినామీలు ఉన్నారని వారిపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగడం వారి ఆస్తులను జప్తు చేస్తామనడం అన్యాయమన్నారు.ఇలా అయితే బినామీలను ఎలా సృష్టించారో రెవెన్యూ, జిందాల్ అధికారులపై ముందుగా చర్యలు తీసుకోవాలని వారి ఆస్తులను జప్తు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.త్వరలో రైతులకు మేలు జరుగుతుందని ఎమ్మెల్సీ ఆశాభావం వ్యక్తం చేశారు.

## మ్యాపులు తయారు చేయాలి

వేపాడ, మార్చి20, ప్రభాతవార్త: ప్రతి గ్రామానికి సమగ్ర సమాచారం అందుబాటులో ఉండే విధంగా మ్యాపులను తయారు చేయాలని మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ ఆదేశించారు. శుక్రవారం వేపాడ మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు , గ్రామ సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా గణన 2027లో భాగంగా గ్రామ మ్యాపుల తయారీపై దిశా నిర్దేశం చేశారు. గ్రామాల్లో బంగారు కుటుంబాలు ,మార్గదర్శకులను గుర్తించి, వారితో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయడంలో పంచాయతీ కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలని సూచించారు.వేసవి కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో, పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని త్రాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. మండలంలోని వసతి గృహాల్లో ఉన్న సమస్యలను గుర్తించి, వెంటనే మండల స్థాయి అధికారులకు తెలియజేసి పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ జె రాములమ్మ, డిప్యూటీ తాసిల్దార్ ఎం రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో శైలజ, తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే

కురుపాం, మార్చి20, ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వము అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్ద పేట వేసిందని ఇది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని నిరూపించిందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు శుక్రవారం రాష్ట్ర విప్ తోయక జగదీశ్వరి స్థానిక జామియా మశీదు లో పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు రాష్ట్ర విప్ తోయక జగదీశ్వరి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మతగురువు దిల్ అహ్మద్ ప్రత్యేక రంజాన్ ఉపవాస దీక్ష ప్రార్థన చేపట్టారు. అనంతరం విప్ జగదీశ్వరి ముస్లిం మహిళలు కు పండ్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిరుపేద మహిళలు ,పురుషులకు నిత్యవసర సరుకులు బట్టలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మతపెద్దలు ,ఎఎంసి చైర్మన్ కె.కళావతి ,మాజీ సమితి అధ్యక్షులు వి.భారతీ ,రాష్ట్ర తెలుగు యువత ప్రతినిధి కోలా రంజిత్ కుమార్ ,మాజీ ఎఎంసి వైస్ చైర్మన్ షేక్ షాదుల్లా భాషా ,యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌష్ ,మండల కన్వీనర్ కెవికొండయ్య ,షేక్ బకారి ,ఫిరోజ్ ,షేక్ అజాదుద్దీన్ ,తెలుగు దేశం పార్టి నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోడ కూలి బాలుడి మృతి

కొమరాడ, మార్చి 20, ప్రభాతవార్త : అర్తం గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో బిడ్డిక హేమంత్ (9) పై బాత్రూం గోడ పడి మృతి చెందాడు. ఇందుకు సంబంధించి ఎస్సై జగదీశ్ నాయుడు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. హేమంత్ తన ఇంటి వద్ద ఆడుకుంటూ ఉండగా ప్రమాదవశాత్తు బాత్రూం గోడ విరిగి పడటంతో తలకు బలమైన గాయం కగా తల్లిదండ్రులు వెంటనే పార్వతీపురం ఆసుపత్రికి తీసుకుని వెళ్లరు.అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మృతిని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



కురుపాం, మార్చి 20, ప్రభాతవార్త: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కురుపాం సబ్ ఇన్స్పెక్టర్ పి నారాయణ రావు అన్నారు. శుక్రవారం స్థానిక గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహంలో పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా మత్తు పానీయాలకు పదార్థాలకు దూరంగా ఉండాలని అలాగే ఇటీవల జరుగుతున్న సైబర్ నేరాలు పై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గణేశ్వర రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉగాది పురస్కారంతో వడ్రంగికి సత్కారం



గరివిడి, మార్చి20, ప్రభాతవార్త: గరివిడికి చెందిన ప్రముఖ సమాజ సేవకులు వాండ్రంగి వెంకటేష్ కు శిష్ట కరణ సేవా సంఘ నాయకులు పరాభవ ఉగాది సందర్భంగా ఉగాది పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. శిష్ట కరణ సంఘ రాష్ట్ర అధ్యక్షులు పోలు మహంతి ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులు బగ్గాము సుధాకర్ పట్నాయక్ ,జిల్లా అధ్యక్షుడు ఎం పి గౌరీ శ్వర రావు, ప్రధాన కార్యదర్శి రేగ సురేష్ ప్రభృతులు వెంకటేష్ కు దుస్సాలువతో సత్కరించి ఆయన సేవలను కీర్తించారు.చీపురుపల్లి నియోజకవర్గ శిష్ట కరణ సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని వాండ్రంగి సేవాగుణాన్ని అభినందించారు.

## ‘ఉగాది కానుకగా జాబ్ క్యాలెండర్’



గరుగుబిల్లి, మార్చి 20, ప్రభాతవార్త : ఉగాది కానుకగా జాబ్ క్యాలెండర్ ప్రకటించి యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని ప్రభుత్వ విప్, కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి తోయక జగదీశ్వరి గారు తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ యువతకు భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని, ఇప్పటికే 20 నెలల్లోనే 6,28,347 ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు పేర్కొన్నారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
వార్త



## రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం : సువ్వాడ



నెల్లిమర్ల, మార్చి 20, ప్రభాతవార్త : రైతుల సంక్షేమానికి తమ కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తున్నదని టిడిపి సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజక వర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. టెక్కలి, చంద్రం పేట గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రైతన్నా మీ కోసం కార్యక్రమానికి రవిశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువీధుల పర్యటించి రైతులతో మాట్లాడారు. బ్రోచర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యదర్శి గేదెల రాజారావు, నెల్లిమర్ల నగర్ పంచాయతీ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు లెంక అప్పలనాయుడు, అవనాపు సత్యనారాయణ, పార్టీ ఎస్ సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, టిడిపి అధికార ప్రతినిధి తాడి సత్యనారాయణ, మండల తెలుగు యువత అధ్యక్షుడు నల్లం శ్రీనివాసరావు, టెక్కలి సర్పంచ్ నేతేటి స్వామి నాయుడు, తాళ్లపూడి సన్యాసప్పుడు, వాళ్లే నాగేశ్వరరావు, టెక్కలి గ్రామ పార్టీ నాయకులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

## నూకాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



పాచిపెంట, మార్చి 20, ప్రభాతవార్త: పాచిపెంట పూర్వ ప్రజలు ఆరాధ్య దైవమైన నూకాలమ్మ దేవత ఆలయంలో భక్తులు పోటెత్తారు ,దేవతను దర్శించుకొని తీర్థప్రసాదములు స్వీకరించారు. మూడు రోజులు ఘనంగా జాతర నిర్వహించారు. ఈ జాతర కొత్త అమావాస్య బుధవారం నుండి శుక్రవారం వరకు నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆలయం వద్ద రెండు రోజులు లేదా మూడు రోజులు జాతర నిర్వాహకులు జరుపుతారు. పాచిపెంట గ్రామం ఆడపిల్ల నూకాలమ్మ కావడంతో మహిమ గల దేవత నూకాలమ్మ కావడంతో నిత్యము ఆలయకు భక్తులు దేవతలు దర్శించుకుం టారు. ఆలయ పూజారులు నియమనిష్టలతో దేవతకి ధూపదీప నైవేద్య ఏర్పాటుచేసి పూజలు చేస్తారు.

## పైడి తల్లమ్మవారి కరుణ ప్రజలందరిపై ఉండాలి



చీపురుపల్లి, మార్చి 20, ప్రభాతవార్త. చీపురుపల్లి రైల్వే కాలనీలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ పైడితల్లి అమ్మవారి కరుణ దీవెనలు ప్రజలందరి పైన ఉండాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు వలే రెడ్డి శ్రీనివాస్ నాయుడు కోరారు. రైల్వే కాలనీ లో వెలిసియున్న పైడితల్లి అమ్మవారి 28 వ జాతర మహోత్సవం సందర్భంగా నిర్వాహకులు ఆహ్వానం మేరకు అమ్మవారిని శుక్రవారం నాడు దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి జడ్పీటీసీ ప్రతినిధి మరియు విజయనగరం జిల్లా వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగం అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అతనితో పాటు వైస్సార్సీపీ నాయకులు గవిడి సురేష్, ప్రభాత్ కుమార్,పతివాడ అఖిల్, దబ్బాడ ఆనంద్, వెంకీ, రాంకి తో కలిసి అమ్మవారికి ఆలయ అర్చకులుతో ప్రత్యేక పూజలు చేసిన అంతర ఆలయ కమిటీ వారు కందువా వేసి సత్కరించారు, అమ్మవారి ప్రసాదం అందజేశారు.

## జనగణనకు సన్నద్ధం కావాలి



నెల్లిమర్ల, మార్చి 20, ప్రభాతవార్త : జనగణన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సన్నద్ధులు కావాలని తహసిల్దార్ కే. శ్రీకాంత్, ఎంపీడీవో కే రామకృష్ణ రాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం వీఆర్వోలకు, పంచాయతీ కార్యదర్శులకు, గ్రామ సర్వేయర్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. త్వరలో ప్రారంభం కానున్న జనగణనకు ఉద్యోగులు సన్నద్ధులై పక్కాగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామంలో ఉన్న ఇల్లు, ఆ ఇళ్లల్లో ఉన్న కుటుంబాలు, కుటుంబ సభ్యులు, కులాల వివరాలతో సైతం సర్వే పక్కాగా నిర్వహించాల్సి ఉంటుందని వారు సూచించారు. కార్యక్రమంలో తహసిల్దారు, ఎంపీడీవోలతో పాటు ఇన్చార్జ్ డిప్యూటీ తాసిల్దార్ సత్యనారాయణ, మండల సర్వేయర్ , పంచాయతీ కార్యదర్శిలు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

## దొరకని గ్యాస్‌తో చిరువ్యాపారుల్లో ఆందోళన

గరివిడి, మార్చి20, ప్రభాతవార్త : వంట గ్యాస్ సిలెండర్లు ఆశించిన స్థాయిలో లభించక పోవడంతో చిల్లర వ్యాపారుల్లో ఆందోళన మొదలైంది. గ్యాస్ ఆధారిత వంటకాలు ద్వారా వ్యాపారాలు చేసుకొనే చిల్లర వర్తకులు గ్యాస్ లభించని స్థితిలో తీవ్ర వేదనకు లోనవుతున్నారు. గ్యాస్ లభించని స్థితిలో ఏ విదంగా టిఫిన్, ఇతర వంట కాలు అమ్మకాలు చేపడతామని వారు కలవర పడుతున్నారు. టిఫిన్ ,ఇతర తినుబండారాలు అమ్ముకొని జీవనాన్ని సాగించే మా బతుకులు పరిస్థితి అయోమయంలో పడ్డాయని వారు తీవ్ర నిరాశ లో ఉన్నారు. ఇంటికి లభించే గ్యాస్ ని బ్లాకు లో కొనుగోలు చేస్తూ టిఫిన్ సెంటర్ లు నడపితే మా వ్యాపారాలు సాగవని వారు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. బ్లాక్ లో గ్యాస్ కూడా దొరకని స్థితిలో మా బతుకులు వీధిన పడే పరిస్థితి ఏర్పడిందని చిరు వ్యాపారులు ఆందోళన తో ఉన్నారు. ప్రభుత్వం చిరు వ్యాపారులకు గ్యాస్ సిలిండర్ లు అందించేందుకు చర్యలు చేపట్టి, మా బతుకులు నిలబెట్టాలని వారు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## జనగణనపై అవగాహన సదస్సు



లక్కవరపుకోట, మార్చి 20, ప్రభాత వార్త : మండలంలో ప్రభుత్వ ఆదేశాలు మేరకు 202627 ఏడాదికి జనాభా గణన నిర్వహించెందుకు గాను ముందస్తుగా ఎన్యూమిరేషన్ బ్లాక్ విభజన పై అవగాహనా సదస్సు ఎంపీడీఓ ఆఫీస్ సమావేశ మందిరంలో తహసీల్దార్ టీ రమేష్ ఆధ్వర్యంలో మండలం లోని అన్ని గ్రామాల సచివాలయం అలాగే పంచాయతీ అధికారులతో ఏ ఎస్ ఓ కృష్ణ శుక్రవారం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా అయన ప్రతి గ్రామం లో గల 200 ఇళ్లను ఒక బ్లాక్ గా విభజించి ఆయా బ్లాక్ లో సుమారు 800 మంది కి మించకుండా ఉండేలా జనగణన కి బ్లాక్ వైస్ లిస్టు లు తయారు చేసి సిద్ధంగా ఏ విదంగా ఉంచాలో వివరించారు ఈ విదంగా ఎన్యూమరేషన్ బ్లాక్ లు సిద్ధం అయ్యాక ప్రభుత్వం నియమించిన ఏనుమరేటర్ లు జనగణన నిర్వహించడం జరుగుతుంది అని వివరించారు 2011 లో జనగనన జరిగింది ఇప్పుడు 15 ఎల్లకి మళ్ళీ జనాభా లెక్కలు తయారు చేయనున్నారు ఈ సారి కులం వారి జనగణన చేయనున్నట్లు అధికారులు తెలుపుతున్నారు అంటే ప్రతి ఒక్కరి కులం సేకరించి జనాభా లెక్కల్లో పొందు పర్చడము ద్వారా కచ్చితమైన రాజకీయ అలాగే ఇతర రిజర్వేషన్లు ఆయా కులాలు వారికీ అమలు చేసే వీలు ఉంటుంది అనేది ప్రభుత్వం ఆలోచన గా భావించాలి. తహసీల్దార్ టీ రమేష్ డిప్యూటీ ఎంపీడీఓ కుమార్ ఆర్ ఐ సన్యాసి రావు అన్ని గ్రామాల పంచాయతీ సెక్రటరీ లు వి ఆర్ ఓ లు ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

### వైసీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



విజయనగరం, మార్చి 20, ప్రభాత వార్త : ఆధ్యాత్మిక చింతన, త్యాగం మానవత్వానికి ప్రతీకగా నిలిచే రంజాన్ పండగ ప్రజలందరి లోనూ వెలుగులు నింపాలని జెడ్పీ ఛైర్పర్సన్, ఉమ్మడి జిల్లా వైసీపీ అధ్యక్షులు, భీమిలి ఇంచార్జ్ మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) ఆకాంక్షించారు. శనివారం ఘనంగా జరుపుకునే పవిత్ర రంజాన్ పర్వ దినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ముస్లిం సోదర సోదరీమణులందరికీ చిన్న శ్రీను హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ విశిష్టతను వెల్లడి చేస్తూ చిన్న శ్రీను శుక్రవారం ఒక ప్రకటనలో ముస్లిం సోదరుల పట్ల తన ఆత్మీయతను వెల్లబుచ్చారు. ఆధ్యాత్మిక భక్తి, క్రమశిక్షణ, దానగుణం, సోదరభావానికి రంజాన్ పండుగ గొప్ప ప్రతీక అని కొనియాడారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు ఆచరించి, అల్లాహ్(భగవంతుని) కృపకు పాత్రులైన ముస్లిం సోదరులందరి జీవితాల్లో ఈ పండుగ వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు. పేదలకు చేసే సహాయమే ఈ పండుగలోని అసలైన పరమార్థమని, మానవత్వమే మతమని చాటి చెప్పే గొప్ప పండుగ రంజాన్ అని ఆయన పేర్కొన్నారు. అల్లాహ్(భగవంతుని) దయ అందరిపైనా ఉండాలని, జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజల్లో మత సామరస్యత మరింత పటిష్టం కావాలని కోరుకుంటున్నట్లు చిన్న శ్రీను తన సందేశంలో తెలిపారు.

21-3pg10.qxd:21-3pg10.qxd 1/1/02 6:34 AM Page 1



# కివీస్ జట్ల జోరు

## సౌతాఫ్రికాపై అబ్బాయిల దారిలో అమ్మాయిలు





**అక్లాండ్:** సౌతాఫ్రికాతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 137 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కివీస్ జట్టు 16.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఓపెనర్లు డెవాన్ కాన్వే(26 బంతుల్లో 39), టామ్ లాథమ్ (55 బంతుల్లో 63 నాటౌట్) మొదటి వికెట్ కు 96 పరుగుల ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చారు. ఇద్దరూ సౌతాఫ్రికా బౌలర్లపై సిక్స్‌లు, బౌండరీలతో విరుచుకుపడుతే వేగంగా స్కోరు పెంచారు. ఓవర్‌కు 9పరుగుల సగటు సాధించారు. 11 ఓవర్లలోనే 96 పరుగులకు చేర్చారు. శతకం భాగ స్వామ్యం వైపు దూసుకెళ్తున్న ఈ జోడీని కేశవ్ మహారాజ్ విడదీశాడు. ఆ ఓవర్ చివరి బంతికి డెవాన్ కాన్వేను స్పిన్నర్ కేశవ్ మహారాజ్ అవుట్ చేశాడు. అయినా ఓపెనర్ టామ్ లాథమ్ జోరు అలాగే కొనసాగింది. 45 బంతు ల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. టిమ్ రాబిన్సన్(17), నిక్ కెల్లీ(1) అండగా న్యూజిలాండ్‌కు మరో 22 బంతులుండగానే ఘన విజయాన్ని అందించాడు.

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. ప్రొటీస్ బ్యాటర్లలో టెయిలెండర్ కొబాని మొకినా (26 నాటౌట్) టాప్ స్కోరర్‌గా నిలవగా, జార్జ్ లిండే (23) పర్వాలేదనిపించాడు. సౌతాఫ్రికా టాపార్డర్, మిడిలార్డర్‌ను కివీస్ బౌలర్లు కుప్పకూల్చారు. దీంతో సఫారీలు స్వల్ప స్కోరుకే పరిమితమయ్యారు. కివీస్ బౌలర్లలో కైల్ జేమీ సన్, మిచెల్ సాంట్నర్, బెన్ సియర్స్ తలా 2 వికెట్లు పడగొట్టారు. పొదుపుగా బౌలింగ్ చేసిన లోకీ ఫెర్గూసన్‌ను ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దక్కింది. ఈ మ్యాచ్ విజయంతో న్యూజిలాండ్ ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 2–1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఇరుజట్ల మధ్య నాలుగో టీ20 మ్యాచ్ ఆదివారం వెల్లింగ్టన్‌లో జరగనుంది.

**అక్లాండ్:** మహిళల క్రికెట్‌లోనూ ఫలితం పునరావృతమైంది. మూడో టీ20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ విమెన్ టీమ్ ఆరు వికెట్ల తేడాతో సౌతాఫ్రికాపై ఘన విజయం అందుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా విమెన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 149 రన్స్ చేసింది. ఓపెనర్లు సునె లూస్(3), టెంజ్‌మిన్ బ్రిట్స్(0) నిరాశపరిచాడు. 9 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన సౌతాఫ్రికాను కెప్టెన్ కెప్టెన్ వోల్‌వార్డ్(37) ఆదుకునే ప్రయత్నం చేశారు. అన్నెరీ డెర్క్‌సెన్(27)తో కలిసి జట్టు స్కోరు 60 పరుగులు దాటించారు. ఈ దశలో కివీస్ బౌలర్లు విజృంభించడంతో సౌతాఫ్రికా వేగంగా వికెట్లు కోల్పోయింది. టెయిలెండర్ రైనెక్(34 నాటౌట్) దాటిగా ఆడడంతో సౌతాఫ్రికా గౌరవప్రదమైన స్కోరుకు చేరుకుంది. కివీస్ విమెన్ బౌలర్లలో సోఫీ డివైన్, సుజీ బేట్స్ రెండేసి వికెట్లు పడగొట్టారు.

అనంతరం ఈ లక్ష్యాన్ని కివీస్ విమెన్స్ తడబడుతూ ఆరంభించినా చివరకు నాలుగు వికెట్లు కోల్పోయి 18.4 ఓవర్లలోనే ఛేదించింది. బౌలింగ్‌లో రాణించిన సోఫీ డివైన్ బ్యాటింగ్‌లో రాణిస్తూ అర్ధసెంచరీతో అజేయంగా నిలిచింది. మిగతా వారిలో కెప్టెన్ అమెలియా కెర్(30) రాణించారు. చివర్లో మాడీ గ్రీన్(34నాటౌట్) ధాటిగా ఆడి 25 బంతుల్లోనే వేగంగా 34 పరుగులు చేయడంతో కివీస్ మరో 8 బంతులుండగానే విజయం అందుకుంది. ఈ విజయంతో న్యూజిలాండ్ విమెన్స్ 5 మ్యాచ్‌ల సిరీస్‌లో 2–1తో ఆధిక్యంలో నిలిచింది.

# తన్వీ సంచలనం

## ఓర్లీన్స్ సెమీస్‌లోకి దూసుకెళ్లిన యువ షట్లర్



**ఫ్రాన్స్:** ఓర్లీన్స్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ తన్వీ శర్మ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మహిళల సింగిల్స్ కార్వర్ ఫైనల్లో జపాన్‌కు చెందిన ఆరో సీడ్ నట్సుకిపై సంచలనంవిజయం సాధించింది. కేవలం 43 నిమిషాల్లోనే 21–14, 21–14 తో వరుస సెట్లలో తన్వీ శర్మ గెలుపొందింది. వరల్డ్ ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం 38వ ర్యాంకులో ఉన్న తన్వీ శర్మ... ఈ టోర్నీలో ఆరంభం నుంచి చక్కని ఆటతీరును ప్రదర్శిస్తోంది. అదే జోరును క్వార్టర్ ఫైనల్లోనూ చూపిన తన్వీ శర్మ రెండు సెట్లలోనూ జపాన్ ప్రత్యర్థిని పుంజుకునే అవకాశం ఇవ్వకుండా బలమైన స్మాష్‌లతో ఉక్కిరిబిక్కిరి చేసింది. మరో మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో మాల్వికా బన్సొద్.. భారత్‌కే చెందిన సహచరిణి ఇషారాణితో తలపడనుంది. ఎవరూ గెలిచినా భారత్‌కు మరో సెమీఫైనల్ బెర్త్ దక్కనుంది.

కాగా పురుషుల డబుల్స్‌లో భారత జోడీ అర్జున్ రామచంద్రన్, హరిహరన్.. క్వార్టర్ ఫైనల్లోనే పోరాడి ఓడారు. భారత జోడీపై ఇండోనేషియా జోడీ మౌలానా, లియో కార్నండో 21–12, 22–20తో గెలుపొంది సెమీఫైనల్లో ప్రవేశించారు. భారత జోడీ తొలి సెట్‌లో పేవల ప్రదర్శన ఇచ్చినా... రెండో సెట్‌లో పుంజుకుంది. నువ్వానేనా అన్నట్లుగా పాయింట్లు రాబట్టారు. ఓ దశలో ఆధిక్యం చాటినా... చివరి కొచ్చేసరికి ఒత్తిడికి గురై సెట్, మ్యాచ్ చేజార్చుకుంది. దీంతో పురుషుల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో భారత షట్లర్ల పోరు ముగిసింది.

# విండీస్ టూర్ విజయంతో స్టార్ట్

## తొలి టీ20లో ఆసీస్ విజయం

**కింగ్స్‌టన్:** వెసిండీస్ పర్యటనను ఆస్ట్రేలియా విమెన్ జట్టు గెలుపుతో ప్రారంభించింది. తొలి టీ20మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను దాని సొంతగడ్డపై 43 పరుగుల తేడాతో ఓడించింది. వికెట్ కీపర్ కమ్ బ్యాట్స్‌విమెన్ బెత్‌మూనీ సూపర్ హాఫ్ సెంచరీతో మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా విమెన్స్ 20 ఓవర్లలో 6వికెట్లకు 164 పరుగులు చేసింది. జార్జియా వోల్(8), లిట్చ్‌ఫీల్డ్ (6) రూపంలో ఆస్ట్రేలియా తొందరగానే రెండువికెట్లు కోల్పోయింది. మరో ఎండ్‌లో దూకుడుగా ఆడిన బెత్ మూనా(79)...ఎలైస్ పెర్రీ(36) అండగా మూడో వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యాన్ని అందించింది. ఈ క్రమంలో బెత్ మూనీ 55 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 79 రన్స్ సాధించింది. పెర్రీ 32 బంతుల్లో 36 రన్స్ చేసింది. మిగతా బ్యాట్స్‌విమెన్ నిరాశపరిచారు. విండీస్ బౌలర్లలో డీన్‌డ్రా డొట్టిన్ మూడు వికెట్లు, చిన్నెల్లీ హెన్రీ రెండు వికెట్లు తీశారు. అనంతరం వెస్టిండీస్‌ను 121 పరుగులకే ఆస్ట్రేలియా బౌలర్లు పరిమితం చేశారు. విండీస్ జట్టులో ఓపెనర్ క్వియానా జోసెఫ్ (45) టాప్ స్కోరర్‌గా నిలిచింది. 39 బంతుల్లో 7 ఫోర్లతో 45 రన్స్ చేసింది. మిగతా వారిలో స్టాఫీన్ టేలర్ 38 రన్స్ సాధించింది. ఆస్ట్రేలియా బౌలర్లలో అలనా కింగ్ మూడు వికెట్లు పడగొట్టింది.




# మార్పేది లేదు

## ఫిఫా స్పష్టీకరణ



**న్యూయార్క్:** ఇరాన్‌కు అంతర్జాతీయ ఫుట్‌బాల్ ఫెడరేషన్ షాకిచ్చింది. ఫిఫా ప్రపంచకప్‌లో తమ మ్యాచ్‌లను అమెరికా నుంచి మెక్సికోకు తరలించాలని ఇరాన్ చేసిన విజ్ఞప్తిని ఫిఫా తోసిపుచ్చింది. ఇప్పటికే మ్యాచ్ వేదికలను సిద్ధం చేశామని, షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు చేయడం లేదని ఫిఫా అధ్యక్షుడు గియాన్ని ఇన్ఫాంటియానో వెల్లడించారు. ఇరాన్ అభ్యర్థన సహా పలు అంశాలను పరిశీలించడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫిఫా పాలకమండలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు గియాన్ని వెల్లడించారు. గత డిసెంబర్‌లోనే ఫిఫా మ్యాచ్‌లకు సంబంధించి పూర్తి షెడ్యూల్ విడుదల చేసినందున, ఇప్పటికిప్పుడు ఇరాన్ మ్యాచ్ వేదికలను మార్చలేమన్నారు. అమెరికా, కెనెడా, మెక్సికోలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఫిఫా ప్రపంచకప్ జూన్ 11న ప్రారంభమై జూలై 19 వరకు కొనసాగనుంది. గ్రూప్‌జిలో ఉన్న ఇరాన్.. బెల్జియం, న్యూజిలాండ్, ఈజిప్ట్‌లతో మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది.

అయితే ఇరాన్ తన మూడు మ్యాచ్‌లను అమెరికాలోనే ఆడాల్సి ఉండగా.. లాస్‌ఏంజిల్స్ వేదికగా రెండు, మరో మ్యాచ్‌ను సియాటెల్‌లో ఆడాల్సి ఉంది. అమెరికాతో యుద్ధం నేపథ్యంలో ఇరాన్ తమ లీగ్ మ్యాచ్‌లను అమెరికా నుంచి మెక్సికోకు తరలించాలని అంతర్జాతీయ ఫుట్‌బాల్ ఫెడరేషన్‌కు విజ్ఞప్తి చేసింది. తాజాగా ఫిఫా నిర్ణయం ఇరాన్‌ను చిక్కుల్లో పడేసినట్లయింది.

### ఇండియన్ సూపర్ లీగ్ ఫుట్‌బాల్

# నార్త్ ఈస్ట్‌కు ఒడిశా షాక్

**గౌహతి:** ఇండియన్ సూపర్ లీగ్ ఫుట్‌బాల్‌లో ఒడిషా గెలుపు బోణీ చేసింది. సొంతగడ్డపై శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో 4–1 గోల్స్‌తో నార్త్ ఈస్ట్ యునైటెడ్ క్లబ్‌కు షాకిచ్చింది. రాహుల్ ఆరో నిమిషంలో చేసిన గోల్ తో ఒడిషా జట్టు 1–0 ఆధిక్యం చాటింది. అయితే మకర్టన్ పదో నిమిషంలో చేసిన గోల్‌తో నార్త్ ఈస్ట్ యునైటడ్ 1–1తో సమవుజ్జీగా నిలిపాడు. ఆతర్వాత నుంచి ఒడిషాఆధిక్యం చివరి వరకు కొనసాగింది. ఒడిషాకు 25వ నిమిషంలో శుభం, 65వ నిమిషంలో రాహుల్ గోల్స్ అందించారు. 68వ నిమిషంలో మకర్టన్ సెల్ఫ్‌గోల్‌తో ఒడిషా ఖాతాలో మరో గోల్ చేరింది. ఒడిషాకు నాలుగు మ్యాచ్‌ల్లో ఇది తొలి విజయం.

ఇండియన్ సూపర్ లీగ్‌లో మొత్తం 14 జట్లు తలపడుతున్నాయి. సింగిల్ లెగ్ రౌండ్ రాబిన్ పద్ధతిలో ఒక్కో జట్టు 13 మ్యాచ్‌లు ఆడుతుంది. మే 17 వరకు జరిగే ఈ టోర్నీలో మొత్తం 91 మ్యాచ్‌లు జరుగుతాయి. టాప్ క్లబ్ జట్లు మోహన్ బగాన్, జంషెడ్‌పూర్ నాలుగు గేసి విజయాలతో అగ్రస్థానంలో ఉన్నాయి. ముంబై సిటీ 4 విజయాలు, రెండు డ్రాలతో కొనసాగుతోంది.




# వారాంతంలో లాభాలతో సెన్సెక్స్, నిఫ్టీ

## ఐటి, పిఎస్‌యు బ్యాంక్స్ మద్దతు



**ముంబయి, మార్చి 20:** రెండురోజుల నష్టాల నుంచి వారాంతంలో మార్కెట్లు కొంత కోలుకున్నాయి. ముడిచమురుధరలు సడలింపులు, మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలు తగ్గవచ్చన్న అంచనాలతో దిగువస్థాయిలో కొంతమేర కొనుగోళ్లు జరిగాయి. ఎంపిక చేసినసెక్టార్లలో అంటే ఐటి, పిఎస్‌యు బ్యాంక్స్ వంటివి లాభాల్లోముగిసాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు మాత్రం ఒత్తిడిలోనే కొనసాగింది. అయినా కూడా విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాల బాట వీడలేదు. అమెరికా బాండ్ల రాబడులు, రూపాయి క్షీణత వంటివికూడా కీలకం అయ్యాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 325.72పాయింట్లు లాభపడి 74,532.96 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ కూడా 112.35పాయింట్లు పెరిగి 23,114.50 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్150 సూచీ 0.66 శాతం, బిఎస్‌ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.47 శాతం పెరిగాయి. మార్కెట్ల పరంగా కొంత సానుకూలంగానే ముగిసాయి.

బిఎస్‌ఇలో 2458 షేర్లుపెరిగితే 1804 కంపెనీలషేర్లు క్షీణించాయి. 170 కంపెనీల షేర్లు స్థిరంగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్పిడి మార్కెట్‌లో భారత్ రూపాయి ఆల్‌టైమ్ కనిష్టానికి చేరింది. 93.7150వద్ద కదలాడింది. అంతకుముందు 92.89 నుంచి మరింతగా క్షీణించింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్ సెటిల్‌మెంట్‌కు సంబంధించి 1.23 శాతంగా ఉంది. రూ.1,46,705గా నమోదయింది. అమెరికాపదేళ్ల బాండ్ల రాబడులు 0.40 శాతంపెరిగి 4.3శాతంగా నమోదయింది. కమోడిటీస్ మార్కెట్‌పరంగా బ్రెంట్ ముడిచమురు మేనెల సెటిల్‌మెంట్‌కు సంబంధించి 1.47 డాలర్లుపెరిగి 110.12 డాలర్లుగా నమోదయింది. ఇక వాల్‌స్ట్రీట్ మార్కెట్లలో డౌజోన్స్‌ఫ్యూచర్స్ 200 పాయింట్లు క్షీణించింది. యూరోపియన్ షేర్లు శుక్రవారం ఇన్వెస్టర్లు అప్రమత్తంగా కొనసాగినట్లు కనిపిస్తోంది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ కీలకరేట్లు స్థిరంగానే కొనసాగించింది. స్విస్ నేషనల్ బ్యాంకు, స్వీడన్ రిసక్స్ బ్యాకులు కూడా స్థిరంగా వడ్డీ రేట్లు కొనసాగించాయి. ఇక ఆసియా మార్కెట్లుకూడా దిగువ స్థాయిలోనే ముగిసాయి.

మధ్య ప్రాచ్యం లోనియుద్ధ ఉద్రిక్తతలు ఎక్కువ ఒత్తిడి తెచ్చాయి. జపాన్‌మార్కెట్లు పబ్లిక్ హాలిడే కావడంతోమూతపడ్డాయి. చైనా పీపుల్స్‌బ్యాంక్ వడ్డీరేట్లను స్థిరంగా కొనసాగించింది. ఇక వాల్‌స్ట్రీట్‌లో డౌజోన్స్ పారిశ్రామిక సగటు 0.44 శాతం, ఎస్అండ్‌పి 5000.27శాతం నాస్‌డాక్ కాంపోజిట్‌కూడా 0.28శాతం చొప్పున క్షీణించాయి. ఇక దేశీయ మార్కెట్లపరంగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 2.41శాతం క్షీణించింది. హ్యాపియెస్ట్ మైండ్స్ టెక్నాలజీస్ 10.70శాతం పెరిగింది. భారతీయ స్టేట్‌బ్యాంకు 0.90శాతం పెరిగింది. టిసిఎస్ షేర్లు 1.44శాతం, టాటాపవర్ కంపెనీ 1.07శాతం, నాట్కో ఫార్మా 2.92శాతం, ఎన్టీపీసి 1.89శాతం, విఎ టెక్ వాబాగ్ 2.91 శాతం చొప్పున పెరిగాయి. పిఎన్ గాడ్గిల్ జ్యూయెలర్స్ 0.81శాతం లాభపడ్డాయి.



# 8 పారిశ్రామిక రంగాల వృద్ధి 2.3%

**న్యూఢిల్లీ, మార్చి 20:** భారత్ ఎనిమిది కీలకరంగాల సమిష్టి వృద్ధి ఫిబ్రవరిలో 2.3శాతంగా నమోదయింది. అంతకుముందు నెలలో నాలుగుశాతం నుంచి గణనీయంగా దిగజారింది. కేంద్ర వాణిజ్యమంత్రిత్వశాఖ కీలకరంగాల వృద్ధి గణాంకాలను శుక్రవారం ఇదుదలచేసింది. ముడిచమురు ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. 5.2శాతంగా ఉంది. ఏప్రిల్‌నుంచి ఫిబ్రవరకూ చూస్తే 2.5శాతం క్షీణించింది. సిమెంట్ ఉత్పత్తి మాత్రం గణనీయంగాపెరిగింది. 9.3శాతంగా ఉంది. అయితేఅంతకుముందునెలలో 11.3శాతంగా ఉంది. అయితే నిర్మాణరంగ కార్యకలాపాలు మందగమనంతో ఉండటంతోనే ఉత్పత్తికూడా తగ్గినట్లు భావిస్తున్నారు. ఉక్కు ఉత్పత్తి మాత్రం భారీగా పెరిగింది. 7.2శాతంగా ఉంది. జనవరిలో ఒక్కసారిగా 11.5శాతం నమోదయిన సంగతి తెలిసిందే. ఇక బొగ్గుపరంగా 2.3శాతం మాత్రమే ఉంది. ఎరువుల ఉత్పత్తి కూడా 3.4శాతంగా ఉంది. పెట్రోలియం శుద్ధి ఉత్పత్తులు 1శాతం క్షీణించాయి. భారత పారిశ్రామిక ఉత్పత్తిసూచీకి ఎనిమిది కీలకపరిశ్రమల డేటా 40శాతం వాటాతో ఉంటుంది. ఐఐపి జనవరిలోకూడా 0.4శాతం నమోదుచేసింది. గడచి 14 నెలలతో పోలిస్తే అత్యంత కనిష్టంగా ఉంది. ఇక వార్షిక పద్ధతిలోచూస్తే పారిశ్రామిక ఉత్పత్తిసూచీ 4.8శాతంగా ఉంది. అదే డిసెంబరులో 7.8శాతం ఉంది. ఉత్పత్తిరంగంలోనే ఎక్కువ మందగమనం నెలకొనడంతోనే కనిష్టస్థాయికి చేరిందని చెపుతున్నారు. బేసిక్ మెటల్స్ మోటార్ వాహనాలు, ట్రెయిలర్లు, సెమి ట్రెయిలర్లు నాన్‌మెటాలిక్ ఖనిజ ఉత్పత్తులు వంటివాటితో స్వల్ప వృద్ధినమోదయింది.

### కళతప్పిన ఆర్బీఐ

# విదేశీ కరెన్సీఖజానా



**ముంబయి, మార్చి 20:** భారత్ విదేశీ కరెన్సీ నిల్వలు 7.052 బిలియన్ డాలర్లు కరిగిపోయాయి. మార్చి 13తో ముగిసన వారంలో 709.759 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు ఆర్బీఐ వెల్లడించింది. మొత్తంగా రిజర్వులు అంతకుముందు వారంలోకూడా 11.683 బిలియన్ డాలర్లు తగ్గి 716.81 బిలియన్ డారల్లకు చేరాయి. తర్వాత ఫారెక్స్ ఖజానా ఆల్‌టైమ్ గరిష్టానికి అంటే 725.727 బిలియన్ డాలర్లకు చేరాయి. గతనెల 13వ తేదీతోముగిసిన వారంలోనే ఆల్‌టైమ్ గరిష్టానికి చేరాయి. విదేశీ కరెన్సీఆస్తులపరంగా కూడా క్షీణత ఉంది. 7.678 బిలియన్‌డాలర్లు పతనం అయి 555.568 బిలియన్ డాలర్లుగా నిలిచింది. ఇక బంగారం విలువలు కూడా 6.64 మిలియన్ డాలర్లుపెరిగి 130.681 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు ఆర్‌బిఐ ప్రకటించింది. ఇక ఎస్డీఆర్‌లుగా పిలిచే స్పెషల్‌డ్రాయింగ్‌రైట్స్‌కూడా 23 మిలియన్ డాలర్లు క్షీణించి 18.697 బిలియన్ డాలర్లకు చేరింది. ఐఎంఎఫ్‌వద్ద భారత రిజర్వు స్థాయి కూడా తగ్గింది. 15 మిలియన్‌డాలర్లు తగ్గి 4.814 బిలియన్‌డాలర్లుగా ఉన్నట్లు ఆర్‌బిఐ ప్రకటించింది.

### వాణిజ్యం

# బులియన్ ధరల్లో భారీ పతనం



**ముంబయి, మార్చి 20:** అమెరికా ఫెడరల్ రిజర్వ్(ఫెడ్) విధాననిర్ణయం బులియన్ మార్కెట్‌లో ప్రకంపనలు సృష్టించింది. వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచుతున్నట్లు ఫెడ్ ప్రకటించడంతో డాలర్ విలువ బలపడింది. దీనికి తోడు ట్రెజరీ బాండ్ల రాబడులు కూడా పెరగడంతో, పెట్టుబడిదారులు బంగారం, వెండి వంటి సురక్షిత సాధనాల నుంచి తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. దీనితో దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో పసిడి, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. సాధారణంగా భౌగోళిక ఉద్రిక్తతల సమయంలో పెరిగే ఈ లోహాలు, అందుకు భిన్నంగా యూటర్న్ తీసుకోవడం గమనార్హం.

మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ఈ ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఏప్రిల్ కాంట్రాక్ట్‌లో కిలో వెండి ధర కేవలం ఒక్క రోజులోనే 8 శాతం పతనమైంది. అంటే ఏకంగా19 వేలు నష్టపోయి 2.29 లక్షలకు చేరింది. బంగారం పరిస్థితి కూడా ఇదే తీరులో ఉంది. 10 గ్రాముల బంగారం (ఏప్రిల్ డెలివరీ) ధర సుమారు 4 శాతం క్షీణించింది. దాదాపు6వేలు తగ్గి 1.46 లక్షల వద్ద ట్రేడ్ అయింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో నాటికి 10గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర రూ.1.52 లక్షలుగా, కిలో వెండి ధర రూ.2.36 లక్షలుగా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ బంగారం ఔన్సు ధర గతంలో 5,000 డాలర్ల వద్ద ఉండగా, ప్రస్తుతం 4,682 డాలర్లకు దిగి వచ్చింది. స్పాట్ వెండి ఔన్సు ధర 70 డాలర్ల వద్ద కొనసాగుతోంది. మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం, వడ్డీ రేట్లు అధిక స్థాయిలో ఉన్నప్పుడు బంగారం, వెండి వంటి వడ్డీరహిత ఆస్తులపై పెట్టుబడులు తగ్గుతాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు ఫెడ్ తీసుకున్న నిర్ణయం బంగారం, వెండిపై మరింత ఒత్తిడి పెంచిందని చెపుతున్నారు. ఈ ధరల తగ్గుదలను కొనుగోలుకు అవకాశంగా చూడాలా లేక మరింత పతనం కోసం వేచిచూడాలా అనే సందిగ్ధంలో ఇన్వెస్టర్లు ఉన్నారు.

# ఆల్‌టైమ్ కనిష్టానికి రూపాయి



**ముంబయి, మార్చి 20:** అంతర్జాతీయంగా నెలకొన్న ప్రతికూల పరిణామాల నేపథ్యంలో అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, ప్రపంచ సరఫరా వ్యవస్థలో అంతరాయాల కారణంగా వారాంతపు ట్రేడింగ్‌లో రూపాయి భారీగా బలహీనపడింది. ఒకే రోజు 0.55 శాతం క్షీణించి, డాలర్‌కు 93.72 వద్ద కొనసాగింది. బుధవారం నమోదైన 92.63 కనిష్ఠ స్థాయిని కూడా ఇది అధిగమించింది. పశ్చిమాసియాలో సంక్షోభం ప్రారంభమైనప్పటి నుంచి రూపాయి విలువ దాదాపు 2 శాతం క్షీణించడం గమనార్హం. పెరుగుతున్న ముడి చమురు ధరలు, అంతర్జాతీయంగా పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గు చూపడం దీనికి ప్రధాన కారణాలని చెబుతున్నారు. రూపాయి విలువ కుప్పకూలినప్పటికీ, దేశీయ స్టాక్ మార్కెట్లు మాత్రం అనూహ్యంగాపుంజుకున్నాయి. సెన్సెక్స్ 325.72 పాయింట్లకు పైగా లాభపడగా, నిఫ్టీ దాదాపు 112.35 పాయింట్లు పెరిగింది. అయితే, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐలు) నికర అమ్మకందారులుగా కొనసాగుతున్నారు. ముందురోజే వారు రూ. 7,558.19 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించినట్లు ఎక్స్ఛేంజ్ డేటా స్పష్టం చేస్తోంది. ఇరాన్ చమురుపై ఆంక్షల సడలింపు సంకేతాలతో తగ్గిన ముడి చమురు ధరలు మరోవైపు అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు కాస్త తగ్గాయి. ఇరాన్ నుంచి సముద్ర మార్గంలో ఉన్న ముడి చమురుపై ఆంక్షలను సడలించే అవకాశం ఉందని అమెరికా సంకేతాలు ఇవ్వడంతో ధరలు దిగివచ్చాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 3.39 శాతం తగ్గి 104.96 డాలర్లకు చేరగా, యూఎస్ డబ్ల్యూటీఐ క్రూడ్ 3.22 శాతం తగ్గి 110.12 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది. పశ్చిమాసియా సంక్షోభం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు బ్రెంట్ క్రూడ్ ధర దాదాపు 40 శాతం పెరగడం గమనార్హం.

# 180 డాలర్లకు పెరగనున్న ముడిచమురు

## ధరల మంట తప్పదని సౌదీ హెచ్చరిక




**న్యూఢిల్లీ, మార్చి 20:** పశ్చిమాసియాలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం వల్ల చమురు ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఇరాన్ ఇప్పటికే హర్మూజ్ జలసంధిని మూసివేయడంతో ప్రపంచవ్యాప్తంగా రవాణా ఆగిపోయింది. ఈఉద్రిక్తతలు ఏప్రిల్ నెలాఖరు వరకు కొనసాగితే అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధర బ్యారెల్‌కు ఏకంగా 180 డాలర్ల మార్కును తాకవచ్చని చమురు దిగ్గజ దేశం సౌదీ అరేబియా హెచ్చరించింది. ప్రస్తుత సంక్షోభం కేవలం ఒక్క ప్రాంతానికి మాత్రమే పరిమితం కాలేదు. ప్రపంచ చమురు రవాణాలో 20 శాతం వాటా కలిగిన హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో నౌకల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఫలితంగా గతనెల 28వ తేదీన యుద్ధం మొదలైనప్పుడు ఒక బ్యారెల్ ధర 70 డాలర్లుగా ఉండగా అది ఇప్పటికే 119 డాలర్లకు చేరుకుంది.

హర్మూజ్ జలసంధిలో ముప్పు ఉండటంతో సౌదీ అరేబియా తన ఎగుమతుల కోసం ఎర్ర సముద్రం మార్గాన్ని ఎంచుకుంది. అయితే అక్కడి యాన్బు పోర్టు సమీపంలోని అరామ్‌కో రిఫైనరీపై కూడా డ్రోన్ దాడులు జరగడంతో పరిస్థితి మరింత దిగజారిపోయింది. రవాణా మార్గాలకు అడ్డంకులు ఏర్పడితే చమురు ధర 150 డాలర్లకు పెరగడం లో ఆశ్చర్యంలేదని విదేశాంగ నిపుణుడు అంచనావేసారు. ఒకవేళ ఏప్రిల్ చివరి వరకు ఇదే పరిస్థితి కొనసాగితే అది 180 డాలర్లకు చేరి రికార్డులు సృష్టించవచ్చని అన్నారు. భారత్ తన చమురు అవసరాల్లో దాదాపు 85 నుంచి 90 శాతం దిగుమతుల ద్వారానే భర్తీచేసుకుంటోంది. బ్యారెల్ ధర 180 డాలర్లకు చేరితే దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు ఊహించని రీతిలో పెరిగే అవకాశం ఉంది. ఇది రవాణా ఖర్చులను పెంచి, ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. ప్రస్తుతం గల్ఫ్ దేశాలు ఈ సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నప్పటికీ ఇంధన క్షేత్రాలే లక్ష్యంగా జరుగుతున్న దాడులు ఇంధన భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.